ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
వరంగల్ fb.com/vaartha
Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
25-2-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 24 పేజీలు: 8+16 వెల: 6.50

2 వేల మంది యుఎస్ ఎయిడ్ ఉద్యోగులపై ట్రంప్ వేటు
భారతీయ వంటకాల్లో 'మఖానా' సూపర్‌ఫుడ్: ప్రధాని
5

# క్షణ క్షణం.. ఉత్కంఠ


సోమవారం టన్నెల్ వద్ద ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేస్తున్న దృశ్యం

### 60 గంటలు దాటినా దొరకని ఆ 8 మంది ఆచూకీ
### మరో రెండు రోజులు రెస్క్యూ ఆపరేషన్
### ఆక్వా ఐ, ఫ్లెక్సీ ప్రోబ్ పరికరంతో సహాయక చర్యలు
### దెబ్బతిన్న కన్వేయర్‌కు మరమ్మతులు
### మల్లికార్జునుడి దయతో క్షేమంగా రావాలి: మంత్రి కోమటిరెడ్డి


సోమవారం టన్నెల్‌లో పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా దోమల పెంట ఎస్ఎల్‌బిసి టన్నల్ లో చిక్కుకున్న 8 మంది సిబ్బందిని రక్షించేందుకు రెస్క్యూ బృందాలు చర్యలు మరింత వేగవంతం చేశారు. నీటి లోపల 50మీటర్ల లోతు వరకు ఉన్న మనుషులను గుర్తించేందుకు ఆక్వా ఐ పరికరాన్ని ఉపయోగిస్తుంటారు. ఇదే పరికరంతో రెస్క్యూ సిబ్బంది టన్నెల్‌లో చిక్కుకున్న వారి ఆచూకీని గుర్తించే చర్యలు చేపట్టారు. 50 మీటర్ల లోతులో ఉన్న మనుషులను కూడా ఆక్వా ఐ పరికరం గుర్తిస్తుంది. ప్రమాదం జరిగి 60గంటలు దాటడంతో నేవీ ఆపరేషన్ కీలకంగా మారింది. 200 మీటర్ల పాటు నీరు బురద నిండిపోయి ఉండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నట్లు మంత్రి జూపల్లి తెలిపారు. ఎల్అండ్‌టి కంపెనీ నుంచి తీసుకొచ్చిన ఫ్లెక్సీ ప్రోబ్ పరికరం టన్నెల్లోకి పంపేందుకు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. >>2

## ట్రిలియన్ డాలర్ల జిడిపి వైపు
# రాష్ట్రం అడుగులు

### లైఫ్‌సైన్సెస్, ఫార్మా, బయోటెక్ రంగాల్లో రాష్ట్రం ఇప్పటికే అగ్రగామి
### నాలెడ్జ్ సిటీలో ఆమ్జెన్ ఇన్నోవేషన్ సైట్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్



సోమవారం నాలెడ్జ్ సిటీలో ఆమ్జెన్ ఇన్నోవేషన్ సైట్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి24:** అమెరికాలోనే అతి పెద్ద బయో టెక్నాలజీ కంపెనీ ఆమ్జెన్ (ఏఎంజిఈఎన్) హైదరాబాద్‌లో తమ న్యూ టెక్నాలజీ, ఇన్నోవేషన్ సైట్‌ను ప్రారంభించింది. సోమవారం రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఆమ్జెన్ కార్యాలయ ప్రాంగణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబుఆమ్జెన్ ఇన్నోవేషన్ సైట్‌నుప్రారంభించారు. ఔషధాలశ్రేణిని మరింత సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు ఆమ్జెన్ హైదరాబాద్లో ఈకొత్త సెంటర్ నెలకొల్పింది. ఏఐ, డేటా సైన్స్ డిజిటల్ సామర్థ్యాలతో ఇన్నోవేషన్ సైట్‌గా దీన్ని అభివృద్ధి చేస్తోంది. 2025 నాటికి 200 మిలియన్లు (దాదాపు రూ.1600 కోట్లు) పెట్టుబడి పెడుతుంది. రాబోయే సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులకు ప్రణాళిక చేస్తోంది.దీంతోబయో ఫార్మా రంగంలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ >>2



## ఆర్థికరంగంలో భారత్ సూపర్‌పవర్
### -ప్రధాని మోడీ

**భోపాల్, ఫిబ్రవరి 24:** ఆర్థికరంగంలో శరవేగంగా భారత్ అభివృద్ధిచెందుతున్నదని ఈ అంశాన్ని మనం చెప్పుకోడం కాదని ప్రపంచబ్యాంకు ప్రకటించిందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోజరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సోమవారం పాల్గొని ప్రసంగించారు. తాను ఆలశ్యంగా వచ్చానని అందుకు క్షమించాలన్నారు. 10,12 తరగతి విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. ఈపరీక్ష ప్రారంభమయ్యే సమయం నేను రాజ్‌భవన్‌నుంచి బయలుదేరే సమయం ఒకటే అప్పుడు నేను వస్తే భద్రతా కారణాలరీత్యా ట్రాఫిక్ జామ్ అవుతుంది. దాంతో విద్యార్థులు ఇబ్బందులుపడతారు. అందుకే వారంతా పరీక్షలకు వెళ్లినతర్వాత రాజ్‌భవన్‌నుంచి బయలు >>2

# హామీల అమలు ఇదేనా?



### ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.8,200 కోట్లు బకాయిలు
### పెన్షనర్ల పట్ల నిర్లక్ష్యంతో ప్రభుత్వం
### 14 నెలల్లో ఏ వర్గం సంతృప్తిగా లేదు
### బహిరంగ లేఖలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్,ఫిబ్రవరి24, ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువత, పెన్షనర్లు, కళాశాలల యాజమాన్యాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో విద్యార్థులకు ఫీజు రీయంబర్స్ మెంట్, ఉద్యోగుల రిటైర్డ్ మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాసారు. 14నెలల మీ పాలనలో ఆయా వర్గాలేవీ సంతృప్తిగా లేరు అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను సైతం మీరు ఉద్దేశపూర్వకంగానే నీరుగారుస్తున్నారని, వాళ్లకు దక్కాల్సిన న్యాయమైన హక్కులను కూడా కాలరాస్తున్నారని అంటూ లేఖలో పేర్కొన్నారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు రొటీన్‌గా అందాల్సిన చెల్లింపులను, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ను కూడా చెల్లించకుండా జాప్యం చేస్తూ వారిని తీవ్రమైన మానసిక ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకరం అన్నారు. పెండింగ్ డిఏలు, జిపిఎఫ్‌బకాయిలు, మెడికల్ బిల్లులు, గ్రాట్యుటీ పెన్షన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పేరుతో ఉద్యోగులు, పెన్షనర్లకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించడమనేది ప్రభుత్వ పాలనలో రొటీన్‌గా జరిగే వ్యవహారం. కానీ వాటిని కూడా మీరు చెల్లించకపోవడంవల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.8,200 కోట్లు బకాయిపడ్డారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లపట్ల మీరు అనుసరిస్తున్న నిర్లక్ష్యానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? ప్రభుత్వాన్ని నమ్ముకుని నిజాయితీగా పనిచేసే ఉద్యోగుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో, వారికి మీరు ఏ సందేశం ఇవ్వదలచుకున్నారో ఒక్కసారి ఆలోచించాలన్నారు. ఇంకా బాధాకరమైన విషయమేమిటంటే గత ఏడాది (2024) 8 వేల మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. ఈ ఏడాది మరో 10వేల మంది రిటైర్ కాబోతున్నారు. వారికి పదవీవిరమణకు సంబంధించిన ప్రయోజనాలను రూ.11 వేల కోట్ల రూపాయలు చెల్లించాలి. నేటి వరకు ఒక్కరికి కూడా చిల్లిగవ్వ కూడా ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసం? అంటూ ప్రశ్నించారు. జీతం పైసల నుండి సొంతంగా జిపిఎఫ్‌లో దాచుకున్న సొమ్మును కూడా చెల్లించకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యా యులు నిత్యం మంత్రుల పేషీల చుట్టూ, అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. దశాబ్దాల తరబడి ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులకు మీరిచ్చే ప్రతిఫలం ఇదేనా? అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో మీరు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపూరిత విధానంతో తీరుతో లక్షలాది విద్యార్థులు, వందలాది మంది కళాశాలల యాజమాన్యాలు మానసిక క్షోభను అనుభవిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇంటర్ నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్ వంటి కోర్సులను చదువుతున్న దాదాపు 13 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి విద్యను అభ్యసిస్తున్నారు. కానీ గత బిఆర్ఎస్ పాలకులు గానీ, ప్రస్తుతమున్న మీ ప్రభుత్వం కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకపోవడంవల్ల దాదాపు రూ.7,500 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయి. >>2




## తెలంగాణ, ఎపిలో 10 ఎమ్మెల్సీ సీట్లకు మార్చి 20న పోలింగ్
### 10 దాకా నామినేషన్ల స్వీకరణ
### షెడ్యూలు విడుదల చేసిన సిఇసి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి24:** ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లో త్వరలో మొత్తం 10 ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. దాంతో,ఏపీలో ఐదు, తెలంగాణలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్ సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఏపీలో ఐదుగురు ఎమ్మెల్సీల పదవీకాలం,తెలంగాణలో ఐదుగురు ఎమ్మెల్సీ పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. యనమల రామకృష్ణుడు, జంగా కృష్ణమూర్తి(గత ఏడాది మే 15నుంచి ఆయన స్థానంఖాళీ), దువ్వారపు రామారావు, పర్చూరి అశోక్ బాబు, బి.తిరుమలనాయుడు పదవీకాలం వచ్చే నెలతో ముగియనుంది. తెలంగాణలో సత్యవతి రాథోడ్(బిఆర్ఎస్), మహమూద్ అలీ(బిఆర్ఎస్), శేరి సుభాష్ రెడ్డి(బిఆర్ఎస్), ఎగ్గె మల్లేశం(బిఆర్ఎస్),మీర్జా రియాజుల్ హసన్(ఎంఐఎం)ల పదవీకాలం కూడా వచ్చే నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో, ఆయా ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు మార్చి 3న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మార్చి 10 వరకు నామినేషన్ల ప్రక్రియ ముగియనుంది. మార్చి 11న నామినేషన్ల పరిశీలన చేపడతారు. నామినేషన్ల ఉపసంహారణకు మార్చి 13 వరకు గడువు ఇచ్చారు. మార్చి 20న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపు కూడా మార్చి 20న పోలింగ్ ముగిశాక సాయంత్రం 5 గంటల నుంచి చేపడతారు. కాగా, మార్చి 24వ తేదీలోగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

**షెడ్యూలు వివరాలు:**
- ఎన్నికల నోటిపికేషన్ జారీ: మార్చి 3న
- మార్చి 10 వరకు నామినేషన్ల స్వీకరణ
- నామినేషన్ల పరిశీలన: మార్చి 11
- మార్చి 13 వరకు ఉపసంహారణ
- మార్చి 20న పోలింగ్ (ఉ.9 గంటల నుంచి సా.4 గ.వరకు)
- ఓట్ల లెక్కింపు: మార్చి 20 (పోలింగ్ ముగిసిన తర్వా సా.5 గం. నుంచి)

## పిఎం కిసాన్ పథకం కింద 19వ విడత నిధులు మంజూరు
5


వారణాసి వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన నీటిపారుదల శాఖ డిఇ వెంకట్‌రామిరెడ్డి దంపతులు (ఫైల్)

## 'కుంభ్' నుంచి వస్తూ ప్రమాదంలో ముగ్గురు మృతి
### జహీరాబాద్ నీటి పారుదల డిఇ దంపతులు, డ్రైవర్ కాశీ సమీపంలో దుర్మరణం

**జహీరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో కొనసాగుతున్న మహాకుంభమేళాకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించి కాశీవిశ్వేశ్వరుడిని దర్శించుకునేందుకు వారణాసి (కాశీకి) వెలుతున్న క్రమంలో రోడ్డుప్రమాదానికి గురై భార్యభర్తలు, కారు డ్రైవర్ మృతి చెందిన సంఘటనతో నియోజకవర్గంలో విషాద చాయలు అలుముకున్నాయి. ఇందుకు సంబంధించి పూర్తి >>2

# ఎపిని అడ్డుకోండి

### కృష్ణా జలాల్లో వాటా వినియోగం పూర్తి
### ఇక నీరు వాడకుండా ఎపిని ఆదేశించాలి
### త్రిసభ్య కమిటీ సమావేశంలో వాదించిన తెలంగాణ


సోమవారం జలసౌధలో సమావేశానికి వెళ్తున్న రాహుల్ బొజ్జా

**హైదరాబాద్, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త:** శ్రీశైలం ఎన్ఎస్‌పి నుంచి ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నీటిని వినియోగించిందని ఇక కృష్ణాజలాలు తెలంగాణ మాత్రమే వాడుకొంటుందని ఆంధ్రప్రదేశ్ వినియోగించకుండా అడ్డుకోవాలని తెలంగాణ నీటిపారుదలశాఖ ప్రిన్సిపల్‌సెక్రటరీ రాహుల్ బొజ్జ కోరారు. సోమవారం కృష్ణానది యాజమాన్య బోర్డు సమావేశం చైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో జరిగింది. రెండురాష్ట్రాల అధికారులు హాజరైనారు. శ్రీశైలం నుంచి ఉన్న పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, తదితరాల ఔట్‌లెట్ల నుంచి ఏపీ నీటి వినియోగాన్ని పూర్తి ఆపాలని రాహుల్‌బొజ్జా అన్నారు. తాగునీటి అవసరాలకోసం తమకు శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో పది టీఎంసీల చొప్పున అందుబాటులో ఉంచాలని రాహుల్ కోరారు. సముద్రంలోకి వృధాగా పోయే వరద నీటిని తాము వినియోగించుకున్నామని, పరిగణలోకి తీసుకోరాదని ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సి వెంకటేశ్వరరావు తెలంగాణ డిమాండ్‌ను వ్యతిరేకిస్తు అన్నారు. సాగర్, శ్రీశైలం కింద పంటలు ఉన్నాయని, వాటికి సరిపడా నీరు అవసరమని పేర్కొన్నారు. వరద జలాల వినియోగానికి సంబంధించి కూడా సమావేశంలో లెక్కలు తీసినట్లు తెలిసింది. నల్గొండ సీఈ అజయ్‌తో మాట్లాడేందుకు ప్రయత్నిస్తే ఎస్ఎల్బీసీ సహాయక చర్యల్లో ఉన్నందున అందుబాటులోకి రాలేదు. దీంతో ఏపీ సీఈని >>2



## జనసంద్రంలా మహాకుంభ్
### రేపు శివరాత్రి ఆఖరి ఘట్టం
### ఇప్పటి దాకా పుణ్యస్నానాలు చేసిన భక్తులు 62 కోట్లు

**ప్రయాగరాజ్, ఫిబ్రవరి 24:** యుపిలోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్ మరో రెండురోజుల్లో ముగుస్తుం దనగా భక్తులు పోటెత్తుతున్నారు. ఇప్పటివరకూ 62 కోట్లమంది పుణ్యస్నానాలుచేసారని సాక్షాత్తూ యూపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ప్రపంచదేశాలనుంచి కూడా వేలు లక్షల్లో మహాకుంభ్‌కు వస్తున్నారని, త్రివేణి సంగమంలో పవిత్రస్నానం ఆచరించేందుకు భక్తులు మరింతగా ఆసక్తిచూపుతున్నారని ప్రజల్లో నెలకొన్న భక్తిభావం వల్లనే యాత్రీకుల సంఖ్య రెట్టింపు స్థాయిలో వస్తున్నట్లు తెలిపారు. కాగా మహాకుంభమేళాపై తప్పుదారిపట్టించే కంటెంట్ సోషల్‌మీడియాలో విస్తృత ప్రచారంజరుగుతుండటంపై అధికారులుచర్యలుచేపట్టారు. మహాకుంభ్‌పై తప్పుదారిపట్టించే కంటెంట్‌ను >>2

# పెరుగుతున్న ధిక్కార స్వరం!

### బిసి గణనపై తగ్గని దుమారం
### కాంగ్రెస్‌లోనే వినిపిస్తున్న అసమ్మతి వాదం
### ఒకవర్గం తనకు కేంద్రమంత్రి పదవి రాకుండా అడ్డుకున్నారని అంజన్‌కుమార్ యాదవ్ ఆరోపణ


సోమవారం హైదరాబాద్‌లో యాదవనేతల సమావేశంలో అంజన్ కుమార్ యాదవ్ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** కాంగ్రెస్‌లో బిసి గళం రోజురోజుకు వాడిఎక్కుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీర్మార్ మల్లన్నతో పాటు, కాంగ్రెస్ సీనియర్ నేత అంజన్‌కుమార్ యాదవ్ వరకు ఒక సామాజిక వర్గంను లక్ష్యంగాచేసుకొని విమర్శలు పదునెక్కిస్తుండటంతో తెలంగాణలో రాజకీయాలు రోజురోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. కాంగ్రెస్‌లో అనాధిగా పాలనాపగ్గాలు చేతబూనిన ఒక సామాజికవర్గం లక్ష్యంగా చేసుకొని ఎప్పుడు ఏ నాయకుడు ఏ బాంబు పేలుస్తారోనన్న ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే అధికార పార్టీపై ప్రతిపక్ష నేతలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తుంటే ఇప్పుడు కొత్తగా సొంత పార్టీ నేతలే ధిక్కార స్వరం వినిపిస్తుండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీ రాగం ఎత్తుకుని సొంత పార్టీకి చెందిన ఓవర్గం వాళ్లపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయటం సర్వత్రా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో తాజాగా మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ సొంత పార్టీలోని ఓవర్గంపై తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద ఆదర్శనగర్‌లోయాదవ సామాజిక వర్గ నేతల సమావేశం నిర్వహించగా అంజన్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన చేపట్టి బీసీకులాల లెక్కలు తేల్చినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు చెప్పారు. అయితే ఈ సందర్భంగా గతంలో తనకు ఎదురైన కొన్ని సందర్భాలను ప్రస్తావిస్తూ సొంత పార్టీలోని ఓవర్గానికి చెందిన నాయకులపై తనదైన శైలిలో విమర్శలు చేశారు.

రాహుల్ గాంధీ చెప్పడం వల్లే కులగణన జరిగిందని లేకుంటే వీళ్ళు ఎప్పుడు కానిస్తుండే? అంటూ అంజన్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. >>2



సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి జూపల్లి తదితరులు

# కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదు..

## బిజెపి, బిఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం: కరీంనగర్‌లో సిఎం రేవంత్

**కరీంనగర్,ప్రభాతవార్త:** కరీంనగర్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.కరీంనగర్ నిజామాబాద్ అదిలాబాద్ మెదక్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి మద్దతుగా సోమవారం కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కాలేజి గ్రౌండ్ లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సంకల్ప సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్,మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు తో పాటు ఎమ్మెల్యేలు,కాంగ్రెస్ నాయకులు,ముఖ్య నేతలు,ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి,పట్టభద్రులు,తదితరులు పాల్గొన్నారు. పట్టభద్రుల సంకల్ప సభలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సమాజంలో మాజీ మంత్రి కేటీఆర్ అసలు మనిషే కాదని విమర్శించారు. పది నెలల్లో మేము ఇన్ని పనులు చేస్తే కేటీఆర్, బండి సంజయ్ ఏం చేయలేదు అన్నారు.ఎన్నికల్లో పోటీలో బరిలో అభ్యర్థిని నిలపాని బిఆర్ యస్ పార్టీకి మాట్లాడే అర్హత ఉందా అని ప్రశ్నించారు.మొదటిసారి అధికారం పాయే, రెండో సారి డిపాజిట్లు పాయే ఇప్పుడు అభ్యర్థి కరువాయే అని వ్యాఖ్యానించారు. అతి తక్కువ సమయంలో సమావేశం ఏర్పాటు చేసి,13,14 నెలలో మనం చేసిన పనులను కాంగ్రెస్ నాయకులు తెలియజేయాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారన్నారు.కరీంనగర్ జిల్లాకు దేశంలోనే ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆనాడు తెలంగాణ ఉద్యమం లో కీలక పాత్ర పోషించింది పట్టభద్రులె అని అన్నారు. ఎన్నికల్లో ఎ రాజకీయ పార్టీ వారి అభ్యర్థిని వారు గెలిపించుకోవడం సహజం అని తెలిపారు. బిఆర్ యస్ అభ్యర్థిని ప్రకటించలేదు మరి మీ పార్టీ వాళ్ల ఎవరికి ఓటు వెయ్యాలని దిశ నిర్దేశం చేశారో తెలపాలని ప్రశ్నించారు.. అభ్యర్థి నిలబెట్టడానికే కాండిడేట్ దొరకలేదా లేక లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకొన్నారా అని ఆరోపించారు.. 8 పార్లమెంట్ స్థానాల్లోబిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులు డిపాజిట్ దక్కలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల మద్దతుతో ప్రభుత్వం చేసిందన్నారు. 10 సంవత్సరాల లో డిఎస్సి పెట్టకుండా తాండలలో పాఠశాలను మూసివేసింది గత బిఆర్ యస్ ప్రభుత్వం కదా అని అడిగారు. తెలంగాణ రాష్ట్రంలో 5 లక్షల ఉద్యోగులు ఎప్పుడు జీతం పడుతాదో తెలియని పరిస్థితులు గతంలో ఉండేవన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మొదటి తారీకు జీతం పడితే కాంగ్రెస్ కు ఓటు వేయండి లేదంటే వేయకండి అన్నారు..

# 51 శాతమున్న బిసిలను 46 శాతానికి తగ్గించి బుకాయిస్తారా?

## కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగమంతా పచ్చి అబద్దాలు, అర్ధ సత్యాలతో నిండిపోయిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటమి ఖాయమనే భయం ఆయనలో స్పష్టంగా కన్పిస్తోంది. ఇంటెలిజెన్స్ సహా అన్ని సర్వే సంస్థలన్నీ బిజెపి గెలుపు తథ్యమని తేల్చేశాయి. కాంగ్రెస్ 3వ స్థానానికి పడిపోతుందని నివేదికలివ్వడంతో దిక్కుతోచని ముఖ్యమంత్రి హడావుడిగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వచ్చి ఒకే రోజు 3 జిల్లాల్లో 3 మీటింగ్‌ల్లో పాల్గొంటూ అబద్దాలాడుతూ, ఓటర్లను బ్లాక్ మెయిల్ చేసేలా మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. గెలిచినా ఓడినా ప్రభుత్వానికి ఢోకా లేదు నాకేం ఫరఖ్ లేదని బుకాయిస్తున్నాడని అన్నారు. అంత ధీమా ఉంటే ఎన్నికల ప్రచారానికి ఎందుకు వచ్చినట్లు? అంటూ ప్రశ్నించారు. చరిత్రలో ఇంత వరకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఏ ముఖ్యమంత్రి కూడా పాల్గొన్న దాఖలాల్లేవు. ఓటమి భయం పట్టుకుంది కాబట్టే ఎన్నికల్లో పాల్గొంటూ డబ్బు, అధికార బలంతో ఎలాగైనా గెలవాలని చూస్తున్నారని అన్నారు. దీనికితోడు ఓడిపోతే మీ సమస్యలను పరిష్కరించబోనంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. సిఎం ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్, గొర్రెల స్కాంలపై మాట్లాడిన వ్యాఖ్యలు చూస్తే ఆయన సిఎంగా ఉన్నారా? లేక మేము ఉన్నామా? అనే అనుమానం వస్తోంది. లా అండ్ ఆర్డర్ రాష్ట్రం పరిధిలోనిది. కెసిఆర్ కుటుంబం, బిఆర్ఎస్ నేతలు స్కాంలు చేసింది రాష్ట్రంలోనే అన్నారు. దొచుకున్న సొమ్మంతా తెలంగాణ ప్రజలదే. విచారణ చేస్తున్నది రాష్ట్ర ప్రభుత్వమే. కొంత మంది నిందితులను అరెస్ట్ చేసింది ప్రభుత్వమే. లా అండ్ ఆర్డర్ మీ చేతిలో పెట్టుకుని మీరేందుకు అరెస్ట్ చేయలేదని కేంద్రాన్ని నిందించడం చూస్తుంటే నవ్వొస్తుందన్నారు.

# హామీల అమలు ఇదేనా?

>> బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యం కారణంగా కాలేజీల నిర్వహణ భారమై రాష్ట్రవ్యాప్తంగా వందలాది కాలేజీలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో కాలేజీలు మూతపడ్డాయి. 90 కాలేజీ యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు సకాలంలో ఇవ్వలేని కారణంగా కాలేజీల సిబ్బంది ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. అప్పులు పెరగడంతో ఆయా కాలేజీల నిర్వహణ కూడా భారంగా మారింది. సరైన వేతనాలు చెల్లించలేకపోవడంతో విద్యా ప్రమాణాలు కూడా దెబ్బతింటున్నాయి. ఇది రాష్ట్ర విద్యావ్యవస్థకే పెనుసవాల్‌గా మారే పరిస్థితులను సృష్టిస్తుందన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సంవత్సరాల తరబడి చెల్లించకపోవడంతో తమ కాలేజీలు నడవాలంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ భారాన్ని విద్యార్థులే మోయాలని, లేనిపక్షంలో సర్టిఫికెట్లు ఇవ్వబోమని యాజమాన్యాలు తెగేసి చెబుతుండటంవల్ల సామాన్య, బడుగు బలహీనవర్గాల విద్యార్థులు అనేక మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొన్ని విద్యాసంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బిల్లుల్లో సుమారు రూ.380 కోట్ల మేరకు చెల్లిస్తామని గత ఏడాది నవంబరులో టోకెన్లను జారీ చేసినా.. ఇంతవరకు ఎటువంటి చెల్లింపులు జరపకుండా కాలేజీ యాజమాన్యాలను పాలకపార్టీ నాయకులు చుట్టూ తిప్పుకుంటున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను క్లియర్ చేస్తామని మీరు హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మంచిర్యాల, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో పర్యటిస్తున్నప్పుడు మీ సభలకు పెద్దమొత్తంలో తరలిరావాలని, కళాశాలలు మూసేసి సిబ్బందిని తీసుకురావాలని, లేకుంటే ఇబ్బంది పడతారని ఆయా జిల్లాలకాంగ్రెస్ ఎమ్మెల్యేలు కాలేజీ యాజమాన్యాలను బెదిరించినట్లు తమ దృష్టికి వచ్చింద న్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని మీరు కాలేజీ యాజమన్యాలను మళ్లీ మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. మీ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా యుద్ధ ప్రాతిపదికన తక్షణమే ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా విడుదల చేయాలని, అదే విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు చెల్లించాల్సిన పెండింగ్ డిఏలు, జిపిఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పిఆర్‌సి బకాయిలను సైతం వెంటనే విడుదల చేయాలని లేఖలో పేర్కొన్నారు.

# బంగ్లాపై న్యూజిలాండ్ గెలుపు

## ఐదు వికెట్ల తేడాతో బంగ్లా ఓటమి

**రావల్పిండి, ఫిబ్రవరి 17:** ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో న్యూజిలాండ్ మరో అద్భుత విజయం సాధించింది. ఈ మెగా టోర్నీలో భాగంగా రావల్పిండి వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐదు వికెట్ల తేడాతో న్యూజిలాండ్ గెలిచింది. దీనితో కివీస్‌జట్టు తమ సెమీస్‌బెర్త్‌ఖరారుచేసుకుంది. మరో పక్క భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓటమి పాలయి పాక్ కూడా నిష్క్రమించే పరిస్థితికి వచ్చింది. ఇక ట్రోఫీలో భారత్, కివీస్ జట్లు సెమీస్ బెర్తులు ఖరారుచేసుకున్నాయి. 237 పరుగుల లక్ష్యాన్ని కివీస్ కేవలం ఐదు వికెట్లు నష్టంతోనే 46.1 ఓవర్లలో ఛేదించేసింది. బ్లాక్‌క్యాప్స్ బ్యాటర్లలో యువ ఆటగాడు రచిన్‌రవీంద్ర అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. గాయంనుంచి కోలుకుని వచ్చిన తొలిమ్యాచ్‌లోనే రవీంద్ర సెంచరీచేసాడు. ఇన్నింగ్స్ ఆరంభంలోనే స్టార్‌ప్లేయర్లు విల్‌యంగ్, కేన్‌విలియమ్సన్ వికెట్లు కోల్పోయిన కివీస్‌ను రచిన్ ఆదుకున్నాడు. డెవాన్ కాన్వేతో కలిసి స్కోరుబోర్డును ముందుకు తీసుకువెళ్లాడు. ఈ నరకమంలో 95 బంతుల్లో తన నాలుగో సెంచరీమార్క్ రవీంద్రసాధించాడు. ఓవరాల్‌గా 105 బంతులు ఎదుర్కొన్న రచిన్ 12 ఫోర్లు ఒక సిక్సర్‌తో 112 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. ఆతడితోపాటు టామ్ లాథమ్ 55, డెవాన్ కాన్వే 30 పరుగులతోరాణించారు. బంగ్లా బౌలర్లలో టస్కిన్ అహ్మద్, నహిద్ రాణా ముస్తఫిజుర్ రెహ్మాన్, రిషాద్ చెరొక వికెట్‌తీసారు. ముందు బ్యాటింగ్‌చేసిన బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 236 పరుగులకే పరిమితం అయింది. కివీస్ బౌలర్లలో స్పిన్నర్ మైఖేల్ బ్రేస్‌వెల్ నాలుగు వికెట్లతోసత్తా చాటాడు. ఆతడితోపాటు విలియమ్ ఓరూర్క్ రెండు, హెన్రీ, జామిసన్‌లుచెరొక వికెట్ తీసారు. బంగ్లా బ్యాటర్లలో కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో 110 బంతుల్లో 9 ఫోర్లతో 77 టాప్ సోనకరుచేసాడు. జాకర్ ఆలీ 45, రిషద్ హొస్సేన్ 26పరుగులుచేసి జట్టుకు స్కోరు అందించారు.

## వారం - వర్జ్యం

తేది : 25-02-2025, మంగళవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
ద్వాదశి మ.12.48
ఉత్తరాషాఢ సా.6.30
వర్జ్యం రా.10.19-11.50
దు.ఉ.8.59-9.46
2) రా.11.12-11.49
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** ఉద్యోగాలు లాభసాటిగా సాగుతాయి. ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**వృషభం :** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. రుణవత్తిడులు తప్పవు.

**మిథునం:** ఆరోగ్యం పట్ల మెలకువ చాలా అవసరం. తీర్థయాత్రలు చేస్తారు. క్రయ విక్రయాలు.

**కర్కాటకం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**సింహం:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు.

**కన్య :** తండ్రి నుండి ధనలాభం పొందుతారు. వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు.

**తుల :** ముఖ్యమైన పనులు విజయవంతంగా పూర్తిచేస్తారు. రుణ వత్తిడులు తొలగుతాయి.

**వృశ్చికం:** సోదరులను కలిసి కష్ట సుఖాలను పంచుకొంటారు.ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**ధనుస్సు:** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. ప్రయాణాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.

**మకరం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**కుంభం:** పట్టుదలతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**మీనం:** సంఘంలో పరపతి పెరుగుతుంది. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఉత్కంఠ

>> ఫ్లెక్సీ ప్రో పరికరానికి కెమెరా అనుసంధానం చేసి సిబ్బంది ఆచూకీ గుర్తించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అయితే నిన్న 12వ కిలోమీటర్ వద్ద బురద, నీరు ఎదురు కాగా సోమవారం 10వ కిలోమీటర్ వద్దే నీరు బురద ఎదురు కావడంతో రిస్క్ ఆపరేషన్ ఇబ్బందిగా మారిందని రెస్క్యూ సిబ్బంది చెబుతున్నారు. అడుగు తీసి అడుగు వేసే పరిస్థితి లేదని నేవీ సిబ్బంది చెబుతున్నారు. రెస్క్యూ సిబ్బందికి టన్నెల్లో ఆక్సిజన్ ఇబ్బందులు కలగకుండా ఎయిర్ బ్లోయర్ పంపించి ఆక్సిజన్ అందజేస్తున్నారు. కన్వేర్ బెల్ట్ నుంచి రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్న నేవీ ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రాణాలకు తెగించి మరీ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్న నేవీ, ఆర్మీ, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు 40కిలోమీటర్ల పొడవునా ఉన్న టన్నెల్లో మరెక్కడా లోపలికి వెళ్లడానికి బయటకి రావడానికి దారులు లేవు ఒక్క ఇన్‌గేట్ తప్ప వేరే అవకాశాలు లేకపోవడంతో రెస్క్యూ మరింత ఇబ్బందిగా మారింది.

**584మంది నిపుణులు.. ఏడు సార్లు తనిఖీలు..**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లో దోమలపెంట వద్ద జరిగిన ప్రమాదంలో చిక్కుకున్న వారిని వెలికితీయడానికి కేంద్ర, రాష్ట్ర విపత్తు బృందాలతో పాటు ఆర్మీ, నేవి, సింగరేణి, కేంద్ర ప్రభుత్వ రహదారుల విభాగం, జేపీ, నవయుగ లకు చెందిన ఉన్నతాధికారుల బృందం ఇప్పటివరకు ఏడు సార్లు టన్నెల్ లో తనిఖీలు నిర్వహించాయి. వీరి బృందంలో దాదాపు 584 నిపుణులైన సిబ్బంది ఉన్నారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన విపత్తులలో ఈ బృందాలు రెస్క్యూ ఆపరేషనలను సమర్థవంతంగా నిర్వహించాయి. వీరితోపాటు 14 మంది ర్యాట్ ( ర్యాట్ హోల్ టీమ్)మైనర్స్ ల సేవలను ముమ్మరంగా ఉపయోగిస్తున్నారు. వీరితోపాటు , టన్నెల్ లో ఉన్న వారి ఆచూకి తెలుసుకునేందుకు స్నిఫ్పర్ డాగ్స్ లను కూడా రప్పించారు.అయితే, నీరు ఉన్నందున ఈ స్నిఫ్పర్ డాగ్స్ లోపలికి వెళ్లలేక పోయాయి. ఇప్పటికే డ్యామేజి అయిన కన్వేయర్ బెల్ట్ కు మరమ్మత్తులు చేపట్టారు. కాగా, టన్నెల్ లోపలికి పై నుండి రంధ్రం చేసి లోపలికి వెళ్లాలన్న (వర్టికల్ డ్రిల్లింగ్ ) ప్రతిపాదనను తోసిపుచ్చారు. 5గ్యాస్ కట్టింగ్ మిషన్లు రేయిం, పగల్లు పని చేస్తున్నాయి. కాగా, టన్నెల్ లో సహాయ కార్యక్రమాలను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోమవారం ఉదయం నుండి దోమలపెంట ప్రాజెక్టు సైట్‌లో ఉండి పర్యవేక్షిస్తున్నారు. సాయంత్రం జెపి కార్యాలయంలో సహాయ కార్యక్రమాలపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ , స్థానిక ఎమ్మెల్యే డా. వంశీ కృష్ణ, హైడ్రా కమీషనర్ రంగనాధ్, ఆర్మీ, నేవి, ఎన్‌డిఆర్ఎఫ్,ఎంఒఆర్‌టిఎహెచ్, నవయుగ, ఎస్‌సీసీఎల్, జేపి సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం విలేకరులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, టన్నెల్ లో చిక్కుకున్నవారిని వెలికితీయడానికి అన్ని ప్రయత్నాలను చేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికీ వారు సజీవంగా ఉన్నట్టు ఆశాభావం వ్యక్తం చేశారు. టన్నెల్ లో చిక్కుకున్న ఒక అధికారి మొబైల్ ఫోన్ రింగ్ అయిందని, దాని ప్రకారం సిగ్నల్ తో వారి లొకేషన్ గుర్తించామన్నారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లో చిక్కుకున్న 8 మందిని రక్షించేందుకు అన్ని ప్రయత్నాలు చేయాల్సిందిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం టన్నెల్ వద్ద జయ్‌ప్రకాష్ సంస్థ క్యాంప్ కార్యాలయంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రాబిన్స్ టన్నెల్ కంపెనీ ప్రతినిధి గ్రేస్, ఎల్‌టీ కంపెనీ ప్రతినిధి, టన్నెల్ వర్క్స్ ఎక్స్‌పర్ట్ ఇంజనీర్ క్రిస్ కూపర్‌తో పాటు డిజాస్టర్ మేనేజ్‌మెంట్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ.. అరవింద్ కుమార్, హైడ్రా కమీషనర్ ఏ.వి. రంగనాథ్, ఇండియన్ ఆర్మీ ప్రతినిధులు, ఎన్.డీ.ఆర్. ఆఫ్. ప్రతినిధులు, జయ్ ప్రకాష్ సంస్థ ప్రతినిధులు, ఇరిగేషన్ సీఈ అజయ్ కుమార్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులతో రివ్యూ నిర్వహించిన మంత్రి.. సత్వర చర్యలతో టన్నెల్ లో చిక్కుకున్న వారిని కాపాడాలని ఆదేశించారు... టన్నెల్ ప్రమాద ప్రాంతంలో బురదను తొలగించేందు కోసం సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో మాట్లాడటం జరిగింది.. ఈ రోజు 100 హెచ్.పి. మోటార్లు అరెంజ్ చేయడం జరిగింది... ఇప్పటికే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది టన్నెల్ లో చిక్కుకున్నవారిని రక్షించే చర్యలు చేపట్టారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రమాద ప్రాంతానికి చేరినట్టుగా ఎన్డీఆర్ఎఫ్ హెడ్ చెప్పారు. ప్రభుత్వం విశ్వప్రయత్నం చేస్తుందని, ఆ శ్రీశైలం మల్లికార్జునుడి దయతో వారంతా క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.



సోమవారం టన్నెల్ వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి తదితరులు

# పెరుగుతున్న ధిక్కార స్వరం!

>> తెలంగాణనే వీళ్ళు అడ్డుకున్నారని చెప్పుకొచ్చారు. సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాంగ్ డిసిషన్ తీసుకుందని నిజానికి ఈ సీటును కాంగ్రెస్ పార్టీ యాదవులకు కేటాయిస్తే తప్పకుండా గెలిచేదని అంజన్ కుమార్ తెలిపారు. యాదవులకు ఇవ్వకుండా పార్టీలోనే కొందరు అడ్డు తగిలారని ఆవేదన చెందారు. యాదవ కులస్తులను కాంగ్రెస్ పార్టీలోని ఇప్పటికీ అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని సంచలన విషయాలు చెప్పుకొచ్చారు. రాజ్యసభ సీటు యాదవులదేనని తన కొడుకు పార్టీకి చేసిన సేవలను గుర్తించి రాజ్యసభ సీటు ఇచ్చిందని చెప్పుకొచ్చారు. తనకు నేరుగా సోనియా గాంధీ, లాలూ ప్రసాద్ లాంటి వాళ్ల చెప్పడం వల్లే తనకు పీసీసీలో చోటు ఇచ్చారని అంజన్ కుమార్ వెళ్ళడించారు. మాజీ పీసీసీ, మాజీ ఎంపీగా చేసినా ఎక్కడ స్వయంగా నిలబడి ఎన్నికల్లో గెలిచింది లేదంటూ వీహెచ్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు ఓడిపోయే సమయంలో ఎంపీ టికెట్ ఇచ్చారని, గెలిచే పరిస్థితిలో ఉన్నప్పుడు ఇవ్వకుండా, ఇంట్లో కూర్చున్న వ్యక్తిని తీసుకొచ్చి సికింద్రాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చి చేజేతులా సీటు కోల్పోయేలా చేశారంటూ దానం నాగేందర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు తనకు వర్కింగ్ ప్రెసిడెంట్ ఈ భజనగాళ్లు ఇవ్వలేదని గుర్తుచేసుకొని ఆవేదన చెందారు. సోనియా గాంధీతో మాట్లాడి లాలూ ప్రసాద్ యాదవ్ తనను వర్కింగ్ ప్రెసిడెంట్ చేశారంటూ సంచలన విషయాలు వెల్లడించారు. అప్పుడు కూడా తనకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వకూడదని ఉత్తమ్ కుమార్ రెడ్డి, జగ్గారెడ్డి అడ్డు తగిలారని చెప్పుకొచ్చారు. తనకు కేంద్ర మంత్రి పదవి రాకుండా అడ్డుకుంది కూడా "ఈ" పత్రికల్లో రాయలేని పదం అంటూ ఓ సామాజికవర్గంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. వాళ్లంతా ఎమ్మెల్యేగా ఓడిపోయినా,మళ్లీ ఎంపీగా టికెట్ తెచ్చుకొని పోటీ చేస్తారని, కానీ తమకు మాత్రం టికెట్ ఇవ్వమంటే కూడా ఇవ్వరని అంజన్ కుమార్ యాదవ్ మండిపడ్డారు. ఇక నుంచి యాదవ సామాజికవర్గాన్ని తక్కువ చేసి చూసినా,పార్టీలో ప్రాధాన్యత ఇవ్వకపోయినా ఊరుకునే ప్రసక్తే లేదంటూ ఓ స్థాయిలో హెచ్చరించారు.



అస్సాంలోని గౌహతిలోని సరుసజై స్టేడియంలో సోమవారం జరిగిన ఝుమోయిర్ బినందిని 2025 కార్యక్రమంలో పాల్గొన్న నప్రధాని మోడీ

# ట్రిలియన్ డాలర్ల జిడిపి వైపు రాష్ట్రం అడుగులు

>> సెంటర్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అమ్జెన్ కార్యకలాపాల విస్తరణతో హైదరాబాద్ బయోటెక్ హబ్‌గా తన స్థానాన్ని మరింత బలోపేతమైందన్నారు. 'గత ఏడాది ఆగస్టో శాన్ ఫ్రాన్సిస్కోకు వెళ్లినప్పుడు ఆమ్జెన్ రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ సెంటర్‌ను సందర్శించాను. ఔషధాలపై పరిశోధన, కొత్త ఔషధ ఆవిష్కరణల ద్వారా ప్రజల జీవితాలను మార్చేందుకు అమ్జెన్ చేస్తున్న ప్రయత్నాలను అడిగి తెలుసుకున్నాను. మాతో భాగస్వామ్యం పంచుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున తగినంత సహకారం అందిస్తామని అప్పుడే ఆహ్వానించాను. ప్రపంచంలోనే పేరొందిన బయో టెక్ కంపెనీ ఆమ్జెన్ ఇప్పుడు హైదరాబాద్లో ఇన్నోవేషన్ సెంటర్ నెలకొల్పడం ఆనందంగా ఉంది' అని పేర్కొన్నారు. 'తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్ రంగాల్లో అగ్రగామిగా ఉంది. ట్రిలియన్ డాలర్ల జీడీపీ సాధించే లక్ష్యంతో తెలంగాణ అడుగులేస్తోంది. చైనా ప్లస్ వన్ గమ్యస్థానంగా హైదరాబాద్‌ను ప్రపంచంలోనే గొప్ప నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తోంది' అని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వచ్చే పరిశ్రమల అభివృద్ధి, దీర్ఘకాలిక విస్తరణ ప్రణాళికలను తప్పకుండా మా ప్రభుత్వం సహకరిస్తుందని,పరిశోధనలు, నైపుణ్యాల అభివృద్ధి, విద్యలో భాగస్వామ్యం పంచుకునే కార్యకమాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

**హైదరాబాద్ అంటేనే భవిష్యత్తు: శ్రీధర్‌బాబు**

అమ్జెన్ వంటి ప్రపంచ అగ్రగామి సంస్థలు రాష్ట్రానికి రావటం కొత్త అవకాశాలను తెచ్చి పెడుతుందని ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బయోటెక్, టెక్నాలజీ రెండింటి సమ్మిళితంగా ఆవిష్కరణలకు కొత్త వేదిక ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. త్వరలోనే హైదరాబాద్ వరల్డ్ బయోటెక్ హబ్ గా మారుతుందని ఆకాంక్షను వ్యక్తం చేశారు. హైదరాబాద్ అంటేనే భవిష్యత్తు అని, పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉండటంతోనే ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు అనేక దిగ్గజ కంపెనీలు ముందుకొస్తున్నాయన్నారు. ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు తమ కార్యాలయాలు ఇక్కడ ఉన్నాయన్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)కు హైదరాబాద్ హబ్ గా మారిందన్నారు. నైపుణ్యమున్న మానవ వనరుల హబ్ గా తెలంగాణను మార్చేందుకు స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. పరిశ్రమల భాగస్వామ్యంతో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతకు ఉద్యోగాలు దక్కేలా కోర్సులను అందిస్తున్నామన్నారు. తమ కార్యాలయాన్ని హైదరాబాద్ లో ఏర్పాటు చేయాలని ఏడాది కిందట అమ్జెన్ యాజమాన్యాన్ని కోరినట్లుగా వివరించారు. ఈ క్యాంపస్ లో ఏడాది చివరి నాటికి ఉద్యోగుల సంఖ్య 600, రాబోయే రోజుల్లో 2వేలకు చేరుతుందన్నారు. అమ్జెన్ భాగస్వామ్యంతో బయో టెక్నాలజీ రంగంలో నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణలోని విశ్వ విద్యాలయాలు, స్టార్టప్స్, పరిశోధన సంస్థలతో కలిసి పని చేయాలని అమ్జెన్ ప్రతినిధులను కోరారు.రోగులకు మెరుగైన సేవలందించడానికి, ప్రపంచవ్యాప్తంగా నెట్‌వర్క్‌తో పాటు సాంకేతికతను ఉపయోగించుకోవాలనే మా ప్రయత్నంలో ఈ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం కొత్త మైలురాయిని సూచిస్తుందని అమ్జెన్ ఛైర్మన్, చీఫ్ ఎగ్జ్యూటివ్ ఆఫీసర్ రాబర్ట్ ఎ.బ్రాడ్‌వే అన్నారు. సంస్థ విస్తరణకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు వంద దేశాల్లో అమ్జెన్ కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఈ సంస్థలో 28 వేల మంది ఉద్యోగులున్నారు. ప్రపంచంలో అత్యంత సంక్లిష్టమైన వ్యాధులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో లక్షలాది మంది రోగులకు ఆరోగ్యం అందించేందుకు అమ్జెన్ వినూత్నమైన ఔషధాలను కనుక్కొని తయారు చేస్తోంది. 40 ఏళ్ల కిందట అమ్జెన్ బయోటెక్ ఫార్మా పరిశ్రమను స్థాపించింది. క్యాన్సర్ గుండె జబ్బులు, ఎముకల వ్యాధి, ఇన్‌ఫ్లమేటరీ వ్యాధులు, అరుదైన వ్యాధుల చికిత్సరే ఇప్పటికే ఉన్న ఔషధాలతో పాటు విస్తృతమైన, లోతైన పరిజ్ఞానంతో అమ్జెన్ తమ ఉత్పతులను అభివృద్ధి చేస్తోంది కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, అమ్జెన్ ఛైర్మన్, సీఈవో రాబర్ట్ ఎ. బ్రాడ్‌వే, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్, అమ్జెన్ ఇండియా ప్రతినిధి సోమ్ చటోపాధ్యాయ,అమ్జెన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ గుల్లపల్లి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో ముగ్గురు మృతి

>> వివారల్లోకి వెళితే... జహీరాబాద్ నీటి పారుదల శాఖ డిఈగా విధులు నిర్వహిస్తున్న న్యాల్‌కల్ మండలంలోని మామిడ్డి గ్రామానికి చెందిన వెంకట్‌రాంరెడ్డి (ప్రస్తుత నివాసం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో) తన అర్ధాంగి విలాసినితో కలిసి కారులో ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లారు. త్రివేణి సంగమంలో దంపతులు పుణ్యస్నానాలు ఆచరించి కాశీలో కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకునేందుకు కారులో వెళుతుండగా కారు డ్రైవర్ మల్లారెడ్డి (న్యాల్‌కల్ మండలంలోన మల్గి గ్రామ వాసి) స్కూటర్‌ను తప్పించబోయి ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికి అక్కడే మృతి చెందారు. మృతి చెందిన దంతపులు, డ్రైవర్ న్యాల్‌కల్ మండలానికి చెందిన వారు కావడంలో న్యాల్‌కల్ మండలంలో విషాద చాయలు అలుముకున్నాయి.

# జనసంద్రంలా మహాకుంభ్

>> వ్యాప్తిచేసిన 140 సోషల్‌మీడియా ఖాతాలపై కేసులు నమోదుచేసినట్లు మహాకుంభ్ డిఐజి వైభవ్‌కృష్ణ తెలిపారు. ఆయా సోషల్‌మీడియా ఖాతాలపై 13 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. ఇక ఈ మహాకుంభమేళా ముగింపురోజు ఫిబ్రవరి 26న జరగనున్న మహాశివరాత్రి పండుగకు అవసరమైన అన్ని ఏర్పాట్లుపూర్తిచేసినట్లు ఆయన వెల్లడించారు. జనవరి 13వ తేదీ ప్రారంభం అయిన ఈ మహాకుంభ్‌మేళా ఈనెల 26వ తేదీతోముగుస్తుంది.

# ఎపిని అడ్డుకోండి

>> మంగళవారం నల్గొండ వెళ్లి అక్కడే మాట్లాడాలని కెఆర్ఎంబి ఛైర్మన్ అతుల్ జైన్ సూచించారు.కృష్ణానది జలాల పంపకాలపై అతుల్‌జైన్ మాట్లాడుతూ త్రిసభ్యకమిటి సమావేశం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. నీటి అవసరాలపై ఇరు రాష్ట్రాల సిఇలు అంచనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని ఏక పక్షంగా ఉండకూడదని కెఆర్ఎంబి సూచించింది.నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల కింద రెండు రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న పంటలను దృష్టిలో ఉంచుకొని నీటి అవసరాలపై ఓ నిర్ణయానికి రావాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్ సూచించారు. రెండు రాష్ట్రాల సంబంధిత చీఫ్ ఇంజనీర్లు మంగళవారం సమావేశమై ఓ అభిప్రాయానికి రావాలని కెఆర్ఎంబి ఛైర్మన్ పేర్కొన్నారు.

# ఆర్థికరంగంలో భారత్ సూపర్‌పవర్

>> దేరాలనుకున్నాను. దాంతో 15-20 నిమిషాలు ఆలస్యం అయింది.మీకు అసౌకర్యం కలిగించినందుకు మన్నించాలి అంటూ మోడీ తన వివరణ ఇచ్చుకున్నారు. భారత ఆర్థిక వ్యవస్థపై ప్రపంచం ఎంతో ఆశాభావంతో ఉందనిమోడీ అన్నారు. జనాభా పరంగా మధ్యప్రదేశ్ ఐదో అతిపెద్ద రాష్ట్రం అని వ్యవసాయం ఖనిజాలపరంగా ముందున్నదని, రెండుదశాబ్దాలుగా ఈరాష్ట్రంలో ఎన్నో మార్పులు సంభవించాయని ఇక్కడ బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం సుపరిపాలనపైనే ఫోకస్ పెంచిందని 20 ఏళ్లకుముందు ఇక్కడికి రావాలంటే ఇన్వెస్టర్లు ఆలోచించేవారని గుర్తుచేసారు. అయితే ఇపుడు పెట్టుబడుల పరంగా ముందున్నదని సౌరశక్తిలో భారత్ సూపర్‌పవర్‌గా మారిందని ఐక్యరాజ్యసమితికి చెందినొ క విభాగం కీర్తించిన అంశాన్ని ప్రధాని గుర్తుచేసారు. మంగళవారం కూడా ఈ సదస్సు జరుగుతుంది. దీనికి 60 దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, వివిధ దేశాల దౌత్యవేత్తలు కూడా హాజరయ్యారు. భారత వ్యాపారరంగ ప్రముఖులు కుమార్‌మంగళం బిర్లా, గౌతమ్ ఆదాని, నాదిర్‌గోద్రెజ్ తదితరులు కూడా వచ్చారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ రాకతో కాంగ్రెస్ ఆశావహుల్లో ఉత్కంఠ

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్ని కల నగరా మ్రోగడంతో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ పదవి ఆశించే ఆశావాహుల్లో ఉత్కంఠ పెరిగింది. తెలంగాణ శాసనమండలిలోని ఐదు స్థానాలు ఖాళీ అవుతున్నాయి.కాంగ్రెస్‌పార్టీ ప్రస్తుత శాసనసభ్యుల బలాబలాను బట్టి నలుగురికి ఎమ్మెల్సీగా పదవులు వచ్చే అవకాశం ఉంది. ఈ స్థానాల కోసం కాంగ్రెస్‌పార్టీ నుంచి ఐదు సామాజికవర్గాలకు చెందిన అభ్యర్థులు 15మంది కాంగ్రెస్ నాయకులు పోటిపడుతున్నారు. కాంగ్రెస్‌పార్టీ శాసనసభ,లోక్‌సభ ఎన్నికలలో ఓటమిపాలైనవారికి రాజకీయ ఉపాధి కల్పించడానికి శాసనమండలి ఎన్నికలను ఉపయోగించదని స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నా,తెరపై మాత్రం ఓటమిపాలైన అగ్రనేతపేర్లు కనిపిస్తున్నాయి. ఎలాగైనా శాసనమండలిలో పాగావేయాలని రెడ్డి సామాజికవర్గం నుంచి జగిత్యాల ఎమ్మెల్యేగా, నిజామాబాద్ ఎంపిగా ఓటమిపాలైన జీవన్‌రెడ్డి, సంగారెడ్డి నుంచి ఓటమిపాలైన జగ్గారెడ్డి, కమ్మ సామాజిక వర్గంకుచెందిన కుసుమకుమార్‌లు పోటిపడుతున్నారు. మైనార్టీ నుంచి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ,అజారుద్దీన్,ఫిరోజ్‌ఖాన్,ఖురేషీలు ఎమ్మెల్సీ అందలం ఎక్కాలని ఆశిస్తున్నారు. బిసి సామాజిక వర్గం నుంచి అంజన్‌కుమార్‌యాదవ్,వద్రేష్ యాదవ్,2014 నుంచి వరుస ఓటమిని రుచి చూస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రచారకమిటి అధ్యక్షుడు మధుయాష్కీగౌడ్,గోషామహల్ నుంచి పోటీ చేసి ఓడిపోయినా మహిళా కాంగ్రెస్‌సభ్యత్వ నమోదులో జాతీయ స్థాయిలోనే ముందు వరుసలో ఉన్న టిమహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు ఎలాగైనా శాసనమండి అనే దొడ్డిగుమ్మం నుంచి చట్టసభల్లో అడుగుపెట్టాలని యోచిస్తున్నారు.జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబాతో ప్రియాంకగాంధీతో సిఫార్సులు చేయించుకొంటున్నారని చర్చ జరుగుతోన్నది. ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఏఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్, అద్దంకి దయాకర్ పోటీ పడుతున్నారు.

మాదిగ సామాజికవర్గంకు చెందిన సంపత్‌కుమార్‌కు అవకాశాలు ఎక్కవగా ఉన్నప్పటికి ప్రతిపక్షంలో ఉండగా అద్దంకి దయాకర్ చేసిన పోరాటాలను కూడా పరిగణలోకి తీసుకొని అవకాశం ఇవ్వడానికి ప్రాధన్యత ఇస్తున్నారు. స్థానికంగా ఉండే రాజకీయపరిస్థితులు ఇద్దరిలో ఒకరికి అత్యంత క్లిష్టపరిస్థితి కలిగించేలా ఉన్నాయని తెలిసింది. ఎస్టీ నుంచి బెల్లయ్య నాయక్, రాములు నాయక్ పోటి పడుతున్నారు. ఎస్సీ,ఎస్టీ సామాజిక వర్గంలో నలుగురిలో ఎవరోఒకరికి మాత్రమే ఈ దఫా అవకాశం లభించే అవకాశం ఉంది. మరోవైపు సిపిఐ కూడా గట్టిగా ఒక్క స్థానం మాకు వదిలిపెట్టాలని డిమాండ్ చేస్తున్నది. వారికి ఒకటి ఇస్తే రెండు సామాజిక వర్గాలకు ఈ దఫా అవకాశం కల్పించడానికి వీలు చిక్కకపోవచ్చు. ప్రతికూల పరిస్థితిలో పాలన కొనసాగుతున్న ప్రస్తుతదశలో ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్‌పార్టీకి ఒక అగ్ని పరీక్షగా మారింది.

స్థానిక సంస్థల ఎన్నికలు కూడా వాయిదా వేయించుకున్నా గ్రాడ్యుయేట్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ భవిష్యత్ నిర్ణాయాత్మకంగా ఫలితాలు ఉండబోతున్నది.ఎమ్మెల్సీ నామినేషన్ ప్రక్రియ మార్చి 3 నుంచి 10వ తేదీ వరకు ఉండటంతో వచ్చే పక్షం రోజులు పార్టీలో అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ హైకమాండ్ మల్లాగుల్లా పడి అభ్యర్థులను నిర్ణయించాల్సి ఉంటుంది.

## మార్చి 4, 5 తేదీల్లో సిఇఒలతో కేంద్ర ఎన్నికల సంఘం సదస్సు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** కేంద్ర ఎన్నికల సంగం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్య ఎన్నికల నిర్వహణాధికారులతో సమావేశం అవుతోంది. వచ్చే మార్చి 4,5 తేదీల్లో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ సదస్సు ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ, ఎలక్షన్ మేనేజ్ మెంట్ సంస్థలో నిర్వహించనున్నది. ఎన్నికల నిబంధనల ప్రకారం సిఇఒలు, డిఒలు, ఇఆర్ఒలు ఎంతో కీలకం. రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో వీరి బాధ్యతలు కీకలంగా ఉంటాయి. ఎన్నికల కాలంలో వీరే అత్యంత కీలకంగా ఉంటారు. అందువల్లనే వీరికి మరింత అవగాహన పెంచడంతోపాటు ఇప్పటివరకూ వారుపనిచేసిన అనుభవాలను సదస్సులో వివరించడంకోసం కూడా ఈ సదస్సు ఉపకరిస్తుందని ఎన్నికల సంఘం చెపుతోంది. అంతేకాకుండా దేశవ్యాప్తంగా వచ్చే సిఇఒల అనుభవాలు ఒకరికొకరు పంచుకునేందుకు వీలు కలుగుతుంది. ఇటీవలే కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్, కమిషనర్‌గా వికాస్ శుక్లాలు నియమితులయిన సంగతి తెలిసిందే. ఈసదస్సుకు మొదటిసారి రాష్ట్రాలపరంగా ఉన్న సిఇఒలు ఒక జిల్లా ఎన్నికల అధికారి, ఒక ఎలక్షన్ రిటర్నింగ్ అదికారిని కూడా సమావేశానికి పంపించాలని సూచించారు. మొదటిరోజు సదస్సులో ఎన్నికల పర్యవేక్షణలో ఐటి నిర్మాణ క్రమం, శక్తివంతమైన సమాచారమార్పిడి, సోషల్‌మీడియా ఔట్‌రీచ్, వివిధ అధికారుల చట్టబద్ధమైన విధులు వంటివి చర్చిస్తారు. రెండోరోజు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సిఇఒలు తమతమ కార్యాచరణలను సదస్సులో వివరిస్తారు.

## పెళ్లి వయసు రాలేదన్నందుకు ఒకరిపై బాలుడు కత్తితో దాడి!

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** సినిమాలు, సోషల్ మీడియా ప్రభావం వల్ల మైనర్లు ప్రేమ అంటూ వెంపర్లాడడం, దీనికి ఎవరైనా అడ్డు చెబితే వారిపై దాడిచేయడం ఇటీవల కాలంలో పరిపాటిగా మారింది. నిర్మల్ పట్టణంలో ఇటువంటి ఘటన జరిగింది. ఎస్‌పి రాజేశ్‌మీనా తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక వైఎస్ఆర్ కాలనీకి చెందిన 16 యేళ్ల బాలుడు స్థానికంగా మేస్త్రీ పనిచేస్తున్నాడు. తన ఈడు వయస్సు కలిగిన బాలికను నాలుగేళ్లుగా ఇష్టపడుతున్నాడు. అయితే ఆ బాలిక ఇతన్ని ఇష్టపడం లేదు. బాలిక ఇష్టంతో సంబంధం లేకుండా ఆ బాలుడు తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని బాలికను కోరగా అందుకు బాలిక తిరస్కరించింది. దీంతో ఆ బాలుడు నేరుగా బాలిక తండ్రి వద్దకు వెళ్లి నీ కూతురును నేను ప్రేమిస్తున్నానని, వెంటనే మా ఇద్దరికి పెళ్లి చేయాలని కోరాడు. దీంతో ఆ బాలిక తండ్రికి కోపం వచ్చి నీ వయస్సెంత? ఈ వయస్సులో పెళ్లి ఏమిటీ? ముందు వివాహం వయస్సు రానీ ఆ తరువాత చూద్దాం.. అని బాలుడిని మందలించాడు. దీంతో ఆ బాలుడు తన స్నేహితుడు తౌసిఫ్ ఉల్లా (20) అనే యువకుడితో కలిసి బాలిక తండ్రిపై ఆదివారం రాత్రి కత్తితో దాడిచేసి పారిపోయాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాలిక తండ్రిని పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పింది. కాగా ఈ దాడికి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో బాలుడిని జువైనల్ హోంకు, యువకుడిని జైలుకు రిమాండుకు తరలించారు.

## ఎపి ఫైబర్‌నెట్ ఛైర్మన్ జివిరెడ్డి రాజీనామా

### ఎండి దినేశ్‌కునార్‌పై బదలీ వేటు

**విజయవాడ, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవికి జీవీ రెడ్డి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవితో పాటు టీడీపీ ప్రాథమిక సభ్యత్వం, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పదవి నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబుకు తన రాజీనామా లేఖను పంపించారు. వ్యక్తిగత కారణాలతో టీడీపీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు జీవీ రెడ్డి వెల్లడించారు. తనపై ఉంచిన విశ్వాసం అందించిన మద్దతుతో పాటు కీలక బాధ్యతలు నిర్వహించేందుకు అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీపీ మరింత బలంగా ఎదిగి ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఇకపై పూర్తిగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతానని భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీలోనూ చేరే ఉద్దేశం లేదని జీవీ రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలో జీవీరెడ్డి రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది.ఇదే సందర్భంలో ఫైబర్ నెట్ ఎండి దినేష్‌కునార్‌పై బదలీ వేటును ప్రభుత్వం వేసింది. ఆయన వెంటనే సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.



జివి రెడ్డి

## ఇంటర్ విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు జారీ

### కాలేజీల లాగిన్‌లలో అప్‌లోడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మార్చి 5 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఇంటర్ బోర్డు విడుదల చేసింది. ఇంటర్ విద్యార్థుల హాల్ టిక్కెట్లను జారీ చేసినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టిక్కెట్‌లను కళాశాల లాగిన్‌లకు అప్‌లోడ్ చేశారు. విద్యార్థులు తమ సంబంధిత కళాశాలల నుండి తమ హాల్ టిక్కెట్‌లను తీసుకోవాలని సూచించారు. హాల్ టికెట్లలో ఏమైనా తప్పులు, తేడాలు ఉంటే, వారు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌లను సంప్రదించాలని సూచించారు. హాల్ టిక్కెట్లు కూడా తగిన సమయంలో విద్యార్థులకు వ్యక్తిగతంగా పంపబడతాయని తెలిపారు. రాష్ట్రంలో ఈ మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో 9.96 లక్షల మంది విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరు కానున్నారు.

# ఎఐ సిటీలో పెట్టుబడులు పెట్టండి

### క్వీన్స్ లాండ్ ప్రభుత్వ ప్రతినిధులను కోరిన మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న ఎఐ సిటీలో పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా క్వీన్స్ లాండ్ ప్రభుత్వ ప్రతినిధులను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. క్వీన్స్ లాండ్ రాష్ట్ర ఫైనాన్స్, ట్రేడ్, ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ మంత్రి రాసిన్ బేట్స్ ఆధ్వర్యంలోని బృందం సోమవారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాససముదాయంలో మంత్రి శ్రీధర్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా తెలంగాణ క్వీన్స్ లాండ్ మధ్య ప్రాధాన్య రంగాల్లో సంబంధాలను మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. త్వరలో రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ గురించి ప్రత్యేకంగా వివరించామన్నారు. జీవ విజ్ఞానం, ఔషధ తయారీ రంగంలో అగ్రగామిగా ఉన్న తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ప్రతినిధుల బృందం ఆసక్తి వ్యక్తం చేసిందన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే క్రీడా విశ్వ విద్యా లయానికి సహకరించాలని కోరగా అంగీకరించారన్నారు.

స్కిల్ యూనివర్సిటీ ఏర్పా టును ప్రత్యేకంగా అభినందించారని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన కోర్సులపై బృంద సభ్యులు ఆసక్తి వ్యక్తం చేశారన్నారు. రాబోయే రోజుల్లో తాము కూడా భాగస్వామ్యం అవుతామని చెప్పారన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో విద్య, ఆర్అండ్‌డి, వ్యవసాయం తదితర అంశాల్లో కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. కార్యక్రమంలో క్వీన్స్ లాండ్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సిఇఒ జస్టిన్ మెక్‌గవాన్, ఆస్ట్రేలియన్ కాన్సుల్ జనరల్(బెంగళూర్) హిల్లరీ మెక్‌గెచీ, ఆస్ట్రేలియన్ కాన్సుల్ జనరల్(బెంగళూర్) కన్సుల్ ఆండ్రియా కాలిస్టర్, పాలసీ రీసెర్చ్ అసోసియేట్ కృతికా సుబ్రహ్మణ్యన్, ట్రేడ్ కమిషనర్ అభినవ్ భాట్ల, మనీష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



## కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణలో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టేటస్‌కో

### గెజిటెడ్ లెక్చరర్ల అసోసియేషన్ హర్షం

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు క్రమబద్ధీకరణ కు సంబంధించి జీవో నెంబర్ 16పై నవంబర్ 19న తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోమవారం సుప్రీంకోర్టు బెంచ్ నెంబర్ 5 ధర్మాసనం స్టేటస్ కో ఇచ్చిందని.. తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 (టీజీజేఎల్ఏ-475) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వసుకుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ తెలిపారు. సోమవారం సుప్రీంకోర్టులో జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనంలో .. తెలంగాణ హైకోర్టు నవంబర్ 19 ఇచ్చిన తీర్పుపై విచారణకు వచ్చింది. తెలంగాణ హైకోర్టులో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్న 16 జీవోపై తీర్పిస్తూ, ఇప్పటికే రెగ్యులర్ అయిన వాళ్ళని కొనసాగించవచ్చని, ఇకముందు తెలంగాణ రాష్ట్రంలో జీవో నెంబర్ 16 ప్రకారం ఎవరిని రెగ్యులర్ చేయొద్దని జీవో నెంబర్ 16 కొట్టివేస్తూ తీర్పు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. హైకోర్టు తీర్పుపై పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారని.. ఈ నేపథ్యంలో తమ సంఘం నుంచి కూడా సుప్రీంకోర్టులో కేసులు వేస్తూ, జీవో నెంబర్ 16 కొనసాగించాలని, వివిధ కారణాలతో కాంట్రాక్ట్ లెక్చరగా పనిచేస్తూ క్రమబద్ధీకరణ కాని వారిని క్రమబద్ధీకరించాలని కోరామన్నారు. వాదనల అనంతరం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టేటస్ కో ఇచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో వెంటనే తెలంగాణ ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇంకా వివిధ కారణాలతో క్రమబద్ధీకరణ కాని వారిని వెంటనే క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మహిళలకు మరో కానుక అందించనున్న సర్కారు

### ఉమెన్స్ డే సందర్భంగా గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంక్‌లు

### కసరత్తు చేస్తున్న అధికారులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. మహాలక్ష్మీ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. దీంతో పాటుగా రూ.500కే గ్యాస్ సిలిండర్ కూడా ఇస్తోంది. మరికొన్ని పథకాల అమలుకు కూడా రెడీ అయింది. రాష్ట్రంలో తెలంగాణ మహిళలకు కొత్త పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా మార్చి 8న కొత్త పథకాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోన్నట్లు సమాచారం. జిల్లా కేంద్రాల్లో మహిళలకు పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలను ఇప్పించేందుకు ఇప్పటికే చమురు సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది.

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల రిటైర్మెంట్ ప్రయోజనాలను రూ.2 లక్షలు, రూ.లక్షలకు పెంచుతున్నట్లు ఇది వరకే ప్రకటించగా.. మార్చి 8న అధికారిక ఉత్తర్వులు వెల్లడించే ఛాన్స్ ఉంది. డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ చెక్కులు, గతంలో ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అభయహస్తం సొమ్ములను మహిళల ఖాతాల్లో జమ చేసేందుకు సిద్ధమైంది. అలాగే అంగన్వాడీలు, సహాయ సంఘాల సభ్యులకు చీరలు అందించనుంది.

ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో కొన్ని గ్యారంటీలను అమలు చేస్తోంది. అయితే ఆరు గ్యారంటీల్లో ముఖ్యమైంది.

మహిళలకు నెలకు రూ.2500. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావొస్తున్న ఈ పథకం ఇంకా అమలు కాలేదు. దీంతో చాలా మంది మహిళలు నెలకు రూ.2500 పథకం కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఈ పథకం అమలుపై కీలక కామెంట్స్ చేశారు. మీడియాతో చిట్ చాట్‌గా సందర్భంగా త్వరలోనే మహాలక్ష్మీ పథకం కింద మహిళల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో మార్చి 8న ఈ పథకాన్ని కూడా ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# ఆరుగురు కర్ణాటక భక్తులు మధ్యప్రదేశ్‌లో దుర్మరణం

### కుంభ్ నుంచి తిరిగి వస్తుండగా దుర్ఘటన

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నాటకలోని బెలగానికి చెందిన ఆరుగురు దుర్మరణం చెందారు. వీరంతా ప్రయోగరాజ్‌లో కుంభమేళకు వెళ్లి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న జీపు జబల్‌పూర్ వద్ద జాతీయ రహదారిపై అదుపుతప్పి డివై డర్‌ను ఢీకొని పల్టీ కొట్టి మరో మార్గంలో వస్తున్న ప్రైవేటు బస్సును ఢీ కొంది. ఈ దుర్ఘటనలో జీపులో ప్రయాణిస్తున్న పది మందిలో ఆరుగురు అక్కడికక్కడే మరణించ గా ఇద్దరు తీవ్రంగా గాయపడగా వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వీరి పరి స్థితి కూడా విషమంగా వుందని పోలీసులు చెబుతున్నారు. కాగా ఈ ప్రమా దంపై మధ్యప్రదేశ్ పోలీ సులు కర్నాటక ప్రభుత్వానికి సమాచారం అందించి చనిపోయిన వారి మృతదేహాలను వారి స్వస్థలా లకు పంపేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారు బెలగానికి చెందిన వ్యాపారులుగా పోలీసులు తెలిపారు.

**కామారెడ్డిలో నలుగురికి గాయాలు..**

కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన నలుగురు గాయపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన వీరంతా కుంభమేళకు వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో వీరు ప్రయాణిస్తున్న కారు బోల్తా పడింది. దీంతో కారులో వున్న నలుగురు స్వల్పంగా గాయపడ్డారు.

ప్రమాదం విషయం తెలిసిన వెంటనే పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని గాయపడ్డ వారికి చికిత్స చేయించి, అనంతరం హైదరాబాద్‌కు వేరే వాహనంలో పంపారు. ప్రమాదానికి కారణ మైన లారీపై కేసు నమోదు చేశారు.

# నేటితో ముగియనున్న జెఇఇ మెయిన్ ఫేజ్-2 దరఖాస్తు గడువు

### ఏప్రిల్ 1 నుంచి 8 వరకు పరీక్షలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** దేశంలోని ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీల్లో బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ)-2025 మెయిన్ ఫేజ్-2 దరఖాస్తుల ప్రక్రియ నేటి(మంగళవారం ఫిబ్రవరి 25)తో ముగియనుంది. దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 1 నుంచి ప్రారంభం కాగా.. నేటితో దరఖాస్తు గడువు ముగియనున్నట్టు ఎన్‌టీఏ ప్రకటించింది. జేఈఈ మెయిన్ ఫేజ్-2 పరీక్షలను ఏప్రిల్ 1 నుంచి 8 వరకు నిర్వహించనున్నారు. జేఈఈ మెయిన్ ఫేజ్-1లోనే రెండు విడతలకు దరఖాస్తు చేసుకున్నవారు .. మరోసారి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు.గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే రెండో విడత జేఈఈ మెయిన్ పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అయితే జేఈఈ మెయిన్‌ఫేజ్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగియగా.. ఫలితాలను సైతం విడుదల చేశారు. మొదటి విడత జేఈఈ మెయిన్ పరీక్షలను దేశంతోపాటు ఇతర దేశాల్లో కలిపి 598 పరీక్షా కేంద్రాల్లో 284 నగరాల్లో పరీక్షను నిర్వహించారు. దేశవ్యాప్తంగా 13,78,232 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 13,00,273 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఫేజ్-1 పరీక్షలను గత నెల 22, 23, 24, 28, 29 నిర్వహించగా.. అదే నెల 30న బీఆర్క్, బీ ప్లానింగ్ సీట్ల కోసం పేపర్-2 పరీక్షను నిర్వహించారు. పేపర్-2 ఫలితాలను ఆదివారం విడుదల చేశారు.



## రాజస్థాన్‌లో బోరుబావిలో చిన్నారి

### 16 గంటలు శ్రమించినా దక్కని ప్రాణం!

**జైపూర్, ఫిబ్రవరి 24:** బోరుబావి మరో చిన్నారి ఉసురు తీసింది. అయిదేళ్ల బాలుడిని బయటకు తీసుకువచ్చేందుకు 16 గంటలపాటు చేసిన ఆపరేషన్ విఫలం కావడంతో ఆ ఇంట్లో కన్నీరే మిగిలింది. రాజస్థాన్‌లోని ఝలావర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. పరాలియా గ్రామానికి చెందిన కలులాల్ బగారియా తల్లిదండ్రులతో కలిసి పొలానికి వెళ్లాడు. వారు పనులు చేసుకుంటుండగా వారికి దగ్గర్లోనే ఆడుకుంటూ పొరపాటున బోరుబావిలో పడిపోయాడు. అది 32 అడుగుల లోతు ఉంది. ఈ సమాచారంఅందుకున్న అధికారులు సహాయచర్యలు ప్రారంభించారు. విపత్తు ప్రతిస్పందన దళాలు 16 గంటలపాటు నిర్విరామంగా పనిచేశారు. బాలుడి కోసం పైపు ద్వారా ఆక్సిజన్ పంపారు. కానీ ఆ ప్రయత్నాలేవీ ఫలించలేదు. సోమవారం బాలుడిని బయటకు తీసినప్పటికే మృతి చెందాడని గాంగధర్‌ఎస్‌డిఎం ఛతర్‌పాల్ చౌధరి వెల్లడించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కొన్ని నెలల క్రితం రాజస్థాన్‌లో ఇదే తరహా ఘటన జరిగింది. కోట్‌పుత్లీ జిల్లాలోని కిరాట్‌పుర గ్రామానికి చెందిన మూడేళ్ల చేతన డిసెంబర్ 23న తన తండ్రితో కలిసి పొలానికి వెళ్లింది. అక్కడ ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తూ బోరుబావిలో పడిపోయింది. దీన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అధికారులను ఆశ్రయించారు. దీంతో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌సిబ్బంది రంగంలోకి దిగి భారీ ఆపరేషన్ చేపట్టారు. 10 రోజుల పాటు సహాయకచర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. కప్ టెక్నిక్‌తో చిన్నారిని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. అది సఫలం కాకపోవడంతో బోరుబావికి సమాంతరంగా సొరంగాన్ని తవ్వారు. ర్యాట్‌హోల్ మైనర్స్‌ను రంగంలోకి దించారు. పాలింగ్ మెషిన్‌తో బోర్‌వెల్‌కు సమాంతరంగా 170 అడుగుల సొరంగాన్ని తవ్వారు. ఆమెను చేరుకునే మార్గంలో పెద్ద బండరాయి అడ్డుగా ఉండడంతో పాటు కెమెరాల్లో బాలిక కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించారు. కానీ బయటకు తీసే సమయానికి ఆ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది.

## స్థానిక సంస్థలకు రిజిస్ట్రేషన్ శాఖ రూ. 5,700 కోట్లు చెల్లింపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** నిధులు లేక అల్లాడుతున్న స్థానిక సంస్థలకు స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ రూ.5700 కోట్లను చెల్లించింది. ఈ ఆర్థిక సంవత్సరం భూ లావాదేవీలకు సంబంధించిన ఆదాయం రూ.18,228 కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకోగా మొదటి త్రైమాసిక ముగిసే నాటికి 50 శాతం (రూ .11 వేల కోట్లు) కంటే ఎక్కువ సాధించింది.భూమి లావాదేవీలకు సంబంధించిన రుసుము, బదిలీ సుంకం, మ్యుటేషన్ రుసుము, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము ద్వారా శాఖకు వచ్చే ఆదాయం స్థానిక సంస్థలకు పంపిణీ చేస్తారు.గతంలో ప్రతి త్రైమాసికానికి ఒకసారి బదిలీ సుంకం, మ్యుటేషన్ రుసుము వికేంద్రీకరణ జరిగింది, అయితే ఇది కొన్ని సంవత్సరాలుగా నిలిపివేయడంతో బకాయిలు పేరుకు పోయాయి. ఈ త్రైమాసికంలో స్థానిక సంస్థలకు మ్యుటేషన్ రుసుముకు సంబంధించి 5,700 కోట్లకు పైగా బకాయిలను శాఖ క్లియర్ చేయగలిగిందని సీనియర్ అధికారులు తెలిపారు.గత డిసెంబరులో తమ శాఖ స్థానిక సంస్థలకు 3,046. కోట్లను బదిలీ చేయగా జనవరిలో ఇది రూ. 2,694 కోట్లుగా బదిలీ చేసినట్లు తెలిపారు.రెండు సంవత్సరాలుగా ఈ విధులను స్థానిక సంస్థలకు బదిలీ చేయకపోవడమే భారీ బకాయిలు పేరుకు పోయినట్లు అధికారులు తెలిపారు. స్థానిక సంస్థలకు సంబంధించిన బకాయిలను వీలైనంత త్వరగా క్లియర్ చేయాలని ప్రస్తుత ప్రభుత్వం పట్టుబట్టడంతో బకాయిలు చెల్లిస్తున్నామన్నారు.

## ఇసుక తవ్వకాలకు సమయం పెంపు

### మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆదేశాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఇసుక క్వారీల్లో తవ్వకాలకు సంబంధించిన సమయాన్ని పెంచుతూ తెలంగాణ మినరల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్ణయించింది. ఇప్పటి వరకూ ఇసుక తవ్వకాలు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకే తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ఈ సమయాన్ని ఇక నుండి రాత్రి 9 గంటల వరకు ఇసుక లోడింగ్ పనులను నిర్వహించాలని టీజీఎండీసీ ఆదేశాలు జారీచేసింది. ఇటీవల ఇసుక రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించడం, తనిఖీల పేరుతో రవాణాను కట్టడి చేయడంతో హైదరాబాద్‌తో పాటు, వివిధ ప్రాంతాల్లో ఇసుకకు తీవ్ర కొరత ఏర్పడింది.

## ఏప్రిల్ 4 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇంజనీరింగ్ కోర్సులతోపాటు, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించేస్తున్న ఇంజనీరింగ్ అగ్రికల్చర్, ఫార్మసీ కామన్‌నఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీ సెట్)-2025 దరఖాస్తులను నేటి(మంగళవారం ఫిబ్రవరి 25) నుంచి స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 20న ఈఏపీ సెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 20న ఈఏపీ సెట్-2025 నోటిఫికేషన్‌ను జారీ చేయగా.. దరఖాస్తులను నేటి నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ ఏడాది ఈఏపీ సెట్ పరీక్షకు ఇంటర్మీడియట్‌లోని 100 శాతం సిలబస్ నుంచి పరీక్షను నిర్వహించనున్న విషయం తెలిసిందే. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను పరీక్షలను ఏప్రిల్ 29, 30 తేదిల్లో.. ఇంజనీరింగ్ పరీక్షలను మే 2 నుంచి 5 వరకు రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు.. మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు మరో సెషన్‌ను కొనసాగిస్తారు.

# నేటి నుంచి ఇఎపి సెట్-2025 దరఖాస్తుల స్వీకరణ

**నేడు ఇ సెట్ నోటిఫికేషన్**

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో బీఈ, బీటెక్, బీ ఫార్మసీ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరం(లేటరల్ ఎంట్రీ)లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈసెట్-2025కి సంబంధించిన నోటిఫికేషన్ నేడు(మంగళవారం) జారీ చేయ నున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను మార్చి 3 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. మే 12న పరీక్షను నిర్వహించనున్నారు. నేడు ఈసెట్- 2025 నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నట్టు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ సెట్-2025ను నిర్వహించనుంది. మార్చి 3 నుంచి ఏప్రిల్ 19 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. మే 12న పరీక్షను నిర్వహించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు పరీక్ష ఫీజు రూ. 500 కాగా.. ఇతర కేటగిరీల విద్యార్థులకి రూ. 900గా నిర్ణయించారు. పరీక్షను ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షను నిర్వహిస్తారు. ఈసీఈ, ఈఐఈ, సీఎస్ఈ, ఈఈఈ, సివిల్, ఎంఈసీ, సీహెచ్ఈ, మైనింగ్, ఎంఈటీ, పీహెచ్ఎం, బీఎస్ఎం కోర్సుల్లో ప్రవేశాలను తీసుకోనున్నారు.

**నేడు లాసెట్ నోటిఫికేషన్ జారీ**

**మార్చి 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ**

రాష్ట్రంలోని న్యాయ శాస్త్ర కోర్సులైన 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల లాకోర్సులో చేరడానికి నిర్వహించే లాసెట్-2025కి సంబంధించిన టీజీ లాసెట్-2025 నోటిఫికేషన్‌తోపాటు పీజీ లా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీ లాసెట్-2025 నోటిఫికేషన్‌ను నేడు(మంగళవారం) జారీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను మార్చి 1 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. నేడు నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నట్టు లాసెట్, పీజీ లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాసెట్, పీజీ లాసెట్-2025ను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించనుంది. లాసెట్, పీజీలాసెట్ దరఖాస్తులను మార్చి 1 నుంచి ఏప్రిల్ 15 వరకు స్వీకరిస్తారు. ఏప్రిల్ 15 వరకు అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు. అపరాధ రుసుం రూ. 500తో ఏప్రిల్ 25 వరకు, రూ. 1000తో మే 5 వరకు, రూ. 2000తో మే 15 వరకు, అపరాధ రుసుం రూ. 4000తో మే 25 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. మే 20 నుంచి 25 వరకు దరఖాస్తుల్లో తప్పులను సరిచేసుకోవడానికి అవకాశం కల్పించారు. మే 30 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. 3 సంవత్సరాల లాసెట్ పరీక్షను జూన్ 6న ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు.. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు నిర్వహించనున్నారు. పీజీలాసెట్, 5 సంవత్సరాల లాకోర్సులో ప్రవేశాల కోసం జూన్ 06న మధ్యాహ్నం 4 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. టీజీ లాసెట్ ఫీజును రూ. 900గా నిర్ణయించగా.. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ. 600గా నిర్ణయించారు. టీజీ పీజీలాసెట్ ఫీజు రూ. 1100 కాగా.. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ. 900గా నిర్ణయించినట్టు కన్వీనర్ తెలిపారు.

వార్త, వరంగల్, మంగళవారం 25, ఫిబ్రవరి 2025

మన భవిష్యత్తు మనం పుట్టిన ఘడియలు బట్టిగాని, మరింకా దేనిమీదనో గాని ఆధారపడి లేదు. అది కేవలం మన స్వశక్తిపై ఆధారపడి ఉంది.

న-రాచెల్

# పౌష్టికాహారలేమిలో భారతావని

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, మరెన్ని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించినా, వెచ్చిస్తున్నా ప్రజలను పౌష్టికాహార లోపం నుండి గట్టెక్కించలేకపోతున్నారు. ఇప్పటికే దేశంలో కోట్లాది మంది పౌష్టికాహార లోపంతో, రకరకాల సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రపంచ జనాభాలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న బాలల్లో ఇరవైశాతంపైగా భారతావనిలోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదికలో ఏనాటి నుంచో ఘోషిస్తున్నాయి. ఐదు సంవత్సరాల లోపు పిల్లల్లో దాదాపు నలభైశాతం మంది పిల్లలు తక్కువ బరువుతో పుడుతున్నారని, వారిలో ఆరేడు శాతం మంది పిల్లలు పుట్టిన ఐదేళ్లలోపే మరణిస్తున్నారని మరెన్నో నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ భూమ్మీద పుట్టినవారు ఎవరికైనా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటిది కన్నులైనా సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన ఆహారం అందకచనిపోతే బాధ్యత వహించాల్సిన పాలక పెద్దలు తల్లీబిడ్డకు పౌష్టికాహారం అందివ్వలేకపోవడం కూడా పాలకుల బాధ్యతారాహిత్యం కిందకే వస్తున్నది. దేశంలో కొత్త పథకాలు ప్రవేశపెట్టకపోతేపోయారు. ఉన్న పథకాలను ఏమేరకు అమలు చేస్తున్నారు? అర్హులైనవారిలో ఎంత మందికి అందిస్తున్నారు? అధ్యయనం చేయడమే కాదు పటిష్టమైన పర్యవేక్షణ కూడా అవసరం. పర్యవేక్షణా లోపం కారణంగా పేదలకు అందాల్సిన పౌష్టికాహారం పక్కదారిపడుతున్న విషయం ఎన్నోసార్లు వెలుగు చూసినా నిర్దిష్ట చర్యలు లేకపోవడంతో నిరాటంకంగా కొనసాగుతున్నది. దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా పౌష్టికాహార లోపం పెరిగిపోతుందనే చెప్పొచ్చు. ఇటీవల ప్రపంచ ఆహార నివేదిక వెల్లడించిన వివరాల ప్రకారం పౌష్టికాహార లోపంతో బాధపడేవారి సంఖ్య దాదాపు ఎనభైకోట్లకుపైగా చేరుకున్నట్లు చెప్తున్నారు. 2014తో పోలిస్తే 30 శాతం అధికం. భారత్‌లో పౌష్టికాహారం ప్రధానంగా సూక్ష్మపోషకార సమస్య అధికంగా ఉంది. 2019-20 మధ్యకాలంలో భారత్‌లో పదహారు శాతం, పాకిస్థాన్‌లో పదిహేడు శాతం ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఇక ప్రపంచ వ్యాప్తంగా పోషకాహార లోపంతో బాధపడుతున్నవారిలో మూడోవంతు భారత్‌లోనే ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే వెల్లడిస్తున్నది. దేశంలో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. లక్షలాది మంది ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారు. 1975లోనే ఆరేళ్లలోపు పిల్లలు, తల్లులకు పౌష్టికాహారం అందించేందుకు ఆనాటి కేంద్రప్రభుత్వం సమీకృత శిశుఅభివృద్ధి పథకాన్ని (ఐసిడిఎ) ప్రవేశపెట్టింది. ప్రధాని మాతృవందన యోజన, పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం, తదితర కార్యక్రమాలు ఎన్నో జరుగుతున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు పిల్లలకు కోడిగుడ్లు కూడా అందిస్తున్నారు. అయినా భారత్‌లో ఈలోపం ఎందరినో పట్టిపీడిస్తున్నది. 2022 ప్రపంచ ఆకలి సూచీలో భారత్ 121 దేశాల్లో 107వ స్థానంలో ఉంది. పౌష్టికాహార లోపం కారణంగా ఆరోగ్య పరంగా ప్రధానంగా మహిళల్లోనూ, చిన్నారుల్లోనూ అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. జార్ఖండ్, మహారాష్ట్ర, అసోం, గుజరాత్, తదితర రాష్ట్రాల్లో పౌష్టికాహార లోపాలు అధికంగా ఉన్నాయి. పదిహేనేళ్ల బాలికల నుండి యాభైయేళ్లలోపు మహిళల్లో దాదాపు యాభైఏడు శాతం వరకు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఎనభైశాతానికి పైగా సూక్ష్మపోషకాల కొరతను ఎదుర్కొంటున్నట్లు అంతర్జాతీయ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పోషకాలు కలిగిన బియ్యాన్ని అందించే కార్యక్రమం కొనసాగుతున్నది. దేశవ్యాప్తంగా ఎనిమిది కోట్ల ముప్పైఐదు లక్షల మందికి అన్నార్తులకు ఉచితంగా తిండి గింజలు అందించే పంపిణీ కార్యక్రమం మరో ఐదేళ్లపాటు కేంద్రప్రభుత్వం పొడిగించింది. దీనికితోడు ఆయా రాష్ట్రాలు కొన్ని ప్రత్యేక పథకాలు కూడా చేపడుతున్నాయి. 2030 నాటికి తీవ్రమైన పౌష్టికాహార లోపాన్ని నియంత్రించేందుకు మూడువేలమూడువందల కోట్ల రూపాయల వ్యయంతో ప్రత్యేక పథకాన్ని తెచ్చి ఒడిశా ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఇంకా కొలిక్కిరాలేదు. పథకాలు, ఉద్దేశ్యాలన్నీ సక్రమంగానే ఉన్నా సంతృప్తి కలిగించే విధంగా కన్పిస్తున్నా ఆచరణకు వచ్చేసరికి చాలావరకు కాగితాలకే పరిమితమవుతున్నాయి. దళారుల ప్రమేయం పెరిగిపోతున్నది. వాస్తవంగా చూసినా గత రెండు దశాబ్దాలుగా ఆహార ధాన్యాల ఉత్పత్తిలో కొరత లేదు. రికార్డుస్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. ఆహారోత్పత్తులు భారీగా పెరుగుతున్నా అందరికి రెండు పూటల ఆకలి తీర్చేందుకు తిండిగింజలు అందించలేకపోతున్నారు. మరొకపక్క పాఠశాలల్లో పారిశుధ్య సౌకర్యాలులేకపోవడం వల్ల అంటువ్యాధుల కేంద్రాలుగా మారుతున్నాయి. మరుగుదొడ్లు లేకపోవడం, కనీస పరిశుభ్రత పాటించకపోవడంతో సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఇక సమగ్ర శిశు అభివృద్ధి పథకం కింద మాతాశిశు సంరక్షణ కోసం పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీలు లక్ష్యానికి దూరంగా ఉన్నాయని 'కాగ్' ఏనాటి నుంచో హెచ్చరిస్తున్నది. ఆ నివేదికను పట్టించుకునేవారే లేరు. ఇది పాలకులకు తెలియందికాదు. కొత్త పథకాల గురించి ఆలోచించకపోయినా కనీసం ఉన్న పథకాలను పటిష్టంగా అర్హులైన అందరికి అందించేలా పర్యవేక్షణ పెంచితే కొంతమేరకైనా లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం.

మీకు వీలైనంత వరకూ ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ ఉండండి. అది కారు చౌక అయిన ఔషధం.



బైరన్

మనుషులందరూ వృద్ధులుగా మారతారు. కానీ మంచివారుగా మారటం అరుదు.



స్వీడన్ బర్గ్

# ప్రజావాక్కు



### అమలు కాని హామీలెందుకు?

ఎలక్షన్లలో అలవికాని డబ్బుతో కూడిన హామీ లివ్వడం, ఓట్లు సంపాదించుకుని పదవిలోకి రావడం, ఆ తరువాత డబ్బులేదనే వంకతో ఇచ్చినహామీలను తుంగలోకి తొక్కడం రెండు తెలుగు రాష్ట్రాలలో జరుగుతున్న వాస్తవ పరిస్థితి. ఉదహరణకు తెలంగాణాను పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ మానిఫేస్టోలో చేయూత పథకం కింద ఫించన్‌ను నాలుగు వేలు, ఆరు వేలు పదవిలోకి వచ్చిన వందరోజులలో పెంచుతామని హామీ ఇచ్చారు. సంవత్సరం దాటింది. ఈవిషయం గురించి కొంత కాలం గొంతెత్తి అరచిన బి.ఆర్.ఎస్. కూడా ఈ ప్రస్తావన తేవడం లేదు. అలాగే స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించడం కష్టమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేతులెత్తేసింది. ఈ హామీలను అమలు పరచలేమని పత్రికాముఖంగా చెప్పండి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఆరోపణల నిగ్గు తేల్చాలి!

ఏపి ఫైబర్‌నెట్ ఛైర్మన్ కొద్ది రోజులక్రితం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్‌కుమార్ ఐఎఎస్ రాజద్రోహానికి పాల్పడినట్లు, ఆయన వలన సంస్థకు వందల కోట్ల రూపాయలు నష్టం జరుగుతున్నదని మీడియా ముందుకు వచ్చి బహిరంగ ఆరోపణలు చేశారు. ఇదే విషయం ఆయన ముఖ్యమంత్రి గారికి నివేదిస్తే తనకు ఇంటెలిజెన్స్ ద్వారా పూర్తి సమాచారం ఉందని చెప్పినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి. అలాగే గతప్రభుత్వం హయాంలో ఈ సంస్థలో పలురకాలుగా దోపిడీ జరిగినట్లుపత్రికల్లో పుంఖాను పుంఖాలుగాకథనాలువచ్చాయి. ఈవిషయంలో ముఖ్యమంత్రి ఆలస్యం చేయకుండా వెంటనే విచారణ జరిపించాలి.

- గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన గొర్రెలపంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఇది ప్రాథమిక రంగం వృద్ధిరేటును మరింత ఇనుమడిస్తూ అదనపు ఆదాయం పొందే వేసులుబాటును కలిగిస్తుంది. అంత మాత్రమేకాదు ఉపాధి హామీ ద్వారా గొర్రెలు మేకల షెడ్ల నిర్మాణం చేపట్టడం ద్వారావాటికి శాశ్వత గూడు చేకూర్చినట్టు అవుతుంది. గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతంచేసే పనికి ఎందుకునిధులు విధిలించరో అర్థం కావడం లేదు.

-భారత అవినాష్, జనగామ

### పేదలకు అందని వైద్యం

మధ్యతరగతి ప్రజలు కార్పొరేట్ వైద్యంలో తొలి తనిఖీ, పరీక్షలు, బెడ్‌చార్జీలు కుటుంబ భారంతో తట్టుకోలేకున్నారు. దీనికి తోడు ఈమధ్య మందుల ధరలు విపరీతంగా పెరిగినవి. జనరిక్‌లో అన్ని ఉండవు. ఈ పరిస్థితుల్లో కొందరు ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తున్నారు. కొన్ని వ్యాధులకు ఆయుర్వేదం కుదరదు. ఆరోగ్యశ్రీ కి దాని విధానాలు సరిపడాలి. గ్రామం నుండి వైద్యశాలలు దూరంగా ఉంటాయి. ఈ లోగా అవగాహన లేక కొన్ని వ్యాధులు ముదిరి ఒక్కసారి సీరియస్ అవుతోంది. ప్రభుత్వ వైద్య శాఖల సేవలు, మందుల సరఫరా, సిబ్బంది అందుబాటు బాగా పెరగాలి. వార్డులో గదులు, నీటి సరఫరా, వాతావరణం చక్కగా ఉంటే రోగులకు తక్కువ కాలంలో స్వస్థత , నమ్మకం పెరుగుతుంది. ఈ దిశలో ప్రభుత్వం ప్రజా వైద్యానికి వనరులు పెంచితే సమాజంలో వారు బయటి ప్రైవేటు పనులు చేయుటకు సిద్ధం కాగలరు. ఆరోగ్యమే మహాభాగ్యం

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### శబ్దకాలుష్యాన్ని నియంత్రించాలి

గ్రామాల్లో మైకులు, డిజెలు అధిక శబ్దంతో వినియోగించడం వలన శబ్దకాలుష్యం పెరిగిపోతోంది. శబ్దకాలుష్యానికి వ్యతిరేకంగా ఎన్నికల్లో 9సార్లు నోటావేయడం జరిగింది. పోలీసు శాఖ స్పందించి శబ్దకాలుష్యచట్టం 2000, లౌడ్‌స్పీకర్ లైసెన్స్ యాక్ట్ 2005నికఠినంగా అమలు చేయాలి. రాత్రి 10 గంటల నుండి ఉదయం 6గంటల వరకు లౌడ్‌స్పీకర్లు వినియోగించడాన్ని నిషేధించాలి. మైకుసౌండు 75డెసిబెల్స్ దాటకుండా చూడాలి. పోలీసు శాఖ అనుమతి తర్వాతే లౌడ్‌స్పీకర్లు వినియోగించాలి.

-పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

### పిల్లలను ఒత్తిడికి గురి చేయవద్దు

ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్న వేళ పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ర్యాంకుల పేరిట ఒత్తిడికి గురిచెయ్యరాదు. పిల్లలు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా చూడాలి. అక్కడక్కడ పిల్లలు ఒత్తిడికిలోను అవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పరీక్షల సమయంలో పిల్లలను గమనించవలసిన బాధ్యత ఉపాధ్యాయుల, తల్లితండ్రులపైనే ఉంది. ప్రైవేటు స్కూల్, కాలేజీ యాజమాన్యాలపై పెండింగ్ ఫీజులవిషయంలో వేధించకుండా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఢిల్లీ అభివృద్ధి పరుగులు పెడుతుందా!

**రాజకీయాలలో గెలుపు ఓటములు సహజం. కేజ్రీవాల్‌కి ఢిల్లీలో ఎదురైన మొదటి ఓటమి గుణపాఠంగా తీసుకొని వ్యూహాత్మకంగా రాజకీయ ఎత్తుగడలు వేయకపోతే బిజెపి లాంటి బలమైనపార్టీని ఎదుర్కోవటం కష్టమ వుతుంది. ఢిల్లీలో ఎదురైన ఓటమి నుండి కాంగ్రెస్, ఆప్‌లు తమ రాజకీయ వ్యవహారాలను మార్చుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని ఎదురుదెబ్బలు తగలక మానవు. ఢిల్లీలో ఆప్ ఓటమి తర్వాత కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఢిల్లీ ఎన్నికలలో సాధించిన విజయ స్ఫూర్తితో బిజెపి బీహార్, బెంగాల్, తెలంగాణ, తమిళనాడు, కేరళ వైపు అడుగులు వేస్తుంది. అక్కడ కూడా బిజెపి విజయం సాధిస్తే మరొక దశాబ్దం పాటు భారతదేశ రాజకీయాలలో బిజెపికి ఎదురు ఉండకపోవచ్చు అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.**



డాక్టర్ తిరుణహరి శేషు

ఇరవైఏడు సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో మరొకమారు బిజెపి విజయం సాధించి అధికారాన్ని చేపట్టింది. ఢిల్లీకి రాష్ట్ర హోదా ప్రకటన తరువాత 1993లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికలలో మాత్రమే విజయం సాధించిన బిజెపికి ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో గెలుపుఅందని ద్రాక్ష గానే మారింది. వరుసగా మూడు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ మరొక మూడు పర్యాయాలు ఆమ్ ఆద్మీ పార్టీలు ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో విజయం సాధిస్తే, 8వసారి జరిగిన శాసనసభ ఎన్నికలలో మాత్రం అధికార ఆప్‌ని ఓడించి 48 శాసనసభ స్థానాలలో విజయం సాధించి ఢిల్లీలో బిజెపి అధికారాన్ని హస్తగతం చేసుకుంది. సుదీర్ఘ విరామం తర్వాత ఢిల్లీలో అధికారాన్ని కైవసం చేసుకున్న బిజెపి ఢిల్లీకి ముఖ్యమంత్రి గా రేఖా గుప్తాని వ్యూహాత్మకంగా ఎంపిక చేసిందనే చెప్పాలి. న్యూఢిల్లీ శాసనసభ నియోజకవర్గంలో ఆప్ జాతీయ కన్వీనర్ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ని ఓడించి జైంట్ కిల్లర్‌గా పేరు తెచ్చుకున్న ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి సాహెబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేష్ వర్మని ముఖ్య మంత్రిగా ఎంపిక చేస్తారనే ఊహాగానాల నడుమ కేజ్రీవాల్ బనియా సామాజిక వర్గానికే చెందిన రేఖా గుప్తాని బిజెపి అధిష్టానం ముఖ్యమంత్రిగా ఎంపికచేసింది. సుష్మాస్వరాజ్, షీలా దీక్షిత్, అతిశీల తరువాత ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహిస్తున్న నాలుగవ మహిళ రేఖ గుప్తా తనతో పాటు ముఖ్యమంత్రి పదవి కోసం పోటీపడిన పర్వేష్ వర్మని ఉపముఖ్యమంత్రిగా మరొక పోటీదారు విజేందర్ గుప్తాను స్పీకర్‌గా బిజెపి అధిష్టానం ఎంపిక చేసింది. గత కొంతకాలంగా ముఖ్యమంత్రుల ఎంపికలో బిజెపి అధిష్టానం వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తుంది. మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన రాజస్థాన్ ముఖ్యమంత్రి భజనలాల్ శర్మ ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఎంపికను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, ఛత్తీస్‌ఘఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయీ, ఒరిస్సా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్, మాజీ ఎంపికలను భవిష్యత్తు రాజకీయ అవసరాల మేరకే వారిని ముఖ్యమంత్రిలుగా భారతీయ జనతాపార్టీ ఎంపిక చేసిందనే చెప్పాలి. ముఖ్యమంత్రుల ఎంపికలో బిజెపికి కాంగ్రెస్‌కి చాలా తేడానే కనిపిస్తుంది. గుజరాత్ ఎన్నికలకు ముందు విజయ్ రూపానిని మార్చి భూపేంద్ర భాయ్‌పటేల్‌ని ఎంపిక చేసి బిజెపి గుజరాత్‌లో విజయం సాధిస్తే రాజస్థాన్ శాసన సభ ఎన్నికలకు ముందు అశోక్ గెహ్లాట్‌ని మార్చకుండా కాంగ్రెస్ ఆ రాష్ట్రఎన్నికలలో ఓడిపోయింది. ముఖ్యమంత్రిల ఎంపికలో బిజెపి అసాధారణ స్థాయిలో నిర్ణయాలు తీసు కుంటుంది. గోవా ముఖ్యమంత్రి ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి ఆ రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో ఓడిపోయినా మళ్లీ వారినే ముఖ్యమంత్రులుగా బిజెపి అధిష్టానం ఎంపిక చేసిందనే విషయాన్ని గమనించాలి. ఢిల్లీ శాసనసభ ఎన్నికల సందర్భంగా బిజెపి, కాంగ్రెస్, ఆప్‌లు పోటీపడి హామీలు ఇచ్చాయి. బిజెపి ఒక అడుగుముందుకేసి ఉచితాలకు వ్యతిరేకమని చెప్పే పార్టీ కూడా ఓటర్లను ఆకర్షించడానికి గెలుపు కోసం ఆమ్ ఆద్మీపార్టీతో పోటీపడుతూ అనేక హామీలను ఇవ్వడం జరిగింది. బిజెపి ఇచ్చిన హామీలతో ఆప్‌కి ప్రధాన ఓటు బ్యాంకు అయిన మురికివాడలలోని ప్రజలు మధ్య



తరగతి ప్రజలు మహిళలు బిజెపి వైపుకి మొగ్గటం వలనే గత రెండు ఎన్నికలలో సింగిల్ డిజిట్‌కి పరిమితమైన బిజెపి ఏకంగా ఈ పర్యాయం అధికారాన్ని కైవసం చేసు కుంది. బిజెపి ఇచ్చిన ప్రధాన హామీలలో మార్చి 8మహిళా దినోత్సవం నుండి మహిళలకి నెలకి 2500ఇచ్చే పథకాన్ని ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రకటించారు. అలాగే ఆయుష్మాన్ భవ కూడా ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రేఖాగుప్తా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినరోజే యమునా హారతి ఇచ్చి యమునా ప్రక్షాళన చేపడుతున్నామని ప్రకటించారు. సంకల్పపత్రంలో ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కొత్తగా కొలువు తీరిన ప్రభుత్వంపై ఉంది. డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఢిల్లీ రూపురేఖలను మారుస్తామని ఢిల్లీ ప్రజలకు కల్పించిన ఆశలను భారతీయ జనతా పార్టీ నెరవేర్చాలి. ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ నిర్ణయాలకి లెఫ్టినెంట్ గవర్నర్‌తో అడ్డుకునే ప్రయత్నం బిజెపి చేసిందని అనేక సందర్భాలలో ఆరోపణలు వచ్చాయి. ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వానికి అంతిమ నిర్ణయ అధికారం ఉంటుందని సుప్రీంకోర్టు చెప్పినా కేంద్రం లెఫ్టినెంట్ గవర్నర్ నిర్ణయాలే చెల్లుబాటు అయ్యేవిధంగా కేంద్రం ఆర్డినెన్స్ కూడా తీసుకొచ్చి నాటి ఢిల్లీ ప్రభుత్వాన్ని బిజెపి అడ్డుకునే ప్రయత్నం చేసిందనే ఆరోపణలు కూడా వచ్చాయి. కానీ ఇప్పుడు కేంద్రంలో రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉండటం వలన ఢిల్లీ అభివృద్ధి పరుగులు పెడుతుందనే ఆశలు కల్పించారు. కాబట్టి ఆ ఆశలను నెరవేర్చాల్సిన బాధ్యత బిజెపిపైనేఉంది. తమకు నచ్చని ప్రభుత్వాలు తమ కూటమితో లేని ప్రభుత్వాలు ఆయా రాష్ట్రాలలో ఉంటే ఆరాష్ట్రాల అభివృద్ధి సంక్షేమంలో సహకరించకపోవటం సమైక్య స్ఫూర్తికి విరుద్ధమనే విమర్శలు వస్తున్నాయి. విపక్షాలు అధికారంలో ఉన్నబెంగాల్ కేరళ, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు ప్రభుత్వాలు కేంద్రంపై ఇవే ఆరోపణలు చేస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలు రావటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఆమ్ ఆద్మీ పార్టీ 2013లో అధికారంలోకి వచ్చి ఒక దశాబ్దానికి పైగా ఢిల్లీలో అధికారంలోఉంది. ఢిల్లీ కేంద్రంగానే ఆప్ అనతి కాలంలోనే ఇతర రాష్ట్రాలకు విస్తరించి పంజాబ్‌లో అధికారంలోకి రావటమే కాదు జాతీయ పార్టీ స్థాయికి కూడా ఆమ్ ఆద్మీ పార్టీ ఎదిగింది. ఢిల్లీలో ఆప్‌గెలిచినప్పుడు మిగతా పార్టీలు దారుణ ఓటమి చెందాయి. కానీ ప్రస్తుతం జరిగిన ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో ఆమ్‌ఆద్మీపార్టీ 22 శాసనసభ స్థానాలలో విజయం సాధించి బలమైన ప్రతిపక్షంగా ప్రజల తరఫున పోరాడే బాధ్యతను ప్రజలు ఆప్‌కి కట్టబెట్టారు. కాబట్టి ఆప్ ఢిల్లీలో ఒక నిర్మాణాత్మక ప్రతిపక్షపాత్రను పోషించాలి. ఢిల్లీ శాసనసభ ఎన్నికల సందర్భంగా గత ప్రభుత్వ సంక్షేమపథకాలను కొనసాగిస్తామని హామీని భారతీయ జనతా పార్టీ ఇచ్చింది. కాబట్టి పాత పథకాలను కొనసాగించే విధంగా కొత్త పథకాలను అమలు చేసేవిధంగా ఆప్ ప్రధాన ప్రతి పక్షంగా ఢిల్లీ ప్రభుత్వంపై ఒత్తిడితేవాలి. ఆమ్ ఆద్మీ పార్టీకి ఇది ఒక మంచి అవకాశం. పార్టీ పెట్టగానే అధికారంలోకి వచ్చి అధికారం అనుభవించిన పార్టీ ఇప్పుడు ప్రతిపక్ష పార్టీ గా అధికారం లేకుండా ప్రజలపక్షాన పోరాడి మరింత రాజ కీయ పరిణితిని పరిపక్వతను పొంది భవిష్యత్తులో బలమైన పార్టీగా ఎదగాలి. రాజకీయాలలో గెలుపు ఓటములు సహజం. కేజ్రీవాల్‌కి ఢిల్లీలో ఎదురైన మొదటి ఓటమి గుణపాఠంగా తీసుకొని వ్యూహాత్మకంగా రాజకీయఎత్తుగడలు వేయకపోతే బిజెపి లాంటి బలమైనపార్టీని ఎదుర్కోవటం కష్టమవుతుంది. ఢిల్లీలో ఎదురైన ఓటమి నుండి కాంగ్రెస్ ఆప్ లు తమ రాజకీయ వ్యవహారాలను మార్చుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా మరిన్నిఎదురుదెబ్బలు తగలకమానవు. ఢిల్లీలో ఆప్ ఓటమి తర్వాత కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఢిల్లీ ఎన్నికలలో సాధించిన విజయ స్ఫూర్తితో బిజెపి బీహార్, బెంగాల్, తెలంగాణ, తమిళనాడు, కేరళ వైపు అడుగులు వేస్తుంది. అక్కడ కూడా బిజెపి విజయం సాధిస్తే మరొక దశాబ్దం పాటు భారతదేశ రాజకీయాలలో బిజెపికి ఎదురు ఉండకపోవచ్చు అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# విద్యుత్ చార్జీలు పెంచకపోవటమే కాదు, తగ్గించాలి

తిరుమలశెట్టి సాంబశివరావు

మొన్న ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం మన రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను పెంచబోవటం లేదని ప్రకటించారు. కానీ ఆ ప్రతిపాదన ఒక్కటే సరిపోదు. గతంలో వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు పేరున అడ్డగోలుగా బస్సు, విద్యుత్ ఛార్జీల వంటివి భారీగా పెంచి సామాన్యుల నడ్డి విరిచిందని అన్ని విపక్షాలతోపాటు అప్పటి ప్రధాన ప్రతిపక్షమైన తెలుగు దేశం కూడా తీవ్రంగా ఆందోళన చేసింది. అంతకు ముందు నెలకు 200 యూనిట్లలోపు సాధారణ గృహ వినియోగదారులకు యూనిట్ ఒక్కటికి రెండు మూడు రూపాయల చొప్పున నెలకు నాలుగైదు వందల రూపాయల బిల్లులు వస్తే వైసీపీ ప్రభుత్వ హయాంలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకానికి ట్రూఅప్ చార్జీలు, రకరకాల సెస్సుల పేర్లతో విద్యుత్ సంస్థలు నెలనెలా వేయి రూపాయల పైగా బిల్లుల రూపంలో సామాన్య గృహ వినియోగదారుల నుండి వసూలు చేశాయి. ఇప్పటికీ ఆ అధిక చార్జీలు వసూలు చేస్తున్నాయి. మరోవైపు నెలకు కనీస విద్యుత్ వాడకం 200 యూనిట్లుగా వుంటుందని ప్రభుత్వం వారు నిర్ణయించి యస్సీలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. కానీ ఇతర వర్గాల సామాన్యులు వాడుకునే అదే 200 యూనిట్ల లోపు కనీస వాడకపు బిల్లులు మాత్రం వేయి రూపాయలకు తగ్గకుండా సామాన్యులకు తడిసి మోపెడు అవుతున్నాయి. నేడు విద్యుత్ కూడా అందరికీ నిత్యావసరమైంది.



అదేమి విలాస వస్తువు కాదు. కనుక వారికి కూడా సహేతుకమైన ధరలకే అందజేయాలి. ప్రభుత్వం అంటే లాభనష్టాలు బేరీజు వేసుకునే ప్రైవేటు సంస్థకాదు. ఒకప్పుడు మన నేతలు సౌర, పవన విద్యుత్ ఉత్పత్తితో విద్యుత్ చార్జీలు తగ్గుతాయని భరోసా ఇచ్చారు. కానీ తగ్గకపోగా భారీగా పెంచటం దురదృష్టకరం. కొన్ని ప్రైవేట్ సంస్థలతో జరిగిన ఒప్పందాల్లో జరిగిన అవకతవకల కారణంగా విద్యుత్ చార్జీలు పెరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. కనుక ఈ ప్రభుత్వం కూడా తమిళనాడు ప్రభుత్వం వలెప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని గత ప్రభుత్వ హయాంలో అదానీ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవటమే గాక ఏనుగులు పోయేకంతను వదిలి చీమలు దూరేకంతను మూసినట్లు ఎంతో ఖర్చుతో కూడిన అదానీ కంపెనీ ఇచ్చే స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలి. చార్జీల భారం తగ్గిస్తుందనీ, పరిపాలన గాడిలో పెట్టగలదని ఆశించి ఓటర్లు తెలుగు దేశాన్ని గెలిపించారు. కనుక గత ప్రభుత్వం పెంచిన ఆ చార్జీల భారం తగ్గించవలసిన నైతిక బాధ్యత ఈ ప్రభుత్వం పైనే వుంది. నానాటికి ద్రవ్యోల్బణం, ధరలు, చార్జీల భారం పెరుగుతుంటే కొద్దిమంది సంపన్న, ఉద్యోగ అధిక ఆదాయ వర్గాల వంటి వారు తట్టుకోగలిగారు గాని అత్యధిక శాతం ప్రజల ఆదాయం మాత్రం పెరగక ఇక్కట్లు పడుతున్నారు కనుక ఈ ప్రభుత్వమైనా గత ప్రభుత్వం పెంచిన పన్నుల భారం తగ్గిస్తే సామాన్య ప్రజానీకానికి మేలు జరుగుతుంది. ఇది అవకతవకలకు ఆస్కారం లేనీ, అందరికీ సమన్యాయం చేసే సంక్షేమ పథకంగానే భావించాలి.

# ప్ర'యాగం'లో ఏదీ జల'సంస్కారం'!

వరిగొండ కాశీ విశ్వేశ్వర రావు

ఇది భారతీయ సనాతన సంస్కృతిలో ఒక భాగం. పుణ్యనదుల్లో స్నానానికి, ఆచమనీయానికి స్వచ్ఛమైన నీరే ఉంటుందనే భావనతో భక్తులు నదీ స్నానాలాచరిస్తుంటారు. ఆ వెంటనే ఆచమనీయమూ. కానీ ప్రయాగరాజ్‌లోని మహాకుంభమేళా 'అమృత' స్నానాలకు వినియోగిస్తున్న నీరు స్వచ్ఛజలమేనా? అనే విషయంలో భక్తులను గందరగోళంలో పడవేసే రెండు రకాల విరుద్ధ భావనలు జనంలో వ్యాప్తి చెందుతున్నాయి. గంగా, యమున, సరస్వతీ, త్రివేణి సంగమం ఎంతో పవిత్రంగా భాసిల్లుతోంది. అది భక్తుల ఆధ్యాత్మిక భావాల నుంచి చెరిపేయలేనిది. సరస్వతీ నది ప్రవాహమార్గం గురించి ఎంతో చరిత్ర ఉన్నా ఆ నది త్రివేణి సంగమం వద్ద అంతర్వాహినిగా ఉంటుంది. సరిగ్గా మహాకుంభమేళా సమయంలోనే నదుల్లో కోలీఫామ్ బ్యాక్టీరియా అత్యధిక స్థాయిలో ఉన్నందున స్నానానికికానీ, ఆచమనానికి కానీ పనికిరాదంటూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు సమర్పించిన నివేదిక విశేషాలు బయటపడ్డాయి. అలా అని ఈ నివేదిక సాకుతో ఉన్నట్టుండి మహాకుంభమేళాను అర్ధాంతరంగా ముగించలేని పరిస్థితి తలెత్తింది. మహాశివరాత్రి వరకు సాగుతుంది. మరికొంతకాలం పొడిగించాలన్న విజ్ఞాపనలున్నాయి. అదృష్టవశాత్తూ కాలుష్య నియంత్రణ మండలి గంగాజల నాణ్యతపై నివేదికలో ప్రతి ఒక వంద మి.లీ లీటర్ల నీటిలో 2500 వరకు కోలీఫామ్ బ్యాక్టీరియాలుంటాయని అయినా ఆ నీరు స్నానానికి యోగ్యమేనని, ఇంత కన్నా బ్యాక్టీరియా రీడింగ్ దాటితే వ్యాధులు శరీరాన్ని సోకుతాయని విశ్లేషించింది. ఇది శాస్త్రీయ పరిశోధన ఎవరూ కాదనలేం. అయినా ఎన్నో కోట్లమంది భక్తులు అక్కడ ఎంతో పవిత్ర భావంతో స్నానాలచరిస్తారు. పుణ్యం లభించిందని, పాపప్రక్షాళన పొందగలిగామన్న సంతోషంతో ఇళ్లకు తిరిగి వెళ్తారు. వారిని సందేహాలతో బాధించే కన్నా సద్భావనతో స్వాగతంపడం మంచిది. కాగా కాలుష్య మండలి నివేదికను తోసిపుచ్చినా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మరికొన్ని మీమాంసలను వారి ముందుంచినట్లయింది. ఏకంగా గంగానది జిల్లాల్లో కొన్ని ప్రాంతాలలో ప్రతి 100 మి.లీ లీటర్ల నీటిలో 7900 నుండి 11వేలవరకు కోలీఫామ్ బ్యాక్టీరియాలున్నట్లు పరిశోధన మండలి తేల్చేసింది. అయితే కాలుష్యనియంత్రణ మండలి లెక్కలు కాకి లెక్కలు అనుకున్నారో, గంగాజలాల్లో ప్రవాహంలో అనిశ్చితి ఉండటాన్ని బట్టి కాలుష్య పరిస్థితులను యు.పి కాలుష్య నియంత్రణ మండలి కూడా ఆ అంశాలను పరిశీలిస్తున్నందున లీటరు నీటిలో మూడు మి.గ్రాములకంటే తక్కువ బయోలాజికల్ ఆక్సిజన్‌డిమాండ్ (బి.ఒ.డి) ఉంటే ఆ నీళ్ల స్నానానికి యోగ్యమేనని ప్రభుత్వాధినేతలు విశ్లేషించారు. నిజమే భక్తుల్లో అనుమానాలు తలెత్తకుండా సర్దిచెప్పుకోడం ప్రభుత్వాలు చేయాల్సిన పనే. కాదనలేం. సంగమ స్థలంలో 3.94 నుంచి 5.29వరకు బిఒడి స్థాయి ఉన్నట్లు కేంద్రకాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. ఇంత గట్టి హెచ్చరిక చేస్తూనే ఆతర్వాత మంచినీటిని గంగా నదిలోకి వదలడం వల్ల దాని స్థాయి తగ్గిందని చెప్పడం



చూస్తే, సరిగ్గా మహాకుంభమేళా సందర్భంలో ఇంత'కాలుష్య' రచ్చ అవసరమా అనిపిస్తుంది. కర్ర విరగకుండా పాము చావకూడని రీతిలో ఈ అభిప్రాయం వెల్లడైంది. సాధారణంగా భక్తజనసందోహం పవిత్ర గంగా నది ఎంతోస్వచ్ఛమైన నీటితో శాంతంగా ఉంటుందని, అక్కడ స్నానం తమలోని కశ్మలాన్ని తొలగించి చర్మవ్యాధులనుంచి ఉపశమనం కలిగిస్తుందని భావిస్తారు. అదే భావనతో స్నానాలు చేస్తారు. కాగా ఈ విషయాలపై ఇప్పుడు ప్రజల్లోకి విడుదలచేసి, సందేహాలు కల్పించడమంచిది కాదని ఆ కేంద్ర సంస్థలేవీ ఆలోచించినట్లులేదు. అయితే ఈ అంశంపై కాలుష్యమండలి నివేదిక లోపభూయిష్టమని, పాత నమూనాలతో నివేదిక సమర్పించినట్లుందని, వాటిని నియంత్రించడంలో ఎలాంటి చర్యలు చేపట్టారో జాతీయ హరిత ట్రిబ్యునల్ మండిపడింది. ఫీకల్ కోలీఫామ్‌ల స్థాయిల గురించి ఎక్కడా చెప్పకుండా సమర్పించిన నివేదిక సరైన వివరాలు లేకుండానే నీటి నాణ్యత గురించి ఓ నిర్ణయానికి రావడంపట్ల ఆగ్రహం వెలిబుచ్చింది. ఇలాంటి నివేదికపైమళ్లీ ప్రత్యేకించి ఉత్తరప్రదేశ్‌ముఖ్యమంత్రి యోగికి సందేహనివృత్తి చేసే పని పెట్టినట్లున్నారు. శాస్త్రీయ పరిశోధనలు ఇలా వివరిస్తుంటే పాపం ఆయనేమి చెప్పగలరు అని సందేహం తలెత్తక మానదు. నిత్యం సనాతన ధర్మమే గొప్పదని భావించే యోగి పుంగవుడాయన. జలకాలుష్యం ఎన్నో ఆరోగ్య ప్రమాదాలు తెచ్చిపెడుతుందని ప్రపంచ ఆరోగ్యసంస్థ హెచ్చరించినా, యోగి తనధోరణిలో గంగాజలం స్నానానికి, ఆచ మనానికి, అనుపానానికి పనికి వస్తుందని నమ్మబలికారు. అతితక్కువ సమయంలో గర్భాశయానికి చేరి ప్రాణహాని కలిగించే న్యూఢిల్లీ మెటాలో బీటా లాక్టమేస్ ఎన్‌డిఎం-1 బ్యాక్టీరియా గంగానదిలో ప్రమాదకరమైనస్థాయిలో ఉన్నట్లు గతకాలం నాటి పరిశోధనలు చెబుతున్నాయి. అదొకమొండి బ్యాక్టీరియా. పిల్లల్లో తీవ్ర ఇన్‌ఫెక్షన్‌లు కలిగిస్తుంది. అది అంతమైనట్లుకానీ, ఇక రాదని కాని చెప్పే ఏ పరిశోధనా మనకు అందుబాటులోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో జల సామాన్యమైన రీతిలో బ్యాక్టీరియామీద యుద్ధం ప్రకటించలేం. అలాఅని ప్రజల నమ్మకాలనూతుడిచిపెట్టలేం. వారి ఆరోగ్యంపై జరిగే బ్యాక్టీరియా దాడులనూ నిరోధించలేం. ఈనేపథ్యంలో ప్రభుత్వాలు, కాలుష్యనివారణ పథకాల కన్నా ముందుగా సందేహాలు కల్పించే సంస్థలకు కనీస 'జల' సంస్కారం అబ్బేటట్లు చూడటం ముఖ్యం. అందుచే మహాకుంభమేళాను ఇక పొడిగించకుండాస్వస్తివాచకం పలకడమే మేలనే అభిప్రాయాలున్నాయి. ఎన్నితొక్కిసలాట ఉదంతాలు జరుగుతున్నా గత దుస్సంఘటనల నుంచి గుణపాఠాలు నేర్చుకోని ప్రభుత్వాల ధోరణి వలననే మళ్లీ మళ్లీ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం వారేమిసెలవిచ్చినా ప్రయాగ్‌రాజ్ దుర్ఘటనకు దారి తీసిన సంఘటనలు వేరే ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చేరుకోవాల్సిన ఏరైలయినా, ఏ స్థాయి రైలయినా అయిదు ప్లాట్‌ఫారమ్ ఉన్న అజ్మీరీ గేట్ టెర్మినల్ వద్ద ఆగాల్సిందే. తొక్కిసలాట జరిగిన ఈ న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ ఆనుపానులు, రద్దీసమయాల గురించి తెలియని రైల్వే అధికారులెవరూ లేరు. సాధారణ ప్రయాణీకులంతా ఇక్కడ ప్రయాగ్‌రాజ్ ట్రెయిన్‌లు ఎక్కాల్సినవారే. రోజూ ఆస్టేషన్‌లో ఏడువేల టిక్కెట్లు విక్రయిస్తారు. కానీ ప్రమాదం జరిగిన శనివారం నాడు మొత్తం 9600జనరల్ టిక్కెట్లు విక్రయించారు. వీరుగాక రిజర్వేషన్‌లేని ప్రయాణికులు పదివేలమంది ఉంటే అసలు టిక్కెట్‌లేని ప్రయాణీకులూ సర్వసాధారణం. అన్నిఅంశాలూ కళ్లెదుటేఉన్నా అంచనా వేసుకోకుండా ఓముందస్తు ప్రణాళిక లేకుండా రైల్వేశాఖ, ప్రభుత్వ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు సాధారణ జనం కర్మకు వారిని వదిలేయడం క్షమార్హంకాదు. ఎవరి నిర్లక్ష్యం ఎంతపాలన్న విషయం ఇప్పట్లోతేలేదికాదు. ఈలోగాఇలాంటి దుర్ఘటనలు జరగకుండా ఆయాప్రభుత్వాలు చూడగలవోలేదో కూడా చెప్పలేం! అందుకే ప్రయాగ్‌రాజ్ పేరిట అధికారికంగా అక్కడా, ఇక్కడా వెరశి 24 మందికి నీళ్లొదిలేశాం.

# 2వేల మంది యుఎస్ఎయిడ్ ఉద్యోగులపై వేటు

## బలవంతపు సెలవులు పెట్టించిన ట్రంప్ సర్కార్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 24:** అంతర్జాతీయ అభివృద్ధి కార్యక్రమాలకు, మానవతా దృష్టితో సహాయానికి యుఎస్ ఎయిడ్ సంస్థ ద్వారా అందుతున్న నిధులను అమెరికా ప్రభుత్వం ఆపివేసిన విషయం తెలసిందే. తాజాగా రెండు వేల మంది యుఎస్ ఎయిడ్ ఉద్యోగులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేటు వేశారు. మిగిలిన వారిలో కొంతమందిని మినహాయించి వేలమంది ఉద్యోగులకు బలవంతపు సెలవులు ఇచ్చినట్లు యుఎస్ ఎజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ వెబ్‌సైట్‌లోని నోటీసు ద్వారా తెలుస్తోంది. ఉద్యోగుల తొలగింపునకు ఫెడరల్ జడ్జి అనుమతించిన తర్వాతే ట్రంప్ యంత్రాంగం ఈ విషయంలో ముందుకెళ్లారు.

ప్రభుత్వ ప్రణాళికను నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరిన ఉద్యోగుల విజ్ఞప్తిని యుఎస్ డిస్ట్రిక్ జడ్జి కార్ల్ నికోలస్ తిరస్కరించారు. ప్రభుత్వం చేసే అనవసరపు ఖర్చులను తగ్గించడానికి పనిచేస్తున్న మస్క్ నేతృత్వంలోని డోజ్ ఇప్పటికే అనేకమంది యుఎస్ ఎయిడ్ ఉద్యోగులపై వేటు వేసిన విషయం తెలిసిందే. తాజాగా తీసుకొన్న ఈ నిర్ణయం మిగిలిన ఉద్యోగుల్లో భయాందోళన కలిగిస్తోంది. అయితే యుఎస్ ఎయిడ్ ద్వారా వృథా ఖర్చులు ఎక్కువవుతున్నాయని, అది నేరగాళ్ల సంస్థ అని మస్క్ ఇప్పటికే ఆరోపించిన విషయం తెలిసిందే. అందుకే నిధులను ఆపేస్తున్నట్లు ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా దాదాపు 600 మంది ఉద్యోగులను కార్యాలయ భవనంలోకి వెళ్లనీయకుండా నిలిపివేశారు. ఈ ఆదేశాలపై ఫెడరల్ జడ్జి అమీర్ అలీ గతవారం తాత్కాలికంగా స్టే ఇచ్చారు. అమెరికా కాంగ్రెస్ సభ్యులు యుఎస్ఎయిడ్ ద్వారా సాయం అందించడానికి ఆమోదం తెలిపినప్పుడు ప్రభుత్వం దాన్ని ఎలా నిలిపేయగలదని జడ్జి నిలదీశారు. అయినా ట్రంప్ తన చర్యలను సమర్థించుకుంటున్నారు. యుఎస్ ఎయిడ్ ద్వారా భారత్‌లో జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడానికి అమెరికా ప్రభుత్వం రూ. 182 కోట్లు ఇచ్చిందని ట్రంప్ పలు మార్లు ఆరోపించారు. ఇకపై అటువంటి నిధులను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచంలో అధిక సుంకాలు విధించే దేశాల్లో ఒకటైన భారత్ వద్ద చాలా డబ్బు ఉందని, ఆ దేశానికి తామెందుకు నిధులు ఇవ్వాలని ప్రశ్నించారు. దీంతో ఈ విషయంపై ఇరుదేశాల మధ్య భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# న్యూజిలాండ్ సమీపంలో చైనా యుద్ధ విన్యాసాలు




**వెల్లింగ్టన్, ఫిబ్రవరి 24:** చైనా చుట్టుపక్కల దేశాలనే కాదు.. సుదూరంగా ఉన్న వాటిని కూడా వేధిస్తోంది. తాజాగా సోమవారం న్యూజిలాండ్ తీరానికి అత్యంత సమీపంలో డ్రాగన్ యుద్ధ నౌకలు లైవ్ ఫైర్ డ్రిల్స్ మొదలుపెట్టాయి. దీనిపై ఆ చిరుదేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచాన్ని శాసించే స్థాయిలో నౌకాదళం (బ్లూవాటర్ నేవీ) సిద్ధం చేయాలనే బీజింగ్ ప్లాన్‌లో భాగంగానే వీటిని నిర్వహిస్తున్నట్లు నిపుణులు అనుమానిస్తున్నారు.

ఆస్ట్రేలియా–న్యూజిలాండ్ మధ్యలో టాస్మాన్ సముద్రంలో రెండు లైవ్ ఫైర్ డ్రిల్స్‌ను చైనా నేవీ నిర్వహించింది. శుక్ర, శనివారాల్లో ఇవి జరిగాయి. ఈ నేపథ్యంలో ఇరు దేశాలకు చెందిన ప్రయాణికుల విమానాలకు ఎటువంటి హెచ్చరికలు లేకపోవడంతో.. హఠాత్తుగా తమ మార్గాలను మధ్యలోనే మళ్లించుకోవాల్సి వచ్చింది. దీనిపై న్యూజిలాండ్ రక్షణ మంత్రి జూడిత్ కొల్లిన్స్ స్పందిస్తూ.. ఈ విన్యాసాలు అసాధారణమని పేర్కొన్నారు. ఆ నౌకల వద్ద అత్యాధునిక ఆయుధాలున్నాయని వెల్లడించారు. ఒక నౌకలో 112 లాంచ్ సెల్స్, యాంటీషిప్ బాలిస్టిక్ క్షిపణులు ఉన్నట్లు పేర్కొన్నారు. వీటి రేంజి సుమారు 540 నాటికల్ మైళ్లు ఉండొచ్చని వెల్లడించారు.

ఈ విన్యాసాలపై చైనా ప్రభుత్వ మీడియా స్పందిస్తూ 8=శ్చపశ్చిమ దేశాలు కూడా వాటి సముద్ర జలాల్లో ఇలాంటి విన్యాసాలకు అలవాటు పడాలని సలహా ఇచ్చింది. చైనా మిలటరీ వ్యవహారాల నిపుణుడు షాంగ్‌జోంగ్ పింగ్ గ్లోబల్ టైమ్స్‌తో మాట్లాడుతూ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నేవీ భవిష్యత్తులో చైనా తీరాల్లోనే కాకుండా అంతర్జాతీయ జలాల్లో కూడా ఇటువంటి విన్యాసాలు నిర్వహిస్తుందని వెల్లడించింది. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ స్పందిస్తూ చైనా యుద్ధవిన్యాసాలు అంతర్జాతీయ చట్టాలను పాటించినా తమకు ముందస్తు ఇచ్చి ఉండాల్సిందన్నారు. ఆ దేశ విదేశాంగ మంత్రి పోనీవాంగ్ స్పందిస్తూ ఈ పరిణామాలపై చైనాను వివరణ కోరనున్నట్లు వెల్లడించారు. కానీ, బీజింగ్ మాత్రం వీటికి కొట్టిపారేసింది. ఆ దేశ విదేశాంగశాఖ స్పందిస్తూ.. ఆస్ట్రేలియా అకారణంగా ఆరోపణలు చేస్తోందని పేర్కొంది. చైనా ముందస్తు నోటీసులు ఇచ్చినట్లు వెల్లడించింది.

# అమెరికా ఇచ్చింది 100 బిలియన్ డాలర్లే..

## 500 బిలియన్ డాలర్లు కాదు: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ



**క్కీవ్, ఫిబ్రవరి 24:** రష్యాపై యుద్ధం చేసేందుకు తమకు అమెరికా అందించిన సాయం 100 బిలియన్ డాలర్లే అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. ఇటీవల ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఈ యుద్ధంలో ఆయుధాల కోసం ఇప్పటివరకు 320 బిలియన్ డాలర్లు ఖర్చు కాగా.. ఇందులో 120 బిలియన్ డాలర్లను ప్రజల నుంచి సేకరించామని.. మరో 200 బిలియన్ డాలర్లను ఐరోపా సమాఖ్య, అమెరికా అందించాయని జెలెన్‌స్కీ క్కీవ్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. 'మొత్తంగా అమెరికా నుంచి 67 బిలియన్ డాలర్లు విలువైన ఆయుధాలు.. 31.5 బిలియన్ డాలర్ల బడ్జెట్ సపోర్టు మాత్రమే అందాయి. ఎవరైనా సరే దానిని 500 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టి అంతమొత్తం ఖనిజ సంపద ఇవ్వమని అడగకూడదు' అని పేర్కొన్నారని క్కీవ్ ఇండిపెండెంట్ పత్రిక పేర్కొంది.

ఉక్రెయిన్‌కు యుద్ధంలో మద్దతు కొనసాగాలంటే బదులుగా 500 బిలియన్ డాలర్లు విలువైన ఖనిజాలను తమకు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ ఒప్పందానికి క్కీవ్ కూడా సానుకూలంగా ఉందని ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. చాలా సందర్భాల్లో అమెరికా అధ్యక్షుడు క్కీవ్‌కు అందించిన సాయాన్ని రకరకాలుగా చెప్పారు. ఓ సందర్భంగా ఏకంగా 350 బిలియన్ డాలర్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఈ నెల 24వ తేదీతో ఉక్రెయిన్ యుద్ధానికి మూడేళ్లు పూర్తయ్యాయి. మరోవైపు దీనికి ఒకరోజు ముందు రష్యా ఏకంగా 267 డ్రోన్లతో క్కీవ్‌పై దాడులు నిర్వహించింది. ఈ స్థాయిలో వీటిని వాడటం ఇదే తొలిసారి. 2022 ఫిబ్రవరి 24న 'ప్రత్యేక మిలిటరీ ఆపరేషన్' పేరుతో రష్యా యుద్ధాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. నాటో విస్తరణను నిలువరించే ప్రయత్నం, డాన్‌బాస్ విమోచనం, నాజీయిజం నిర్మూలన వంటివి తమ లక్ష్యాలుగా పుతిన్ ప్రకటించారు. మొదట్లో మాస్కో సేనలు దూకుడు కనబర్చినా.. తర్వాత పాశ్చాత్య దేశాల ఆయుధ సాయంతో క్కీవ్ సైతం దీటుగా స్పందించింది. మూడేళ్లలో ఇరువైపులా లక్షలాది మంది సైనికులు మరణించారు, గాయపడ్డారు. కోట్ల డాలర్ల మేర ఆస్తినష్టం వాటిల్లింది.

# ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంకోసం రెండో పెళ్లి..

## అసలు విషయం బయటపెట్టిన అత్తింటివారు అవాక్కైన అధికారులు



**లక్నో, ఫిబ్రవరి 24:** ప్రభుత్వ ఆధ్వర్యంలో సామూహిక జరుగుతుండగా దాదాపు 300 మంది వధూవరులు తమ కుటుంబసభ్యులతో కలిసి పెళ్లి పీటలపై కూర్చున్నారు. అంతలోనే కొందరు వ్యక్తులు ఒక్కసారిగా పెళ్లి మండపానికి వచ్చి ఆపండి అంటూ సినిమా స్టైల్లో అన్నారు. వివాహానికి సిద్ధమైన వధువుల్లో ఒకరు అస్మా అనే మహిళకు అప్పటికే పెళ్లి అయిందని తాము ఆమె అత్తింటా వాళ్లమని తెలపడంతో అక్కడ ఉన్నవారంతా ఆశ్చర్యపోయారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంతో గేదెలు కొనుగోలు చేయడానికి ఈ వివాహ నాటకం ఆడుతుందని తెలుసుకుని అధికారులు ఖంగుతిన్నారు. ఆమె అత్తింటివారు తెలిపిన వివరాల ప్రకారం మూడేళ్ల క్రితం అస్మాకు నూర్ మహమ్మద్ అనే వ్యక్తితో వివాహం అయింది. వారి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇరువురి మధ్య విభేదాలు ఎక్కువవడంతో అస్మా ఆరునెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం సామూహిక వివాహాలు నిర్వహిస్తోందని అందులో పెళ్లి చేసుకున్న జంటలకు యోగి ప్రభుత్వం రూ.35 వేలు ఆర్థికసాయం, ఇతర బహుమతులు అందచేస్తున్నట్లు తెలుసుకొంది. దీంతో వెంటనే ఆమెకు ఆలోచన వచ్చింది. ప్రభుత్వం చేస్తున్న వివాహాల్లో తన బంధువు జబేర్ అహ్మద్‌ను రెండో పెళ్లి చేసుకుని వచ్చే నగదును చెరి సగం పంచుకోవాలని ప్రణాళిక వేసింది. ఆ డబ్బుతో చెరో గేదెను కొనుక్కోవాలని వారు నిర్ణయించుకున్నారు. అనుకున్న ప్రకారం సామూహిక వివాహ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. చివరి నిమిషంలో విషయం తెలుసుకున్న అస్మా అత్తింటివారు పెళ్లి వేదిక వద్దకు చేరుకుని ఆ వివాహాన్ని ఆపివేయించారు. సామూహిక వివాహ నిబంధనలను ఉల్లంఘించినందుకు, అనధికారికంగా లబ్ధి పొందేందుకు దరఖాస్తు చేసుకున్నందుకు, ప్రభుత్వ పనులను అడ్డుకున్నందుకు పోలీసులు వధూవరులు ఇద్దరి పైనా కేసు నమోదు చేశారు.

# మహా రాజకీయాల్లో కొత్త పరిణామాలు: తరచూ భేటీ అవుతున్న థాకరే ద్వయం



**ముంబయి, ఫిబ్రవరి 24:** అవిభాజ్య శివసేనలో కొనసాగి ఆధిపత్యపోరులో ఉద్ధవ్‌థాకరేకు సేన అధిపతి బాధ్యతలు రావడం తీవ్రంగా విభేదించి వేరుకుంపటి పెట్టుకున్న ఎంఎన్ఎస్ అదినేత రాజ్‌థాకరే, సేన అధినేత ఉద్ధవ్ థాకరేలు తరచూ భేటీకావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. థాకరేకు వరుసకు సోదరుడు అయిన రాజ్‌థాకరే ఇటీవల ఒక వివాహ వేడుకలో రాజ్‌థాకరేను కలిసారు. ఉద్ధవ్‌తోపాటు ఆయన సతీమణి రష్మిథాకరే కూడా రాజ్‌థాకరేను అభిమానంతో పలకరించారు. రాజకీయంగా వేరుపడిన ఈ సోదరులు మళ్లీ కలుస్తుండటం మళ్లీ ఒకటిగా విలీనం అవుతారా అన్న సందేహాలను రాజేస్తున్నారు. అంధేరిలో మహారాష్ట్రకు చెందిన ఒక సీనియర్ అధికారి ఇంట్లో జరిగిన వివాహవేడుకల్లో రాజ్ థాకరే, ఉద్ధవ్‌థాకరేలు కలుసుకున్నారు. ఇటీవలి కాలంలో అటు ఎంవిఎలోను, ఇటు మహాయుతిలోను చెలరేగుతున్న అంతర్గత కుమ్ములాటల నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఎంఎన్ఎస్, సేన యుబిటి రెండూ పరస్పరం కూర్చుని తమ మధ్య ఉన్న రాజకీయ వైరుధ్యాలను పరిష్కరించుకోవాలనుకుంటున్నట్లు ప్రచారం తెరపైకి వచ్చింది. ఎందుకంటే మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నాయి. అన్నింటికంటే మించి రాజధాని ముంబయి మహానగర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ పార్టీలు అనివార్యంగా పోటీచేయాల్సి ఉంది. ఎంఎన్ఎస్, ఎంవిఎ నేతల భేటీ స్థానిక సంస్థల ఎన్నికల కోసమేనని స్పష్టం అవుతోంది. గడచిన రెండునెలల్లో వీరిద్దరూ మూడుసార్లు కలుసుకున్నారు. 2005లో రాజ్‌థాకరే అవిభాజ్య శివసేననుంచి వేరుపడి మహారాష్ట్ర నవ నిర్మాణ్‌సేన(ఎంఎన్ఎస్)ను స్థాపించారు. అసెంబ్లీఎన్నికల్లోకూడా వేరువేరుగాపోటీచేసారు గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా శివసేన థాకరే వర్గానికి 20 సీట్లు రాగా రాజ్‌థాకరే ఎంఎన్ఎస్ ఒక్కసీటు కూడా గెలవలేకపోయింది. ఈ పరిణామాల నేపథ్యంలో వీరిద్దరు తరచూ భేటీ కావడం వెనుక విలీనం ఒక్కటే అయి ఉంటుందన్న ఊహాగానాలు తారస్థాయికి చేరాయి. వీటికితోడు మహాయుతిలో కూడా ఒకప్పటి అవిభక్త శివసేన నుంచి వేరుకుంపటితో బిజెపికి మద్దతిచ్చిన ఏక్‌నాథ్‌షిండేకు కూడా అక్కడ పొసగడంలేదు. అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. షిండే వర్గం ఎమ్మెల్యేలకు ఇచ్చిన భద్రతా కవర్‌ను పూర్తిగా తొలగించడం ఈ వైరుధ్యాలకు మరింత ఆజ్యంపోసింది. వీటన్నిటి నేపథ్యంలో రాజ్‌థాకరే, ఉద్ధవ్‌థాకరేల భేటీ ఇపుడు మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తావిచ్చింది.

# శీష్‌మహాల్‌కు మీడియా టూర్.. మీరే నిర్ణయించాలి


## ఢిల్లీ మంత్రి పర్వేష్‌సింగ్ వర్మ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** అసెంబ్లీ ఎన్నికల్లో వాడి వేడిగాజరిగిన శీష్‌మహల్‌ప్రచారం బిజెపికి ఎంతో కొంత కలిసి వచ్చిందన్నది వాస్తవమే. ఇపుడు అధికార పగ్గాలుచేపట్టిన తర్వాత అప్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందన్న అభియోగాలను ప్రజల్లోకి మరింత తీసుకువెళ్లేందుకు వీలుగా ఈ శీష్‌మహల్‌కు మీడియాటూర్‌ను ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేస్తోంది. అవినీతినిరోధిస్తామన్న నినాదంతో అధికారం చేపట్టి పదేళ్లు పాలించిన ఆప్ కొన్ని ప్రభుత్వ సంస్థలను నిబంధనలకు విరుద్ధంగా విలీనంచేసి, 50వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ అద్దాలమేడను నిర్మించిందని బిజెపి రాష్ట్ర చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ విమర్శించారు. అందుకే వాస్తవాలు ప్రజలకు తెలియజేసేందుకు వీలుగా ఈ టూర్‌ను చేపట్టామని ఢిల్లీ ప్రభుత్వం కూడా చెపుతోంది. ఆమ్ ఆద్మీకి ఇంత భారీ ఎత్తున విలాసవంతమైన భవనంలో జీవించాలన అత్యాశ ఏర్పడిందంటూ బిజెపి సెటైర్లువేస్తోంది. ఢిల్లీ మంత్రి పర్వేష్‌వర్మ మీడియాతో మాట్లాడుతూ బంగ్లా లోపలికి మీడియా బృందాన్ని తీసుకువెళతామని, గత ఆప్‌ప్రభుత్వం ప్రభుత్వ నిధులు ఎలా దుర్వినియోగం చేసిందీ మీరే చెప్పాలని సూచించారు. మొత్తం 33కోట్ల రూపాయల ఖర్చుతో ఈ భవనాన్ని ఆధునీ కరించారు. ఇప్పటికే బిజెపి కొన్ని స్నాప్ షాట్‌లను కూడా వైరల్‌చేసింది. ఢిల్లీ బిజెపి చీఫ్ అయితే ప్రభుత్వ సంస్థల విలీనాలను వెంటనే రద్దుచేయాలంటూ లెఫ్టినెంట్ గవర్నర్ వీరేంద్ర సచ్‌దేవాకు లేఖలు రాసారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేజ్రీవాల్ ఈ భవనంలో నివసించారు. 2015 నుంచి 2024వరకూ ఇక్కడే ఉన్నారు. ఇపుడు కొత్త సీఎం రేఖా గుప్తా తను ఈ బంగ్లాలో బస చేయనని ముందే చెప్పారు. అయితే ఈ భవనం ఏంచేయాలన్నది భవిష్యత్తులో నిర్ణయిస్తామని ప్రకటించారు.

# పిఎం కిసాన్ పథకం కింద 19వ విడత నిధులు విడుదల!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించే ఆశయంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పిఎం కిసాన్ నిధులు సోమవారం జమ అయ్యాయి. ఈ పథకం కింద 19వ విడత నిధులను నేడు ప్రధాని మోడీ విడుదల చేశారు. బీహార్‌లోని భాగల్‌పుర్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా 'పిఎం కిసాన్ సమ్మాన్ నిధి' కింద ఈ నిధులు విడుదల చేశారు. తాజాగా విడుదల చేసిన రూ.22 వేల కోట్లు 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రైతులకు ఏటా ఒక్కో విడత



రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో రూ.6 వేల సాయం అందించే పిఎం కిసాన్ పథకాన్ని కేంద్రం 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించింది. ఇప్పటివరకు 11 కోట్లమంది రైతులకు 18 వాయిదాల్లో రూ.3.46 లక్షల కోట్లు అందచేసింది. ముందుగా పిఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్‌కి వెళ్లాలి. కుడివైపున కనిపిస్తున్న ఆప్షన్లలో బెనిఫిషియరీ స్టేటస్ ఆప్షన్ ఉంటుంది. సెలక్ట్ చేసుకున్న తర్వాత ఆధార్ లేదా ఖాతా నెంబరును ఎంటర్ చేసి గెట్ డేటా పై క్లిక్ చేయాలి. స్టేటస్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఒకవేళ మీరు పిఎం కిసాన్‌కు రిజిస్టర్ చేసుకుని, ఈ కెవైసి పూర్తి చేసి ఉంటే ఖాతాలోకి డబ్బు జమవుతుంది. అలాగే లబ్ధిదారుల జాబితాలో పేరు ఉందో లేదో కూడా చెక్ చేసుకోవచ్చు. బెనిఫిషియరీ స్టేటస్ కింద బెనిఫిషియరీ లిస్ట్ ఆప్షన్ కనిపిస్తుంది. ఈ ఆప్షన్‌పై క్లిక్ చేసే మరొక పేజీకి రీడైరెక్ట్ అవుతుంది. ఇక్కడ లబ్ధిదారుని రాష్ట్రం, జిల్లా, ఉప జిల్లా, బ్లాక్, గ్రామాలను ఎంచుకుని 'గెట్ రిపోర్ట్'పై క్లిక్ చేస్తే లబ్ధిదారుల జాబితా కనిపిస్తుంది.

పిఎం కిసాన్ హెల్ప్‌లైన్ నెంబర్ 155261/ 011-24300606కు కాల్ చేసి కూడా సమాచారం తెలుసుకోవచ్చు.

# షిండేకు పట్టున్న థానెలో బిజెపి నాయక్ జనతాదర్బార్



**ముంబయి, ఫిబ్రవరి 24:** మహారాష్ట్రలోని అధికార మహాయుతిలో లుకలుకలకు కారణం జనతా దర్బార్ అని కూడాకూటమి నేతలు చెపుతున్నారు. థానెలో మహాయుతినేత గణేశ్‌నాయక్ రెండో విడత జనతా దర్బార్ నిర్వహణకు భారీ ఎత్తున ఏర్పాట్లుచేయడాన్ని కూడా షిండేకు సుతరాము ఇష్టంలేదు. టౌన్‌హాల్‌మీటింగ్‌లకోసం థాణె నగరంలో భారీ ఎత్తున పోస్టర్లు కూడా అంటించారు. థాణె ఏక్‌నాథ్‌షిండేకు పెట్టని కోటగా నిలిచిన సంగతి తెలిసిందే. జిల్లాలో ఈ దర్బార్ నిర్వహణతో షిండే ఏకస్వామ్యాన్ని సవాల్ చేసినట్లవుతుంది. అంతేకాకుండా థాణెకు ఇన్‌ఛార్జి మంత్రిగా కూడా గణేశ్‌నాయక్ ఉన్నారు. నాయక్ ఇప్పటికే నవీముంబయంలోని వాశిలో దర్బార్‌ను నిర్వహించారు. ఈనెల 3వ తేదీ నిర్వహించిన ఈ దర్బార్‌కు విశేష స్పందన లభించింది. థాణె లోక్‌సభ ఎంపి శివసేన షిండే వర్గానికి చెందిన వారు నరేష్ ఎంహాస్కే ఈ తీరుపట్ల కూడా నిరసన తెలుపుతున్నారు. అయితే పైకి మాత్రం ప్రజలు వారి రాజకీయ నేతలనున కలుసుకోవడానికి వెళితే ఎందుకు అడ్డుకోవాలి అని ప్రశ్నించారు. థాణె దర్బార్‌తో ఇపుడు నాయక్, షిండేల మధ్య ఉన్న వైరాన్ని మరింతపెంచుతోంది. అవిభక్త శివసేనలో ఉన్న షిండేకు అప్పట్లో థాణె జిల్లాపై మంచి పట్టు ఉండేది. ఇపుడు షిండేకు ఫడ్నవిస్‌కు ఎదురవుతున్న వైరుద్యాలతో థాణెలో బిజెపి పట్టుకోసం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే బిజెపి మంత్రి గణేశ్‌నాయక్ థాణెలో జనతాదర్బార్‌ను నిర్వహించారు. 1990లోనే నాయక్ ఈ జనతా దర్బార్‌ను నిర్వహించి ప్రజల దృష్టిలోపడ్డారు. ఈనెల 3వ తేదినే నవీముంబయి టౌన్‌షిప్ థాణెజిల్లా పరిధిలోనే జనతాదర్బార్ నిర్వహించారు. ఇపుడు ఏకంగా థాణె జిల్లా కేంద్రంలోనే నిర్వహించడం తర్వాత 21వతేదీ పాల్ఘర్‌జిల్లాలో నిర్వహిస్తామని ప్రకటించారు. షిండే ప్రమేయం లేకుండా థాణెలో జనతాదర్బార్ నిర్వహించడం కూడా షిండే శివసేన నేతలకు సుతరాము ఇష్టంలేదు సరికదా బిజెపి వైఖరిపై మండిపడుతున్నారు.

# భారతీయ వంటకాల్లో 'మఖానా' సూపర్‌ఫుడ్

## బీహార్ పర్యటనలో ప్రధాని మోడీ



**పాట్నా, ఫిబ్రవరి 24:** భారతీయ వంటకాల్లో మఖానా సూపర్‌ఫుడ్ అని ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకారి అని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. 365 రోజుల్లో 300 రోజులు అది తన ఆహారంలో భాగం అయ్యేలా చూసుకుంటానన్నారు. దేశవ్యాప్తంగా చాలామందిప్రజలకు అల్పాహారంలో మఖానా తప్పనిసరి అని అంతర్జాతీయ స్థాయిలో దాని ఉత్పత్తి ఉండాలన్నారు. సోమవారం బీహార్‌లోని భాగల్‌పూర్‌లో పర్యటన సందర్భంగా తన ఆహారపు అలవాట్లను వివరించారు. రైతుల శ్రేయస్సు కోసం బీహార్‌లో మఖానాబోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు వార్షిక బడ్జెట్‌లో నిర్మాలా సీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మఖానా బోర్డు ఏర్పాటుకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నామని అన్నారు. ఈ బోర్డుద్వారా ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపడతాయి. రైతులకు శిక్షణ అందుతుందన్నారు. వారు అన్ని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందేలా బోర్డుచూస్తుందని ప్రధాని తెలిపారు. దీనికి గుర్తుగా భాగల్‌పూర్‌లో మోడీకి మఖానాతోచేసిన దండను వేసి గౌరవించారు. ఢిల్లీ రైల్వేస్టేషన్ తొక్కిసలాటపై బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్‌యాదవ్ చేసిన వ్యాఖ్యలపై మోడీ ఆగ్రహం వ్యక్తంచేసారు. ప్రయాగరాజ్‌లో కుంభమేళా నిర్వహణలో ఐక్యత కనిపిస్తోంది. భారత దేశ అద్భుతమైన వారసత్వాన్ని కాపాడేందుకు భవిష్యత్తు నిర్మాణం కోసం ఎన్డీయే ప్రభుత్వం అందరితో కలిసి పనిచేస్తుందని ఆటవిక రాజ్యాన్ని ప్రోత్సహించే ఈ వ్యక్తులు మన వారసత్వాన్ని విశ్వాసాలను ద్వేషిస్తున్నారని బీహార్‌లోప్రధాని ఆగ్రహం వ్యక్తంచేసారు. లాలూప్రసాద్ కుంభమేళా అర్ధంలేనిదని వ్యాఖ్యలు చేసారు. ఇదంతా బుజ్జగింపు రాజకీయాలని లాలూ వ్యాఖ్యలను బిజెపి తిప్పికొట్టింది. దీనిపై ఇపుడు బీహార్ పర్యటనలో ప్రధాని స్పందించారు. బీహార్‌లో ఈ ఏడాది చివరిలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో అక్కడి రాజకీయాలు వేడెక్కాయి. పార్టీలు, నాయకులమధ్య పరస్పర విమర్శలు హోరెత్తాయి.

# ఢిల్లీ స్పీకర్‌గా విజేంద్రగుప్తా బాధ్యతల స్వీకారం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** ఢిల్లీ రాజకీయ వర్గాల్లో ముందునుంచి చర్చ జరిగినట్లుగానే బిజెపి ఎమ్మెల్యే విజేందర్‌గుప్తా అసెంబ్లీ స్పీకర్ పదవి సాధించుకోగలిగారు. విజేందర్‌గుప్తాను స్పీకర్‌గా ఎన్నుకున్న తర్వాత సీఎం రేఖాగుప్తా ప్రతిపక్ష నాయకురాలు అతిశిసింగ్ ఆయనను పోడియం మీదకు తీసుకెళ్లి స్పీకర్ కుర్చీలో కూర్చోబెట్టారు. ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఆమ్ ఆద్మీపార్టీ పరాజయం చవిచూసింది. బిజెపి ఘనవిజయం సాధించింది. 48 స్థానాలతో బిజెపి, 22 స్థానాలతో ఆప్ గెలిచాయి. మహిళా సీఎంగా రేఖా గుప్తా పదవీప్రమాణం చేస్తే తొలిరోజు ప్రొటెం స్పీకర్‌గా అర్విందర్‌సింగ్ లవ్లీని లెఫ్టినెంట్ గవర్నర్ వికెసక్సేనా నియమించారు. తొలిరోజు ఆయన ఎమ్మెల్యేలచేత ప్రమాణస్వీకారాలుచేయించారు. తర్వాత స్పీకర్‌ను ఎన్నుకున్నారు. అసెంబ్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా మంగళవారం ప్రసంగిస్తారు. కాగా ఈరోజు ఢిల్లీ రాజకీయాల్లో చరిత్రాత్మకమైనరోజుఅని గడచిన 12 ఏళ్లుగా ఢిల్లీకి ఏర్పడిన ఆప్‌దాకు బాధ్యులెవరో ప్రజలే నిర్ణయించారని ఢిల్లీ పర్యావరణ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా అన్నారు.

# సంక్షోభంలోకి భగవంత్‌మాన్ సర్కార్!



**చండీఘర్, ఫిబ్రవరి 24:** పంజాబ్‌ప్రభుత్వం త్వరలోనే సంక్షోభంలోకి పడిపోతోందని ప్రతిపక్ష నాయకుడు కాంగ్రెస్‌నేత ప్రతాప్‌సింగ్ బాజ్వా ప్రకటించారు. అధికార పార్టీకి చెందిన 32 మంది ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని మరికొందరు కూడా బిజెపితో టచ్‌లోకి వెళుతున్నారని ఆయన చెప్పారు. భగవంత్ మాన్ ప్రభుత్వం ఒక్కసారిగా కుప్పకూలిపోతుందని ఆయన జోస్యంచెప్పారు. ఆప్‌ప్రభుత్వాని కూల్చివేయాలన్న తపన ఎంతమాత్రం కాంగ్రెస్ పార్టీకి లేదని, అయితే యాధృచ్ఛికంగానే ఎమ్మెల్యేలు అసహనంతో ఉన్నారని ఆయన చెప్పారు. బిజెపి ఇప్పటినుంచే ఆప్‌ప్రభుత్వాన్ని నిస్తేజపరిచే చర్యలు చేపట్టిందన్నారు. ఆప్ ప్రభుత్వం ఐదేళ్లపాటుపనిచేయాలనే కోరుకుంటున్నామని దీనివల్ల ప్రజలకు కూడా ఎ లాంటి ప్రభుత్వాన్ని తాము ఎన్నుకున్నామో అన్న నిజాలు తెలుస్తాయన్నారు. ఆప్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు ఎంతో అసహనంతో ఉన్నారని, వేలాదికోట్ల రూపాయలు ఆస్ట్రేలియా, ఇతర దేశాలకు హవాలా ఛానళ్లలో తరలిపోతున్నాయని, ఇదంతా ఆప్ హయాంలోనే జరుగుతున్నదని అన్నారు. ఈసొమ్ము అంతా మద్యం, భూమాఫ్రిడిలవల్ల సమకూరిన అవినీతిసొమ్ము అని ఆయన ఆరోపించారు. పంజాబ్‌లో ఇపుడు ఢిల్లీమోడల్‌కొనసాగుతోందని, దోపిడీలో నిపుణులుగా తయారవుతున్నారని ఆరోపించారు. బాజ్వా ఆరోపణలను ఆప్ కూడా తిప్పికొట్టింది. బాజ్వా బిజెపికి వెళ్లిపోయే ఆలోచనల్లో ఉన్నారని బిజెపిలో ఇప్పుడే తన టికెట్ ఖరారుచేసుకున్నారరని, బెంగళూరులో బిజెపి సీనియర్ నాయకులను కలిసినట్లు ఆప్ నేత నీల్‌గార్గ్ ఆరోపించారు. రాహుల్‌గాంధీ ప్రతాప్‌బాజ్వాపై ఓ కన్నేసి ఉంచాలని సూచించారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం కుప్పకూలిపోవడం, ఎన్నికల్లో ఆప్ ఓటమి తర్వాత పంజాబ్‌లోని భగవంత్ మాన్ ప్రభుత్వంపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. పంజాబ్ ప్రభుత్వం ఇపుడు అవినీతి వ్యతిరేక కార్యాచరణను ప్రారంభించింది. ఎన్నికల్లో ప్రధాన హామీ కూడా ఇచ్చింది. ఇందుకు అనుగుణంగానే కానిస్టేబుళ్లనుంచి ఇన్‌స్పెక్టర్లవరకూ అవినీతి ఆరోపణలపై 52 మంది పోలీస్ అధికారులను డిస్మిస్‌చేసింది. 1993 బ్యాచ్ ఐపిఎస్ అధికారి వరిందర్‌కుమార్‌ను కూడా మార్చివేసారు. విజిలెన్స్ డైరెక్టర్‌గా ఉన్న ఆయన్ను పోలీస్ చీఫ్‌కు రిపోర్టు చేయాలని ఆదేశించారు. ముక్తసర్ సాహిబ్ డిప్యూటి కమిషనర్ రాజేష్ త్రిపాఠి 2016 ఐఎఎస్ అధికారి. ఆయన్ను కూడా సస్పెండ్ చేసారు. విజిలెన్స్ విభాగం ఆయనపై విచారణకు ఆదేశించడంతో సస్పెండ్ అయ్యారు.

# చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ చట్టం తీసుకురండి

## రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పాలన

## జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబా



మొగిలి సునీతారావు సన్మానించిన జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుఅల్కాలాంబా

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** పార్లమెంట్, శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచడానికి కేంద్రప్రభుత్వం వెంటనే 33 శాతం రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చి చట్టం చేయాలని జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబా కోరారు. గాంధీభవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఐదులక్షల మంది మహి ళలు ఆన్‌లైన్ ద్వారా మహిళా కాంగ్రెస్‌లో సభ్యత్వ నమోదు చేసుకొన్నారని, అందులో తెలంగాణ నుంచి లక్ష మంది సభ్యత్వం నమోదు చేసుకున్నారని ఆమె తెలిపారు. దేశంలో మహి ళలకు రక్షణ లేకుండా పోయిందని కేంద్రం మహి ళల హక్కుల పరిరక్షణకు, భద్రతకు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో దేశంలోనే తెలంగాణ లక్షానాలుగువేల మందితో మొదటి స్థానంలో ఉందని ఆమె తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావుకు కితాబును ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పదేళ్లు విపక్షంలో ఉండి పోరాడిందని ఆమె గుర్తు చేసుకున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికా రంలోకి రావడానికి మహిళలు కారణమని అన్నారు.

రాష్ట్రంలో సభ్యత్వాలు చేసిన మహిళ లను గుర్తించి ప్రతి జిల్లాలో సభ్యత్వాలు చేసిన డబ్బులతో నాప్కిన్ శానిటరీ మిషన్లను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అత్యధిక సభ్యత్వాలు చేసిన జిల్లాలను ఎంపికచేసి వారికి మిషన్లు ఇవ్వడం జరుగుతుందని ఈ శానిటరీ నాప్కిన్ మిషన్స్ ప్రాజెక్టు ద్వారా కొంతమందికి ఉపాధి కల్పించడం జరుగుతుందని అల్కాలాంబా అన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే దిశగా పనిచేయాలని సూచించారు. తెలంగాణలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మహిళలకు పెద్దపీట వేస్తున్నా రని అల్కాలాంబా అన్నారు. సునీతారావు వాళ్ల బృందానికి నామినేట్ పదవులు వచ్చేలా మాట్లాడుతానని ఆమె ఇచ్చినారు.

దేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే రూ.500కు మహిళలకు గ్యాస్ అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే మూడు హామీలు ఇచ్చారు. నాలుగోహామి కూడా త్వరలో అమలు చేస్తారని తెలిపారు. దేశంలో మహిళలకు పెట్రోల్ బంక్‌లేదని తెలంగాణలో మొదటి పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారని ఆమె అన్నారు. తెలంగాణలో ప్రతి పోలింగ్ బూత్‌లో ముగ్గురు మహిళలను నియమించడానికి మహిళా కాంగ్రెస్ సిద్ధం అవుతోందని తెలిపారు. మహిళా కాంగ్రెస్ పూర్తిస్థాయి కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు కూడా ప్రకటించడం జరిగిందని ఆమె గుర్తుచేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ మహిళలను ఢిల్లీలో ప్రియాంకగాంధీ సత్కరిస్తారని తెలిపారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో చిక్కుకున్న వారు క్షేమంగా రావాలని ఆమె ప్రార్థించారు. ప్రభుత్వంలో మహిళా కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం ఉండాలని ఆమె అన్నారు. ఇప్పటి వరకు అత్యధిక సభ్యత్వం చేయడం, గత ప్రభుత్వంకు వ్యతిరేకంగా అనేక వందల వేల ధర్నాలు, అరెస్టులు అయిన మొగిలి సునీతారావు వంటి వారిని గుర్తించాలని సిఎం రేవంత్‌రెడ్డికి, టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఇప్పటి వరకు తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు మాత్రమేనని కాంగ్రెస్‌లో ఒకరికి ఒక పదవి సిద్ధాంతం ఉందని పార్టీ ప్రభుత్వంలో మహిళా కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం ఉండాలని సూచించారు. అత్యధిక సభ్యత్వం జరిగినందుకు తెలంగాణ సిఎంకు రేవంత్‌కుమార్, టిపిసిసి చీఫ్‌కు మహేష్‌కుమార్, మొగిలి సునీతారావుకు హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.

## కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో

# సిపిఎస్ మద్దతు కాంగ్రెస్‌కే

### మంత్రి శ్రీధర్‌బాబుకు రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ లేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 27న జరగనున్న కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నట్టు సిపిఎస్ ప్రకటించింది. తమ మద్దతు లేఖను మంత్రి శ్రీధర్‌బాబుకు అందజేసినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ తెలిపారు. కరీంనగర్-మెదక్ -నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రులు ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వుట్కూరు ఆల్ ఫోర్స్ నరేందర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ తెలిపారు. సిపిఎస్ ఉద్యోగుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. దేశంలో కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాలైన హిమాచల్‌ప్రదేశ్‌లో ఒపిఎస్ పునరుద్ధరించిన.. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల మాదిరి తెలంగాణలోనూ పాతపెన్షన్ పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వ ఆఫీస్ మెమోరాండం నెం.57/05/2021 అనుగుణంగా 2003 డీఎస్‌సీ వారికి, పోలీస్, వైద్య, టెక్నికల్ సమస్యలతో ఒపిఎస్‌కు దూరం అయినవారికి తక్షణం పాతపెన్షన్ అమలు చేయాలని కోరినట్టు తెలిపారు. మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచింగ్ స్టాఫ్‌కు, గురుకుల సొసైటీలోని ఉపాధ్యాయ సిబ్బంది జీతాలను 010 హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా చెల్లించాలని కోరినట్టు తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారని.. త్వరలో వాటిని నెరవేర్చుతామని హామీ ఇచ్చారని స్థితప్రజ్ఞ తెలిపారు. సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పాత పెన్షన్ పునరుద్ధరణ ప్రకటించినట్లు ఒపిఎస్ అమలుపరిచేలా చర్యలు చేపట్టాలని దాంతో పాటు ఏప్రిల్ 1 నుండి రాబోతున్న యుపిఎస్‌ను అడ్డుకోవాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.


## కెసిఆర్ 14 నెలలు అసెంబ్లీకి రాకపోవడం కూడా రికార్డే: మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** కోహ్లీ దుబాయ్ వేదికగా 14 వేల రన్నులు కొట్టి రికార్డు సృష్టిస్తే ప్రతిపక్ష నేత కేసిఆర్ 14 నెలల 14 రోజులు అసెంబ్లీకి రాకుండా రికార్డు సృష్టించారని మంత్రి కొండా సురేఖ ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై ప్రజలకి అందుబాటులో ఉండకపోవడం దేశ రాజకీయ చరిత్రలో పెద్ద రికార్డే కదా అన్నారు.14 వేల రన్నులు చేసిన విరాట్ కోహ్లీ ఒకవైపు వార్తల్లో పతాక శీర్షికలలో నిలిస్తే... 14 నెలలుగా ఇంకా విరాట పర్వం వీడని మన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా వార్తల్లోకి ఎక్కడం ఆలోచించాల్సిన విషయం కదాని ప్రశ్నించారు.

## ఉచిత క్రెడిట్ కార్డులు, స్మార్ట్‌ఫోన్ గిఫ్ట్‌లతో బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్న సైబర్ నేరగాళ్లు

### బహుమతులు వస్తే జాగ్రత్తగా ఉండాలి: టిజిసిఎస్‌బి

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** ప్రజలను మాయచేయడంలో ఆరితేరిన సైబర్ నేరగాళ్లు ఈ క్రమంలో కొత్త పంథాను ఎంచుకున్నారు. ఇప్పటి వరకు స్టాక్ ట్రే డింగ్, డిజిటల్ అరెస్టు, లాటరీలు తదితర పద్ధతుల్లో అమాయకులను బురిడి కొట్టించిన సైబర్ నేరగాళ్లు ఇప్పుడు కొత్తగా ఉచిత క్రెడిట్ కార్డులు వాటితో పాటు స్మార్ట్ ఫోన్‌లను బహుమతులుగా పంపుతూ వాటిని వాడుతున్న వారి బ్యాంకు ఖాతాల వివరాలు తెలుసుకుని నిమిషాల్లో నగదును కాజేస్తున్నారు. ఈ తరహా మోసం బెంగళూరులో వెలుగు చూడగా బాధితుడు ఏకంగా 2.8 కోట్ల రూపాయలను పోగొట్టుకున్నాడు. ఈ తరహా మోసాలపై అన్ని వర్గాల వారు అప్రమత్తంగా వుండాలని తెలం గాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అధికారులు హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు ఎంచుకున్న కొత్త పద్దతి వింతగా వుండడం విశేషం. గుర్తు తెలియని వ్యక్తు లు మేము పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాము. మీరు ఉత్తమ కస్టమర్‌గా ఎంపికయ్యారు. అందుకుగానూ మీకు అపరిమితంగా వాడుకునే క్రెడిట్ కార్డుతో పా టు దీనిని తీసుకుంటే ఖరీదైన స్మార్ట్ ఫోన్‌ను బహుమతిగా ఇస్తున్నాము. దయచేసి కాదనకుండా స్వీకరించండి. అని చెబుతారు. దీని తరువాత పార్శిల్‌లో ఇంటికి క్రెడి ట్ కార్డుతో పాటు స్మార్ట్ ఫోన్ వస్తుంది. వీటిని తీసుకుని ఫోన్‌లో సిం కార్డు అమర్చి ఫోన్‌ను వాడడం మొదలుపెట్టాక బ్యాంకు ఖాతాలో గల గూగూల్ పే, ఫోన్ పే వివరాలన్నీ సైబర్ నేరగాళ్లకు నిమిషాల వ్యవధిలో తెలిసిపోతుంటాయి. సైబర్ నేరగాళ్లు ఈ వివరాలు తెలుసుకునేందుకు బహుమతిగా పంపిన సెల్‌ఫోన్‌లో అంతకు ముందుగానే ఇన్‌స్టాల్ చేసిన క్లోనింగ్ యాప్ కీలకంగా వ్యవహరిస్తుంది. ఈ యాప్ వల్ల ఎలాంటి ఓటిపి అవసరం లేకుండానే బహుమతిగా వచ్చిన స్మార్ట్ ఫోన్‌లో సిమ్ కార్డులు వాడి వినియో గించిన ఖాతాదారుల వివరాలు సైబర్ నేరగాళ్లు కాజేస్తున్నారు. ఈ తరహా మోసాల పట్ల అన్ని వర్గాల వారు అప్రమత్తంగా వుండాలని టిజిసిఎస్‌బి అధికారులు కోరారు. ఉచితం గా క్రెడిట్ కార్డులు వాటితో పాటు స్మార్ట్ ఫోన్‌లు బహుమతిగా వస్తే ఎవరూ ఆశపడవద్దని వారు కోరారు. దీనిపై వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని వారు కోరారు.


సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న టిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

## జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి

### రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు.. కలెక్టరేట్ల వద్ద నిరసనలు

**హైదదరాబాద్ ముషీరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవ పున్నయ్య విజ్ఞప్తి చేశారు. టిడబ్ల్యుజెఎఫ్ పిలుపు మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సమాచారభవన్ వద్ద ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన తెలపగా, జిల్లా కలెక్టరేట్ల ముందు జిల్లా కమిటీ నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఎస్.హారీష్‌ను కలసి వినతిపత్రం అందచేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం తదితర సమస్య లను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, కార్యదర్శులు గుడిగ రఘు, ఎస్.కే.సలీమ కార్యవర్గ సభ్యులు, కె.పాండురంగారావు, పి. నాగవాణి, మణిమాల, నాయకులు యర్రమిల్లి రామారావు, శ్రీనివాస్ గౌడ్, రవికుమార్, సిహెచ్ రంగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యకు 15 శాతం నిధులు కేటాయించేలా సిఎంకు నివేదిస్తా

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించే అంశాన్ని సిఎం రేవంత్‌రెడ్డిని సంప్రదించి కమిషన్ తరఫున నివేదిక అందజేస్తామని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విద్య రక్షణకు ఉద్యమించాలని, విద్యా హక్కు కల్పిం చకపోతే దళితులు చదువుకు దూరమయ్యేవారని అన్నారు. ప్రొఫెసర్ కె.లక్ష్మీ నారయణ మాట్లాడుతూ మనువాద భావాజాలం వల్లనె విద్యకు బడ్జెట్ కేటాయించకుండా దళితులను విద్యకు దూరం చేసే కుట్ర చెస్తున్నారన్నారు. యంవి పౌండేషన్ జాతీయ కార్యదర్శి ఆర్.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామి ప్రకారం 15 శాతం బడ్జెట్ కేటాయించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణకు కట్టుబడి ఉన్నాం

### బోర్డు సమావేశంలో మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** వన్య ప్రాణుల సంరక్షణ విషయంలో ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన 8వ రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వన్య ప్రాణుల సంరక్షణ, అటవీ, పర్యావరణ పరిరక్షణ అంశాలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరిగింది. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ అటవీ, జీవవైవిధ్య నిర్వహణ మెరుగుపరిచే దిశగా నిపుణుల సూచనలను ఆమె స్వాగతించారు. 7వ ఎస్‌బిడబ్ల్యూ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించిన మంత్రి.. జాతీయ వన్యప్రాణుల సంరక్షణ మండలి సమీక్షకు పంపిన పలు రాష్ట్ర ముఖ్య ప్రాజెక్టులపై ఆరా తీసారు. సమావేశంలో ప్రధాన అటవీ సంరక్షణాధికారి మాట్లాడుతూ 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు ఏర్పాటు తప్పనిసరిగాజరగాల్సిన అంశమని వివరించారు.జీవో నం 52, (2.12.2024) ద్వారా తెలంగాణలో ఎస్‌డబ్ల్యూ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పోచారం వన్యప్రాణుల అభయారణ్యం నుంచి వెళ్లే మెదక్ యల్లారెడ్డి రహదారి విస్తరణకు అనుమతి మంజూరు చేశారు.అటవీ ప్రాంతాల్లో వీనీది లైన్ల ఏర్పాటు ప్రతి పాదనలపై చర్చ జరింది.ములుగులో 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, నాగార్జునసాగర్ డివిజన్‌లో పెద్దగట్టు ఎత్తిపోతల పథకానికి అనుమతి మంజూరు చేశారు. యానిమల్ పాసేజ్‌ల మార్పుల కోసం 18 ప్రతిపాదనలు, మొబైల్ టవర్ల కోసం 13 ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. ఎన్‌బిడబ్ల్యూకు పంపే ముందు అవసరమైన సవరణలపై చర్చించారు.మీసేవ ద్వారా యానిమల్‌మ్యాన్ కాంఫ్లిక్ట్ బాధితులకు పరిహారం చెల్లించడానికి కార్పస్ నిధి గురించి ఈ సమావేశంలో చర్చించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ల నుంచి 1,088 కుటుంబాల పునరావాసం వివరాల పై అధికారుల నుంచి వివరాలలను మంత్రి అడి తెలుసుకున్నారు.కమ్యూనిటీ ఆధారిత ఎకో టూరిజం ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించడమే కాకుండా అలాగే కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో భారీ వాహనాల రాకపోకలపై నిషేధాన్ని తొలగించే అంశాలను ఈ సమావేశంలో పరి శీలిం చారు. రాష్ట్ర వ్యాప్తంగా జంతు ప్రదర్శనశాలలు, జాతీయ పార్కులు, ఇంకా పట్టణ పార్కుల అభివృద్ధి కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.స్థానిక సేంద్రీయ చెట్లను ప్రాధాన్యతగా పెంచి, సహజ అటవీ వ్యవస్థను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా బోర్డు సభ్యుల సూచనలను మంత్రి కొండా సురేఖ అభినందించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, రామ్‌దాస్ నాయక్, ముఖ్య కార్యదర్శి నదీమ్, శిదిదినీ దోబ్రియాల్, ఎలు సింగ్, మంత్రి పీఎస్ సోమరాజు, ఇతర న్నతాధికారులు పాల్గొన్నారు.

## సోమేశ్వరాలయంలో అరుదైన భైరవుడి శిలావిగ్రహం

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చిన్న శంకరం పేటలోనీ సోమేశ్వరాలయంలో చాళుక్యులు కాలంనాటి అరుదైన భైరవుడి విగ్రహం ఉందని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన శ్రీసోమేశ్వర ఆలయంలోని విగ్రహాలను పరిశీలిస్తుండగా భైరవుడి విగ్రహం కనిపించింది. దానిని పరిశీలించి ఈ విగ్రహం అరుదైనదని చతుర్భుజుడైన భైరవుడికి వెనుక చేతులలో త్రిశూలం, డమరుకం ఉన్నా యని తెలిపారు. ముందు చేతులలో ఖడ్గం చెవులకు పెద్ద కుండలాలు మెడలో కపాల మాలతో సర్వాంగ సుందరంగా చెక్కి ఉన్నట్లు ఆయన వివరిం చారు. భైరవుని శిల్పాలు అనేక ప్రదేశాల్లో ఉంటాయని కాకపోతే శ్రీసోమేశ్వర ఆలయంలో ఉన్న భైరవుడు చాలా అరుదైనదని ఆయన తెలిపారు.


సోమేశ్వరాలయంలోని చాళుక్యుల కాళంనాటి అరుదైన భైరవుడి శిలావిగ్రహం

## ఐఐటి హైదరాబాద్‌తో జర్మన్ విశ్వవిద్యాలయం భాగస్వామ్యం

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 24. ప్రభాతవార్త :** హైడెల్బర్గ్ విశ్వవిద్యాలయం (జర్మనీ) హైదరాబాద్ హబ్ ఇన్ అడ్వాన్స్‌డ్ కెమికల్ ఎడ్యుకేషన్‌ను సోమవారం ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో ప్రకటించింది. దీనికి సంబంధించి ఆయా సంస్థల ప్రొఫెసర్లు ఐఐటి హైదరాబాదులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ హబ్‌ను జర్మనీలోని హైడెల్బర్గ్ యూనివర్సిటీ, భారతదేశంలోని ప్రతిష్టాత్మక సంస్థలైన ఐఐటి హైదరాబాద్, టిఐఎఫ్ఆర్ హైదరాబాద్‌ల భాగస్వామ్యంతో ప్రారంభించింది.

హైదరాబాద్‌లో మంచి వనరుల లభ్యత, ఐఐటి హైదరాబాద్, పిఐఎఫ్ఆర్ హైదరాబాద్‌తో సత్సంబంధాల కారణంగా హైదరాబాద్‌ను హబ్‌గా యెంచుకోవడం జరిగిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. హైడెల్బర్గ్ యూనివర్సిటీ జర్మనీలోనే పురా తనమైన విశ్వవిద్యాలయంగా, అంతరశాఖీయ పరి శోధన, విద్యారంగంలో ప్రపంచ నాయకత్వాన్ని కలిగి ఉందని, హైదరాబాద్‌లోని సంస్థలతో ఇప్ప టికే ఉన్న భాగస్వామ్యాలను విస్తరించు కుంటూ, ఈ విశ్వవిద్యాలయం ఒక దీర్ఘకాల ఇండోజర్మన్ కార్యక్రమంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తోందని అన్నారు ఈ హబ్ ద్వారం ద్వైపాక్షిక మరియు బహుపాక్షిక అకడమిక్అకడమిక్, అకడమిక్ఇండస్ట్రీ భాగస్వామ్యాలను బలోపేతం చేయడంతోపాటు రసాయన శాస్త్ర పరిశోధన, ఆవిష్కరణలు, సాంకేతిక బదలీ, విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ముందుకు సాగు తుం దన్నారు కార్యక్రమంలో ప్రొఫెసర్ కట్యా పట్సెల్ మేటర్న్, ప్రొఫెసర్ ఆండ్రియాస్ డ్రాఫ్, ప్రొఫెసర్ జి నరహరిశాస్త్రి, ప్రొఫెసర్ ఎం కృష్ణ మూర్తి, హైదరాబాద్ డాక్టర్ సుబూర్ భక్త్ పాల్గొన్నారు.

## అదానీని రక్షించడానికే మోడీ అమెరికా పర్యటన

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో ముద్దాయిగా ఉన్న భారత కార్పొరేట్ దిగ్గజం అదానీని రక్షించేందుకే ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన ప్రధాన ఉద్దేశ్యంగా కన్పిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఈ మేరకు ఆయన అమెరికా పార్లమెంట్ ముందు నుంచి సోషల్ మీడియా వేదికగా ఒక వీడియో సందేశం ఇచ్చారు. నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్‌టన్‌లో ట్రంప్‌ను కలిశారని, మరోవైపు ఎలాన్‌మస్క్‌ను కలిశారని నారాయణ గుర్తుచేశారు. మోదీ చాలా మంచివారని ట్రంప్ మాట్లాడుతున్నారని అన్నారు. మస్క్‌ను కలిసిన తర్వాత అర్థమైనదేమిటంటే.. ఇప్పటికే న్యూయార్క్ కోర్టులో భారతదేశ కార్పొరేట్ దిగ్గజమైన అదానీపైన లంచం కేసు ఒకటి నమోదైందని గుర్తుచేశారు. ఇదే అమెరికా గడ్డ వేదికగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఒప్పంద వ్యవహారంపై ఈ లంచం వ్యవహారం వెలుగు చూసిందన్నారు. ఈ ఒప్పందంలో దాదాపు రూ. 2 లక్షల కోట్లు అదానీకి లాభం చేకూర్చేటట్లుగా, ఆంధ్రప్రదేశ్ ప్రజానికంపై భారం మోపేలా ఈ ఒప్పందాలు జరిగాయని వివరించారు. దీంతో అదాని ముద్దాయిగా ఆరోపణలున్నాయని, దీనిపై ఫిర్యాదు రావడంతో న్యూయార్క్ కోర్టులో కేసు నమోదైందని చెప్పారు. మోదీ అమెరికా పర్యటనలో భాగంగా మస్క్‌తో భేటీ అనంతరం. .ఇది అదానీని రక్షించేందుకేనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయని నారాయణ అన్నారు. అమెరికాలోని కార్పొరేట్ దిగ్గజం, భారత్‌లోని కార్పొరేట్ దిగ్గజం ఒక్కటేనన్నీ, అదానీని కాపాడే యత్నాలు కొనసాగు తున్నాయని విమర్శించారు.

## మోడల్ స్కూల్ ప్రవేశపరీక్షల దరఖాస్తు గడువు మార్చి 10 వరకు పెంపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతిలో ప్రవేశాలతో పాటు 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దరఖాస్తు గడువు ఈ నెల 28 వరకు ఉండగా.. గడువును కాస్త మార్చి 10 వరకు పొడిగించినట్టు మోడల్ స్కూల్ అడిషన్ డైరెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రతి మోడల్ స్కూల్‌లో 100 సీట్లు అందుబాటులో ఉంటాయని.. వాటితో పాటుగా 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మిగిలి పోయిన సీట్లను భర్తీ చేయడం కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఓసీ విద్యార్థులు రూ. 200 ఫీజు చెల్లించాల్సి ఉండగా.. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ. 125 ఫీజును చెల్లించాలని సూచించారు.

## మమ్మల్ని బేషరతుగా తీసుకోవాలి

### సిఎం సలహాదారుడు నరేందర్‌రెడ్డికి వీఆర్ఓ జెఎసి నాయకుల వినతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** నూతన గ్రామ రెవెన్యూ వ్యవస్థను శాస్త్రీయ పద్ధతిలో రూపకల్పన చేసి, గతంలో వీఆర్వోలుగా పని చేసిన తమను ఎలాంటి షరతులేకుండా తీసుకోవాలని జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సీఎం సహాదారుడు వేం నరేందర్ రెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థ రద్దు సందర్భంగా రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వానికి సంబంధించిన ఖరీదైన భూములన్ని అన్యాకాంతం చేశారని, గ్రామ రెవెన్యూ వ్యవస్థ ఉన్నప్పుడు ఒక గజం భూమి భూకబ్జాదారుల చేతిలోకి వెళ్లలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కొంత మంది ఉన్నతాధికారుల తప్పుడు ఆలోచనలతో సీఎంకి తప్పుడు సూచనలు చేసి తప్పుదారి పట్టిస్తున్నారని, అలాంటి ఉద్యోగులను స్థానచలనం చేయాలని విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో ప్రవేశపెట్టిన గ్రామ రెవెన్యూ వ్యవస్థను యథావిధిగా స్థాపించాలన్నారు.ఉన్నతాధికారుల తప్పుడు ఆలోచన విధానాల వల్ల గ్రామ రెవెన్యూ వ్యవస్థలో నియమించబోయే ఉద్యోగులు కొంత మంది బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిని గ్రామ రెవెన్యూ వ్యవస్థలో నియమించవద్దన్నారు.విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి వీఆర్వోల జేఏసీ నాయకులతో ఒక సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో కృష్ణమాదిగ వైఖరిని ప్రకటించాలి : పిడమర్తి రవి

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఎస్సీ వర్గీకరణ చేసిన కాంగ్రెస్ పార్టీకి మద్దతా?, లేక పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టని బిజెపికి మద్దతు ఇస్తున్నారో? తెల్చి ప్రకటన చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి, పలు మాదిగ సంఘాలు డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవి మాట్లాడుతూ మాదిగల చిరకాల కోరిక, మూడు దశాబ్దాల పోరాటం, అమర వీరుల త్యాగాల ఫలితంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వర్గీకరణ చేసిందని చెప్పారు. రాష్ట్రంలో 9.75 శాతం రిజర్వేషన్‌లు మాదిగలకు కల్పిస్తూ సిఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం అమోదింపజేశారని, త్వరలో చట్టం రూపంలోకి వస్తుందన్నారు. ఇందుకు కృతజ్ఞతతో కృష్ణమాదిగ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

# వర్గీకరణలో మాదిగలకు తగిన వాటాను ఇవ్వాలి

### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

**హైదరాబాద్ (కంటోన్మెంట్), ఫిబ్రవరి 24, ప్రభాత వార్త:** అందరికీ న్యాయం జరిగేలా ఎస్సీ వర్గీకరణ చట్టం తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సికిందరాబాద్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను మాలలు మినహా ఎస్సీలలో మిగితా 58 కులాలు కోరుతున్నాయని అన్నారు. లక్షల డప్పుల ఉద్యమ ప్రభావంతోనే ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను ఆగమేఘాల మీద శాసనసభలో ఆమోదించిందని అన్నారు. అయితే జస్టిస్ షమీమ్ అక్తర్ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో ఏ మాత్రం శాస్త్రీయత గానీ, హేతుబద్ధత గానీ పాటించలేదని అన్నారు. అయితే ప్రభుత్వం నివేదికను పూర్తిగా అధ్యయనం చేయకుండానే ఆమోదించిందని అన్నా రు. మాదిగల జనాభాను పరిగణనలోకి తీసుకున్నా లేదా వెనుకబాటుతనం ఆధారంగా తీసుకున్నా 12 శాతం రిజర్వేషన్లు రావాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ ప్రకారం మూడు గ్రూప్‌లు చేస్తే ఒక గ్రూప్‌లో వెనుకబాటు తనం మరొక గ్రూప్‌లో జనాభా మరొక గ్రూప్‌లో ఏ ఆధారం లేకుండానే రిజర్వేషన్లు కేటాయించి అశాస్త్రీయంగా వర్గీకరణ చేశారన్నారు. ఈ తప్పులను లోపాలను సవరించాలని, అందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చూడాలని అన్నారు. ప్రభుత్వం అందరికీ న్యాయం జరిగేలా ఎస్సీ వర్గీకరణ చేసేంత వరకు మాదిగ జాతి అప్రమత్తంగా ఉండాలన్నారు. న్యాయమైన వాటా కోసం మరో పోరాటాన్ని సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ అధ్యక్షత వహించగా మాజీ పార్లమెంటు సభ్యులు వెంకటేష్ నేత, బిసి నేత డా. పృథ్వీరాజ్ యాదవ్,సయ్యద్ ఇస్మా యిల్, హోలియా దాసరి రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్, సీనియర్ నాయకులు జానకి రామయ్య తదితరులు పాల్గొన్నారు.



# బాణాసంచా తయారీ యూనిట్‌లో పేలుడు

### ముగ్గురు మహిళల మృతి

**ధర్మపురి, ఫిబ్రవరి 24:** తమిలనాడులోని ధర్మపురిజిల్లా మురుకుంపట్టి గ్రామంలో బాణసంచా తయారీ కర్మాగారంలో సంభవించిన పేలుడులో ముగ్గురు మహిళలు మృతిచెందారు. వీరిలో ఇద్దరు అక్కాచెల్లెళ్లేకాగా మరొక మహిళకూడా చనిపోయినవారిలో ఉన్నారు. పేలుడు ధాటికి శరీరం ముక్కలయి శరీరభాగాలు వందమీటర్ల దూరం వరకూ చెల్లాచెదరయ్యాయి. బాణాసంచా తయారీలో రసాయనాల మిళితంచేస్తుండగా ఈపేలుడు జరిగిందని అగ్నిమాపక అధికారి పి అంబిక తెలిపారు. మృతులు తిరు మంజు, వి తిరుమలార్, ఎం సెంబాగమ్‌లుగా గుర్తించినట్లు తేలింది. వీరంతా కూడా కంబైనల్లూరుసమీపంలోని హూమిసముతిరియన్ ప్రాంతానికి చెందినవారు. మొత్తం నలుగురు పనిచేస్తుండగా ఒక మహిళ తృటిలో ఈప్రమాదంనుంచి తప్పించుకుంది. ఆమె కొద్దినిమిషాలక్రితమే భోజనాలని వెళ్లడంవల్ల ప్రాణహానినుంచి తప్పించుకుంది. యూనిట్ యజమాని చిన్నదురై కంబైనల్లూరుపోలీసులకు ఈ ప్రమాదం విషయమై సమాచారం అందించాడు. భారీ ఎత్తున పేలుడు శబ్దాలు రావడంతోగ్రామంలోని ప్రజలు ఇళ్లనుంచి బయటికి పరుగులుతీసారు. ప్రమాదస్థలంలో మృతుల శరీర భాగాలు విసిరివేసినట్లు పడి ఉండటాన్ని గుర్తించారు.

# రైతుల ఖాతాల్లో పిఎం కిసాన్ సాయం

### 9.80 కోట్ల మందికి రూ.22 వేల కోట్లు విడుదల

### టిజికి రూ.627 కోట్లు, ఎపికి రూ.836 కోట్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** దేశంలోని రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన 19వ విడత నిధులను విడుదల చేసింది. బీహార్‌లోని భాగల్పూర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సభలో పిఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం 19వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బటన్ నొక్కి ప్రారంభించారు. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న 9.80 కోట్ల మంది చిన్న, మధ్య తరహా రైతులకు నేరుగా ఖాతాల్లో కిసాన్ సమ్మాన్ నిధిని 2 వేల రూపాయల చొప్పున జమవుతున్నాయి. ఈ 19వ విడతలో దాదాపు 9.80 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాలకు 22 వేల కోట్ల రూపాయలను బదిలీ చేయబడుతాయి. ఇక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విషయానికి వస్తే ఈ 19వ విడతలో ఆంధ్రప్రదేశ్‌లో 41,22,499 మందికి 836.31 కోట్ల రూపాయలు, తెలంగాణలో 30,77,426 మందికి 627.46 కోట్ల రూపాయలను ఈ పథకం కింద నిధులు విడుదల చేశారు.

కాగా, పిఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద 2 వేల రూపాయల చొప్పున 3 దఫాలుగా 6 వేల రూపాయలను పంటల పెట్టుబడి సాయం కింద ఒక్కో రైతుకు కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తున్న విషయం తెలిసిందే. 2019లో ప్రారంభం అయిన ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 18 విడతల్లో మొత్తం 3.46 లక్షల కోట్ల రూపాయలను మేర రైతుల బ్యాంకు అకౌంట్లలో కేంద్రం జమ చేసింది. ఇక తొలివిడతలో 6,324.24 కోట్ల రూపాయలతో ప్రారంభమైన ఈ పిఎం కిసాన్ పథకం 19వ విడత వచ్చేసరికి 22 వేల కోట్ల రూపాయలకు చేరింది.

# ఢిల్లీ అసెంబ్లీ సమావేశాల మొదటిరోజే ఆప్ నిరసన



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** దేశరాజధానిలో బిజెపి అధికారంలోకి వచ్చినతర్వాత తొలిసారి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించారు. ప్రతిపక్ష ఆమ్ ఆద్మీపార్టీ నేతలు మొదటిరోజే సభలో భారీ ఎత్తున నిరసనలు చేపట్టారు. సీఎం కార్యాలయం నుంచి బిఆర్ అంబేడ్కర్ భగత్‌సింగ్‌లఫోటోలు తొలగించారని అసెంబ్లీలో ప్రతిపక్షనేత అతిశి ఆరోపించారు. బిజెపి దళిత వ్యతిరేక పార్టీ అని మరోసారి రుజువైందన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో బాబా సాహెబ్ అంబేడ్కర్ భగత్‌సింగ్‌లఫోటోలు ఏర్పాటుచేసారనిఅన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చినవెంటనే సీఎం ఆఫీస్‌నుంచి వారిఫోటోలు తొలగించారని అన్నారు. అసెంబ్లీ సమావేశానికి ముందు ఆప్ నేతలు అసెంబ్లీ వెలుపల ఆందోళనకు దిగారు. బిజెపి ప్రభుత్వం తమ మొదటి కేబినెట్ సమావేశంలోపు ప్రతిమహిళ ఖాతాలో రూ.2500 వేస్తామని హామీ ఇచ్చి మాటతప్పిందని ఆప్ ఎ మ్మెల్యేలూరోపించారు. మార్చి 8 నాటికి ఢిల్లీలోని ప్రతి మహిళ ఖాతాలో మహిళా సమ్మాన్‌యోజన మొదటి విడత సొమ్ములు వేయాలని డిమాండ్‌చేసారు. రెండురోజులుగా సీఎంను కలవడానికి తమకు సమయం కూడా ఇవ్వడంలేదన్నారు. విపక్షాలనిరసనలపై ఢిల్లీ స్పీకర్ విజేందర్‌గుప్తా ఆగ్రహం వ్యక్తంచేసారు. సభ సజావుగా సాగడం ఇష్టంలేదని, సభకు అంతరాయం కలిగించాలనే లక్ష్యంతో వారు ఇక్కడికి వచ్చారని అన్నారు ఈ సమావేశాలను రాజకీయం చేయొద్దని ఆప్‌నేతలను వారించారు. ఈ గందరగోళంమధ్య సభ 15 నిమిషాలు వాయిదావేసారు.

# కార్మికుల ప్రాణాల కంటే ఎన్నికల ప్రచారమే ముఖ్యమా?

### సిఎం రేవంత్‌రెడ్డిపై మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 24:** సీఎం రేవంత్ రెడ్డికి కార్మికుల ప్రాణాల కంటే కూడా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారమే ముఖ్యమైనదని బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రికి మానవత్వం లేదని మండిపడ్డారు. మంత్రులకు ఫొటోలపై ఉన్న శ్రద్ధ.. కార్మికుల ప్రాణాలను కాపాడటంలో లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవర్తన అత్యంత అభ్యంతరకరంగా ఉందని అన్నారు. టన్నెల్‌లో చిక్కుకుపోయిన 8 మంది కార్మికుల ప్రాణాల గురించి తెలంగాణ ప్రజలు ఆతృతగా ఆరా తీస్తున్నారని.. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తోలుమందంతో వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం దురదృష్టకరమని, 8 మంది కార్మికులు ఇంకా టన్నెల్‌లోనే చిక్కుకుని ఉన్నారని, వారి ప్రాణాలను కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారే అయినప్పటికీ.. తెలంగాణ పునర్నిర్మాణంలో బయట రాష్ట్రాల కార్మికుల పాత్ర ఎంతో ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో 35 లక్షలమంది బయటి రాష్ట్రాల కార్మికులు పనిచేస్తున్నారని జగదీశ్‌రెడ్డి తెలిపారు.

# వైఎస్సార్సీకి ప్రతిపక్ష హోదా రాదు..

### ఆ పార్టీ సభ్యులు హుందాగా వ్యవహరించాలి: ఎపి డి.సిఎం పవన్



సోమవారం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతిపక్ష హోదా అడిగితే ఇచ్చేది కాదని ప్రజలు ఇస్తేనే వస్తుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అత్యధిక మెజార్టీలో రెండో స్థానంలో ఉన్న పార్టీకి ప్రతిపక్ష హోదా ఇస్తారన్నారు. ఈ విషయంలో వైకాంగ్రెస్‌పార్టీ సభ్యులు హుందాగా ప్రవర్తించాలని హితవు పలికారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మీడియా పాయింట్ వద్ద పవన్ మాట్లాడారు. వైకాపా సభ్యులు ప్రతిపక్ష హోదా కోరుతున్నారు. సభలో రెండో అతిపెద్ద పార్టీ జనసేన మాకంటే ఒక్క సీట ఎక్కువ వచ్చినా వాళ్లకి ఆ హోదా దక్కేది. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభను అడ్డుకుంటామని చెప్పడం సరికాదు. ప్రజలు ఇచ్చిన 11 సీట్లను గౌరవించి అసెంబ్లీకి రండి. సమస్యలు , ప్రభుత్వ లోటుపాట్లు తెలియజేయండి. సంఖ్యకు అనుగుణంగా స్పీకర్ సమయం కేటాయిస్తారు. వైకాపా సభ్యులు హుందాగా ప్రవర్తించాలి. సభకు రాగానే ఆందోళన చేయడం ఆ పార్టీ దిగ జారుడు తనానికి నిదర్శనం. ఫిక్స్ అయిపోండి 11 సీట్లతో ఈ ఐదేళ్లు వైకాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా రాదు. వాళ్లని అవమాన పరచాలనో తగ్గించాలనో కాదు. ఆ హోదా ఇవ్వడానికి నిబం ధనలు ఉన్నాయి. దాన్ని దృష్టిలో పెట్టుకుని సభ్యులు ప్రవర్తించాలి. ఓట్ల శాతాన్ని దృష్టిలో పెట్టుకుంటే వారు జర్మనీ వెళ్లిపోవాలి అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. గవర్నర్ ప్రభుత్వం తరఫున సందేశాన్ని ముందుకు తీసుకెళ్తున్న సమయంలో వైసీపీ వ్యవహరించిన తీరు బాగోలేదని విమర్శిం చారు. గత కొద్ది రోజులుగా గవర్నర్‌కు ఆరోగ్యం బాగోలేకపోయినప్పటికీ... సభకు వచ్చి ప్రసంగిం చినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్టుగా పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో వైసీపీ సీనియర్ నాయకులు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని నినాదాలు చేయడంతో పాటు, పేపర్లను సైతం చించివేశారని చెప్పారు. ప్రతిపక్ష హోదా అడిగితే వచ్చేది కాదని.. అది ప్రజలు ఇస్తేనే వస్తుందని అన్నారు. జనరల్‌గా అత్యధిక మెజారిటీ ఉన్నవారు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు.నెక్స్ట్ స్టేజ్‌లో ఉన్నవారికి ప్రతిపక్ష హోదా ఇస్తారు. గతంలో మేము ప్రభుత్వంలో ఉన్నాం కదా.. ప్రతిపక్ష హోదా కావాలని అడిగితే ఇవ్వరు. కనీసం జనసేన కంటే ఒక్క సీటు ఎక్కువ వచ్చినా వారికి ప్రతిపక్ష హోదా దక్కేది. ఈరోజు ప్రభుత్వంలో రెండో అతిపెద్ద పార్టీ జనసేన. వైసీపీ నాయకులు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాం, ప్రసంగాలను అడ్డుకుంటామని అనడం సరైన విధానం కాదు అని వైసీపీపై విమర్శలు చేశారు. వైసీపీకి ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని... 11 సీట్లు ఇచ్చారని, దానిని గౌరవించి వారు అసెంబ్లీకి రావాలని సూచించారు. నిబంధనల ప్రకారం వారు మాట్లాడేందుకు ఇవ్వాల్సిన సమయం ఇస్తారని అన్నారు. వైసీపీ హుందాగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. గొడవ పెట్టుకోవాలనే ఆలోచనతో అసెంబ్లీకి రావడం దిగజారుడు ఆలోచన విధానమమని పవన్ కల్యాణ్ విమర్శించారు. ఈ ఐదేళ్లలో వైసీపీకి ప్రతిపక్ష రాదని ఇందుకు వారు మానసిక సిద్ధమైపోవాలని అన్నారు. ఇది సీఎం చంద్రబాబు నాయుడు, జనసేన డిసైడ్ చేసేది కాదని... రూల్స్ ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# సిఎం మాటల్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయం

### ఫోన్ ట్యాపింగ్, ఇ ఫార్ములా, కాళేశ్వరం కేసులను సిబిఐకి అప్పగించాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎవరి ఒత్తిడితోనో పాల్గొన్నారో చెప్పాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో సిఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి స్పందించారు. మూడు ఎమ్మెల్సీలలో ఒక్క సీటు వచ్చే అవకాశం లేదని, గెలిచే పరిస్థితులు లేకపోవడంతోనే సడెన్‌గా సిఎం రేవంత్ ప్రచారం చేశారన్నారు. సిఎం రేవంత్ ఇంకా ప్రతిపక్షంలో ఉన్నామనే ధోరణిలో మాట్లాడుతున్నారని అన్నారు. నిజామాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఓటమి భయంతో రేవంత్ పలు రకాల వ్యాఖ్యలు చేశారని, సిఎం వ్యాఖ్యలు తల తోక లేకుండా ఉన్నాయంటూ ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందే రేవంత్ చేతులు ఎత్తేశారని, ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయిన జరిగే నష్టం లేదని ఓటమిని ఒప్పుకున్నారని కిషన్‌రెడ్డి అన్నారు.

అలాగే రాష్ట్రంలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసును సిఎం రేవంత్ రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఒకవేళ ఈ ఫోన్ ట్యాపింగ్ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం వదిలిపెట్టినా బిజెపి వదిలిపెట్టదని అన్నారు. అలాగే రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఫోన్ ట్యాపింగ్ కేసుతో పాటు, ఈ ఫార్ము లా, కాళేశ్వరం కేసులను సిబిఐకి అప్పగించాలని కిషన్ రెడ్డి సవాల్ విసి రారు. చీకటి ఒప్పందాలు చేసుకో వాల్సిన అవసరం బిజెపికి లేదన్నారు. చీకటి ఒప్పందాలు చేసుకునే సంప్రదాయం కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. తనను విమర్శించే అర్హత సిఎంకి లేదని, కాంగ్రెస్ పార్టీ ఓడిపోతున్న భయంతోనే బిజెపిపై విమర్శలు చేస్తున్నా రన్నారు. తనపై బండి సంజయ్‌పై అనవసరంగా విమర్శలు చేస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డిలా తాను పార్టీలు మారలేదన్నారు. మజ్లీస్, బిఆర్ఎస్, కమ్యూనిస్ట్ పార్టీలతోనే కాకుండా దేశ వ్యతిరేక శక్తులతో సైతం ఈ కాంగ్రెస్ పార్టీ చీకటి ఒప్పందాలు చేసుకుందని గుర్తు చేశారు. బిజెపి ఏం చెబుతుందో.. అదే చేస్తుందని.. ఏం చేస్తుందో అదే చెబుతామని ఆయన పేర్కొన్నారు. అయితే సిఎం రేవంత్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు తాము బెదరమన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు అనుమతిని రేవంత్ రెడ్డి సీఎం కాకముందే తాను తీసుకు వచ్చానని.. అలాంటి తనపైనే సిఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పాలనలో రెండు పార్టీలు బిఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని ఆయన పేర్కొన్నారు. మార్చి 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలను బీజేపీ కైవసం చేసుకొంటుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లో బిజెపి కోసం తామంతా తీవ్రంగా కష్టపడ్డామని చెప్పారు. అందుకే రేవంత్ రెడ్డి కడుపు మంటగా ఉందన్నారు. ప్రభాకర్ రావు, శ్రవణ్ రావును తీసుకు వచ్చేందుకు విదేశాల్లో ఏమైనా బిజెపి ప్రభుత్వం ఉందా? అని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి చురకలంటించారు. తాము ఎవరితో కుమ్మక్కయ్యామో చెప్పాలని సిఎం రేవంత్‌కూ నిలదీశారు. భవిష్యత్తులో జరిగే మూడు రాష్ట్రాల ఎన్నికలలో బిజెపి గెలుస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు.

# సంక్షేమ గురుకులాల్లో ప్రవేశపరీక్ష నిల్

### 10 నుండి నేరుగా ఇంటర్‌లోకి ఎంట్రీ

### ఎస్సీ, ఎస్టీ, బిసి, గురుకుల విద్యాలయ సంస్థ నిర్ణయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుతూ పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి నేరుగా ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కల్పించాలని గురుకుల సొసైటీలు నిర్ణయం తీసుకున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇంటర్ గురుకుల కళాశాలల్లో వంద శాతం సీట్లను భర్తీ చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటి వరకు ఇంటర్ గురుకుల కళాశాలల్లో ప్రవేశం కల్పించడానికి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు సొసైటీలు వేర్వేరుగా ప్రవేశ పరీక్షలు నిర్వహించేవి. అందులో వచ్చిన మార్కుల ఆధారంగా ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ ఇచ్చేవారు. ఒక్క మైనార్టీ గురుకులాల్లో మాత్రం ఎవరు ముందు సీటు తీసుకోవడానికి వస్తారో వారికి అడ్మిషన్ ఇచ్చేవారు. అర్హత సాధించని విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో చేరేవారు. పేద విద్యార్థులు ప్రైవేటులో చేరే ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడేవారు. అర్హత సాధించిన వారు లేకపోవడంతో చాలా సీట్లు మిగిలిపోయేవి. దీన్ని నివారించేందుకు గురుకుల సొసైటీలు ప్రవేశ పరీక్ష లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నాయి.



# కర్ణాటక మఠానికి బాలీవుడ్ నటి రోబోటిక్ ఏనుగు బహుమతి

**బాలెహొన్నూరు, (కర్ణాటక) ఫిబ్రవరి 24:** బాలివుడ్‌నటి శిల్పాశెట్టికుంద్రా కర్ణాటకలోని రంభాపురి మఠానికి రోబోటిక్ ఏనుగును బహుమతిగా ఇచ్చింది. పదిలక్షలరూపాయల విలువైన ఈరోబోటిక్ ఏనుగు వాస్తవానికి నిజం ఏనుగులాగే కనిపిస్తోంది. తొండాన్ని ఊపుతుండటం, చెవులు రిక్కించి వినడటం, కళ్ల రెప్పలు కదల్చడం వంటివిచేస్తూ అసలు ఏనుగులాగానే దర్శనమిస్తోంది. భద్రనది తీరంలో ఉన్న రంభాపురి మఠం కర్ణాటకలోని ఐదు పంచ పీఠాల్లో ఒకటి. ఈ మఠానికి బాలివుడ్‌నటి ఈ రోబోఏనుగును బహూకరించారు. మఠం పీఠాధిపతి వీరసోమేశ్వరస్వామీజీ ఈ రోబోటిక్ ఏనుగుకు స్వాగతం పలికారు. ఈ ఏనుగుకోసం మఠంలో ఒక ప్రత్యేక వేదికను కూడా ఏర్పాటుచేసారు. నిజానికి ముందుగా శిల్పాశెట్టి నిజమైన ఏనుగునే బహుమతిగా ఇవ్వాలని భావించారు. అయితే న్యాయపరమైన చిక్కులు, వన్యమృగ సంరక్షణ చట్టాలనుంచి ఎదురయ్యే ఇబ్బందుల కారణంగా రోబోటిక్ ఏనుగును బహుమతిగా ఇచ్చారు. పెటా ప్రతినిధులు ఈ ఏనుగును మఠానికి తీసుకువచ్చారు. ఇకనుంచి మఠం సందర్శించే భక్తులకు ఈ ఏనుగు తన తొండంతో ఆశీస్సులు అందచేస్తుందనివారు ప్రకటించారు.

# కెసిఆర్, హరీశ్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 24:** మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన ఘటనలో భూపాలపల్లి జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. దీంతో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగడానికి నాసిరకమైన నిర్మాణంతో పాటు సరైన డిజైన్ లేకపోవడమే కారణమంటూ భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తి భూపాలపల్లి లోయర్ కోర్టులో క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని లోయర్ కోర్టు కొట్టివేయడంతో జిల్లా న్యాయస్థానంలో రాజలింగమూర్తి క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. రాజలింగమూర్తి పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన జిల్లా కోర్టు కేసీఆర్, హరీశ్‌రావుతో కలిపి ఆరుగురికి నోటీసులను జారీ చేసింది. భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జిల్లా కోర్టుకు పరిధి లేకున్నా పిటిషన్‌ను విచారణకు స్వీకరించిందని సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు ఇది విరుద్ధమని కేసీఆర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గత విచారణ సందర్భంగా జిల్లా కోర్టు ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసింది.

ఫిర్యాదుదారు రాజలింగమూర్తి గత వారం హత్యకు గురయ్యాడు. విచారణ సందర్భంగా ఈ విషయం హైకోర్టులో ప్రస్తావనకు వచ్చింది. జిల్లా కోర్టులో ఫిర్యాదు చేసిన వ్యక్తి మృతి చెందిన తర్వాత ఇక ఆ పిటిషన్‌ను ఎలా విచారిస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఫిర్యాదుదారు మృతి చెందినా పిటిషన్‌ను విచారించొచ్చని వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఈ మేరకు సుప్రీంకోర్టు తీర్పును చదివి వినిపించారు. మేడిగడ్డ బ్యారేజీ వల్ల లక్షా 30వేల కోట్ల ప్రజాధనం వృథా అయిందన్న విషయాన్ని ఫిర్యాదుదారు తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు పీపీ వాదించారు. ఇందులో ప్రజాప్రయోజనం ఉన్న దృష్ట్యా పిటిషన్‌ను విచారించొచ్చని పీపీ వాదించారు. గతంలో ఇదే హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం జిల్లా కోర్టుకు ఉత్తర్వులు జారీ చేసే అధికారం లేదని ఆ ఉత్తర్వులను కొట్టివేయాలని కేసీఆర్, హరీశ్ రావు తరఫు న్యాయవాది కోరారు. ఈ మేరకు హైకోర్టు తీర్పును చదివి వినిపించారు. రాజలింగమూర్తి ఫిర్యాదును భూపాలపల్లి లోయర్ కోర్టు కొట్టివేయగా ఫిర్యాదుదారు జిల్లా కోర్టును ఆశ్రయించారని ఈ పిటిషన్‌పై తీర్పును పున పరిశీలించాలని జిల్లా కోర్టు కింది కోర్టును ఆదేశించి ఉండాల్సిందని హైకోర్టు అభిప్రాయపడింది. ఇరువైపుల వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

# దేశానికి అన్నం పెట్టే రైతన్నతో కన్నీళ్లు పెట్టిస్తున్నారు

### కాంగ్రెస్ సర్కార్‌పై మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 24:** కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కష్టాలు ఎదుర్కుంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. మొన్న మహబూబాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ కోసం పోలీసులు టోకెన్లు జారీ చేస్తే.. నేడు జగిత్యాలలో రైతులు పాస్ బుక్కులు, ఆధార్ కార్డులు క్యూలో పెట్టిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోని రైతుల కన్నీళ్ల కడగండ్లను కాంగ్రెస్ సర్కార్ పునరావృతం చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో రైతే రాజుగా ఉన్న తెలంగాణలో రైతన్నను నట్టేట ముంచి, నడి రోడ్డు మీదకు తెచ్చిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందని హరీశ్‌రావు విమర్శించారు. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. యూరియా కోసం రైతులు మండుటెండల్లో తంటాలు పడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు డిక్లరేషన్ అని దగా చేసి, రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్ పేరుతో మోసం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను కంట నీరు పెట్టిస్తున్నరని అన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి రైతాంగానికి అవసరమైన యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

# బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు కసరత్తు షురూ!

### మార్చి 20 నాటికి కొత్త అధ్యక్షుడి ఎన్నిక



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** సంస్థాగతంగా పార్టీని మరింతగా బలోపేతంచేసేందుకు బిజెపి హైకమాండ్ ఫోకస్ పెంచింది. జిల్లాలు రాష్ట్రాల్లో సంస్థాగత ప్రక్రియ పూర్తిచేసిన పార్టీ ఇపుడు కేంద్ర కమిటీపై దృష్టిపెట్టింది. వచ్చేనెల 20వ తేదీలోగా బిజెపి జాతీయ అధ్యక్షుడు ఎన్నికవుతారని సంకేతాలు పంపిస్తోంది. పార్టీ రాష్ట్రవిభాగాల్లో ఎన్నికలు పూర్తికాగానే జాతీయ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహిస్తారు. జెపినడ్డా వారసుడిగా కొత్త అధ్యక్షుడి ఎన్నిక జనవరిలో జరగాల్సి ఉండగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బిజెపి రాష్ట్రవిభాగాల ఎన్నికలు పెండింగ్‌లో ఉన్నందువల్ల వాయిదాపడుతూ వచ్చింది. బిజెపి నియమావళి ప్రకారం సగానికి సగం రాష్ట్ర విభాగాలకు ఎన్నికలు జరగకుండా జాతీయ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించకూడదు. ప్రస్తుతం 28 రాష్ట్రాలు 8 కేంద్రపాలితప్రాంతాలకుగాను 12చోట్ల మాత్రమే ఎన్నికలు పూర్తిచేసారు. రానున్న కొద్దివారాల్లో ఆరురాష్ట్రాల్లో బిజెపి ఎన్నికలు జరుగుతాయి. ఆతర్వాతనే బిజెపి జాతీ య అధ్యక్షుడి ఎన్నిక ఉంటుంది. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా 2019 జూన్17న జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టి 2020జనవరి 20వరకూ కొనసాగారు. 2020 జనవరి 20న పార్టీ 11వ జాతీయ అధ్యక్షుడుగా ఎన్నికయి అప్పటినుంచి ఆ పదవిలో కొనసాగుతున్నారు. బిజెపి తొలి అధ్యక్షుడుగా అటల్‌బిహారీ వాజ్‌పేయి 1980నుంచి 1986 వరకూ పనిచేసారు. ఎల్‌కె అద్వాని పలుపర్యాయాలు పార్టీ అధ్యక్షుడుగా పనిచేసిన సంగతి తెలిసిందే. 1986 నుంచి 2005వరకూ ఆయన అధ్యక్షుడుగా కొనసాగారు. మురళీమనోహర్‌జోషి 1991 నుంచి 1993వరకూ కుషభవ్‌ఠాకరే 1998 నుంచి 2000వరకూ, బంగారు లక్ష్మణ్ 2000నపుంచి 2001, జానాకృష్ణమూర్తి 2001-02, ఎం వెంకయ్యానాయుడు 2002-2004వరకూ, రాజ్‌నాథ్‌సింగ్ 2005నుంచి 2009, 2013, 2014వరకూ నితిన్ గడ్కరీ 2010నుంచి 2013వరకూ అమిత్‌షా 2014నుంచి 2017వరకూ 2017 నుంచి 2020 వరకూ అధ్యక్షులుగాపనిచేసారు. జెపినడ్డా 2020 నుంచి అధ్యక్షపదవిలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం సగానికిపైగా రాష్ట్రాల ఎన్నికలు పూర్తిచేసి మార్చి 20నాటికల్లా జాతీయ అధ్యక్షుడిని నియమించే లక్ష్యంతో బిజెపి హైకమాండ్ కసరత్తులు ముమ్మరం చేసింది.

# బోనస్ కోసం రైతుల పడిగాపులు

### రూ.265 కోట్లకుపైగా బకాయిలు

### ఎమ్మెస్పీ బకాయి రూ.3.04 కోట్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** వరిధాన్యం సాగు చేసే రైతుకు ప్రభుత్వం బోనస్‌గా క్వింటాల్‌కు రూ.500 కనీస మద్దతు ధరతో కల్పి ఇస్తామని హామి ఇచ్చిన జాప్యం జరుగుతుండటంతో రైతుల్లో అసహనం పెరుగుతోన్నది. రాష్ట్రవ్యాప్తంగా 265కోట్ల రూపాయల మేరకు బోనస్ రైతులకు ప్రభుత్వం బకాయి చెల్లించాల్సి ఉంది. రాష్ట్రంలోని 8387కొనుగోలు కేంద్రాలలో వరిధాన్యం కొనుగోళ్లు ముగించేసి వాటిని మూసివేసి నెలలు గడిచినా చేతికి బోనస్ నగదు రావడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో 53.96 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తెలంగాణ ప్రభుత్వం సేకరించింది.

అందులో 5,86545 మంది రైతుల నుంచి 29.96లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డ ధాన్యం, 4,48,939 మంది రైతుల నుంచి 24లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం సేకరించారు. మొత్తంగా 10లక్షల 35,484 మంది రైతుల నుంచి రెండు రకాల ధాన్యం సేకరణ జరిగింది. దీనికిగాను 12513 .51కోట్లు కనీసమద్దతు కింద రైతులకు చెల్లించాల్సి ఉండగా 12510.47కోట్లు మాత్రమే చెల్లించారు. అంటే ఇంకా రూ.3కోట్ల నాలుగు లక్షల రూపాయలు కనీస మద్దతు ధరను కూడా రైతులకు బకాయిపడ్డారు. తెలంగాణ వ్యాప్తంగా వానాకాలంలో 60.39లక్షల ఎకరాలలో వరిధాన్యం సాగుచేస్తే అందులో సన్నాలు 36.80లక్షల ఎకరాలలో సాగుచేశారు. బోనస్ కోసం తెలంగాణ ప్రభుత్వం 1006.22 కోట్లు బడ్జెట్ కేటాయింపులు చేసింది.అందులో 900 కోట్ల మేరకు బోనస్ వరకు 3.64లక్షలకుపైగా రైతులకు చెల్లించారు. సివిల్‌సప్లయ్‌శాఖ బోనస్ చెల్లింపుల కోసం నిధులు లేకపోవడంతో దాదాపు 265కోట్ల మేరకు రైతులకు బోసన్ చెల్లింపుల కోసం చెక్కులు నేటికి రాయలేదు. ప్రభుత్వం నుంచి నిధులు వస్తేనే చెక్కులు జారీచేసే అవకాశం ఉంది.

# ఛాంపియన్‌షిప్ సాధించిన ఆండ్రీవా



**న్యూఢిల్లీ:** రష్యన్ టీనేజర్ మిర్రా ఆండ్రీవా తన కెరీర్‌లో అతిపెద్ద విజయాన్ని సాధించింది. ఈ టోర్నీలో హేమాహేమీ క్రీడాకారిణులను ఓడించిన ఆండ్రీవా తాజా ర్యాంకింగ్స్‌లో టాప్10లోకి ప్రవేశించింది. క్లారా టౌసన్‌ను76 (1), 61 తేడాతో ఓడించి దుబాయ్ ఛాంపియన్‌షిప్‌లను గెలుచుకుంది. ఈ విజయం ఆండ్రీవాను డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో టాప్ 10లోకి చేర్చింది. 2007లో నికోల్ వైడిసోవా తర్వాత ఈ ఘనత సాధించిన మొదటి 17 ఏళ్ల అమ్మాయిగా ఆమె నిలిచింది. కాగా 2023 వింబుల్డన్ ఛాంపియన్ మార్కెటా వొండ్రౌసోవా, ఐదుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ ఇగా స్వియాటెక్, 2022 వింబుల్డన్ ఛాంపియన్ ఎలెనా రైబాకినాపై విజయాలు సాధించిన ఆండ్రీవాకు ఇది అసాధారణమైన సంఘటనగా చరిత్రలో నిలిచింది. తద్వారా, 2004 డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో షరపోవా తర్వాత ఒకే ఈవెంట్‌లో ముగ్గురు ప్రధాన ఛాంపియన్‌లను ఓడించిన అతి పిన్న వయస్కురాలిగా ఆమె నిలిచింది. డబ్ల్యూటీఏ 1000 ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరుకున్న అతి పిన్న వయస్కురాలిగా కూడా ఆమె చరిత్ర సృష్టించింది. గత సంవత్సరం రొమేనియాలో జరిగిన ఇయాసి ఓపెన్‌లో ఆండ్రీవా గెలిచిన ఏకైక టైటిల్ ఇది.

# సిడ్నీ క్లాసిక్ స్క్వాష్ ఛాలెంజర్‌లో.. విజేతగా భారత్ స్క్వాష్ స్టార్ సౌరవ్



**న్యూఢిల్లీ:** భారత స్క్వాష్ స్టార్ సౌరవ్ ఘోషాల్ తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. గత ఏడాది ఏప్రిల్లో ఆట నుంచి వీడ్కోలు తీసుకున్న సౌరవ్ ఈ ఏడాది మళ్లీరాకెట్ పట్టాడు. ఆస్ట్రేలియాలో ముగిసిన ఆక్టేన్ ఓపెన్ సిడ్నీ క్లాసిక్ స్క్వాష్ చాలెంజర్ టోర్నీలో సౌరవ్ విజేతగానిలిచాడు. ఫైనల్లో ప్రపంచమాజీ పదో ర్యాంకర్ సౌరవ్11-2, 11-6, 11-2తోఈజిప్ట్‌దేశానికి చెందిన అబ్దుల్ రెహమాన్ నాసర్‌పై గెలుపొందాడు. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌లో కలిపి మొత్తం12 పతకాలు సాధించినసౌరవ్, ఈటోర్నమెంట్‌లో తన ప్రత్యర్థులకు ఒక్క సెట్ మాత్రమే కోల్పోవడం విశేషం. సెమీ ఫైనల్లో సౌరవ్ 11-9, 5-11, 11-1, 11-2తో ఆస్ట్రేలియాకు చెందిన రైస్ డౌలింగ్‌పై, క్వార్టర్ ఫైనల్లో 11-6, 11-6, 11-5తో దక్షిణ కొరియాకు చెందిన మిన్యూ లీపై, రెండో రౌండ్‌లో 11-8, 11-2, 11-8తో మాల్టాకు చెందిన కిజాన్‌పై గెలుపొందాడు. రెండో సీడ్‌గా బరిలోకి దిగిన సౌరవ్‌కు తొలి రౌండ్‌లో బై లభించింది. 2003లో ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) టూర్‌లో అరంగేట్రం చేసిన సౌరవ్ ఇప్పటివరకు 11 పీఎస్‌ఏ సింగిల్స్ టైటిల్స్ సాధించాడు. 18 టోర్నీలలో రన్నరప్‌గా నిలిచాడు.

# ఇంటర్నేషనల్ ఛాలెంజ్ టోర్నీలో రన్నరప్‌గా భారత్ షట్లర్ ఉన్నతి



## ఇండోనేసియా చేతిలో ఓటమి

**న్యూఢిల్లీ:** సింగపూర్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్ ఉన్నతి హుడా రన్నరప్‌గా నిలిచింది. సింగపూర్‌లో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో నాలుగో సీడ్ ఉన్నతి 17-21, 16-21 పాయింట్ల తేడాతో ఇండోనేసి యాకు చెందిన రుజానా చేతిలో పరాజయం పాలైంది. 42 నిమిషాల్లో ముగిసిన పోరులో ఉన్నతి వరుస గేమ్‌ల్లో ఓడింది. టోర్నీ ఆసాంతం రాణించిన ఉన్నతి రెండో రౌండ్‌లో ఆసియా క్రీడల పతక విజేత, ఆస్ట్రేలియాకు చెందిన సయిన కవాకమిను ఓడించింది. సెమీఫైనల్‌కు చేరే క్రమంలో చైనీస్ తైపీకి చెందిన ఇద్దరు షట్లర్లు సైయాంగ్ స్యూన్ లిన్, యీ టింగ్‌పై కూడా ఉన్నతి విజయాలు సాధించింది. సెమీఫైనల్లో ఉన్నతి 18-21, 21-19, 22-20తో వియత్నాంకు చెందిన థి ట్రాంగ్ వు ను చిత్తు చేసింది. తొలి గేమ్‌లో పరాజయం పాలైన తర్వాత తిరిగి పుంజుకున్న ఉన్నతి హోరాహోరీ పోరులో చక్కటి విజయంతో ఫైనల్ చేరింది. అయితే తుది పోరులో యువ షట్లర్ అదే జోరు కనబర్చలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఇక ఇదే టోర్నీలో భారత్‌కు చెందిన మరో యువ షట్లర్ దేవిక సిహాగ్ క్వార్టర్ ఫైనల్లో ఓటమి పాలైంది.

# ఛాంపియన్స్ ట్రోఫీలో.. లోపాలే పాక్ ఫెయిల్యూర్స్



## చెత్తగా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్
## పాకిస్థాన్ ఓటమికి ఇవే కారణాలు

**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో కీలకమైన మ్యాచ్‌లో పాకిస్తాన్ 6 వికెట్ల తేడాతో భారత్ చేతిలో పరాభవం చెందింది. ఈ విజయంతో, భారత జట్టు సెమీఫైనల్స్‌ల్లోకి అడుగుపెట్టింది. ఈ ఐసీసీ టోర్నమెంట్‌లో ఆతిథ్య పాకిస్తాన్ పరిస్థితి దయనీయమైంది. ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ ఓడిపోవడానికి జట్టులో లోపాలు కారణమయ్యాయి. మ్యాచ్ ప్రారంభంలో పాకిస్తాన్ భారత్ పై పైచేయి సాధించినట్టు కనిపించింది. కానీ, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ వంటి అన్ని విభాగాల్లోనూ ఒక్కొక్కటిగా లోపాలు బయటపడ్డాయి. బాబర్ ఆజం ఓపెనింగ్ బ్యాటింగ్‌లో విఫలం కావడం ప్రధాన కారణం. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ జట్టు ఆరంభం చాలా దారుణంగా ఉంది. బాబర్ ఆజం, ఇమామ్ ఉల్ హక్ నెమ్మదిగా ఆరంభించారు. దీని కారణంగా పవర్ ప్లేలో జట్టు స్కోరు చాలా తక్కువగా ఉంది. అలాగే, వన్డే సగటు 50 కంటే ఎక్కువ ఉన్న అనుభవజ్ఞుడైన బ్యాట్స్‌మన్ బాబర్ 23 పరుగులు చేసిన తర్వాత ఔటయ్యాడు. ఆ తర్వాత వెంటనే, ఇమామ్ కూడా రనౌట్ గా పెవిలియన్ కు చేరాడు. ఇక పవర్ ప్లేలోనే కాకుండా మిడిలార్డర్‌లో కూడా పాకిస్తాన్ బ్యాటింగ్ చాలా నెమ్మదిగా సాగింది. మహ్మద్ రిజ్వాన్, షకీల్ మూడోసారి 104 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు, కానీ దాని కోసం 144 బంతులు ఎదుర్కొన్నారు. దీని కారణంగా, ఒత్తిడి చాలా పెరిగింది. పరుగులు సాధించడానికి ప్రయత్నిస్తూ ఒకరి తర్వాత ఒకరు బ్యాట్స్‌మెన్ వరుసగా పెవిలియన్‌కు చేరారు. అలాగే పాక్ తన ఫాస్ట్ బౌలింగ్ పట్ల చాలా గర్వంగా ఉంటుంది. ఆ జట్టు ప్రధాన బలాల్లో పేస్ బౌలింగ్ అటాక్ ఒకటి. కానీ పాక్ పేస్ అటాక్ కూడా భారత బ్యాట్స్‌మెన్ ముందు పనిచేయలేదు. ప్రారంభం నుండే శుభ్ మన్ గిల్, రోహిత్ శర్మలు బౌండరీలు బాదడం మొదలుపెట్టారు. షాహీన్ షా, నసీమ్ షా బౌలింగ్ ను సైతం రఫ్ఫాడించారు. షాహీన్ రోహిత్‌ను అవుట్ చేసినప్పటికీ, అప్పటికి చాలా ఆలస్యమైంది. మరోపక్క భారత్‌తో పోలిస్తే స్పిన్ బౌలింగ్ సాధారణమే. మిడిలార్డర్‌లో భారత బ్యాట్స్‌మెన్‌ను పాకిస్తాన్ జట్టు అవుట్ చేయలేకపోయింది. స్పిన్ బౌలింగ్‌లో నాణ్యత కనిపించలేదు. అయితే, అబ్రార్ మంచి బంతితో శుభ్‌మన్ గిల్‌ను ఖచ్చితంగా అవుట్ చేశాడు. కానీ అతని బౌలింగ్ భారత స్పిన్నర్ల మాదిరిగా ప్రభావం చూపించలేదు. కాగా విరాట్ కోహ్లీని అవుట్ చేయడంలో విఫలమైంది. పాక్‌పై కోహ్లీ బ్యాట్ ఎప్పుడూ పనిచేస్తుంది. మరోసారి అదే జరిగింది. ఈ సారి కోహ్లీ 100 పరుగుల ఇన్నింగ్స్ తో భారత్ ను గెలిపించాడు. ఈ మ్యాచ్‌కు ముందు విరాట్ అంత ఫామ్‌లో లేడు. అయినప్పటికీ, కోహ్లీని అవుట్ చేయడానికి పాకిస్తాన్ వద్ద ఎటువంటి ప్రణాళిక ఉన్నట్లు అనిపించలేదు. ఏ బౌలర్ కూడా కోహ్లీని అడ్డుకోలేకపోయారు. ఇదే సమయంలో భారత్ ఫీల్డింగ్ లో కొన్ని తప్పిదాలు చేసినప్పటికీ బౌలింగ్, బ్యాటింగ్‌లో అదరగొట్టడంతో పాకిస్తాన్ ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది.

# కబడ్డీ ఛాంపియన్స్‌గా సర్వీసెస్




## ఉత్కంఠ పోరులో రైల్వేస్‌పై 6-4తో విజయం

**న్యూఢిల్లీ:** ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో సర్వీసెస్ జట్టు విజేతగా అవతరించింది. కటక్‌లో జరిగిన తుదిపోరులో సర్వీసెస్ జట్టు టైబ్రేక్‌లో 6-4 పాయింట్ల తేడాతో రైల్వేస్‌పై విజయం సాధించింది.

నువ్వా నేనా అన్నట్లు సాగిన పోరు నిర్ణీత సమయంలో 30-30 పాయింట్లతో సమం అయింది. దాంతో విజేతను తేల్చేందుకు టైబ్రేక్ నిర్వహించగా, సర్వీసెస్ రెండు పాయింట్లతో పైచేయి సాధించింది. ప్రొ కబడ్డీ లీగ్ స్టార్ నవీన్ కుమార్ సారథ్యంలో బరిలోకి దిగిన సర్వీసెస్ జట్టు టోర్నీ ఆసాంతం కనబర్చిన నిలకడనే ఫైనల్లోనూ కొనసాగించింది. పీకేఎల్ 11వ సీజన్ విజేతలైన జైదీప్ దహియా, రాహుల్ సర్వీసెస్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

అంతకుముందు సెమీఫైనల్లో సర్వీసెస్ 43-35 పాయింట్ల తేడాతో పంజాబ్‌పై విజయం సాధించగా, మరో సెమీస్‌లో రైల్వేస్ 42-34 పాయింట్ల తేడాతో ఉత్తరప్రదేశ్‌పై గెలుపొందింది.


# ఇపిఎఫ్‌ఒ భేటీపైనే ప్రైవేట్ ఉద్యోగుల ఆశలు..



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరచడానికి ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్‌ఒ) అందించే సేవలను ఆధునికీకరించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) కోసం ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్లపై వడ్డీ రేటును ఖరారు చేయడానికి ఇపిఎఫ్‌ఒకు సంబంధించిన అత్యున్నత నిర్ణయాధికార సంస్థ అయిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) ఫిబ్రవరి 28న సమావేశమవుతుంది. సీబీటీ సమావేశం ప్రతి త్రైమాసికంలో నిర్వహిస్తూ ఉంటారు. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రి అధ్యక్షతన ఏర్పడిన సీబీటీలో ఉద్యోగి సంఘాలు, కార్మిక సంఘాల ప్రతి నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రభుత్వ అధికా రులు కూడా ఉంటారు. ఇపిఎఫ్‌ఒ ప్రస్తుతం ప్రావి డెంట్ ఫండ్ డిపాజిట్లపై 8.25 శాతం వడ్డీ రేటును అందిస్తుంది. అయితే సీబీటీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కూడా అదే రేటును కొనసాగించేందుకు నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పలు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ రేటును ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదించడానికి ముందు ఫిబ్రవరి 28న సీబీటీ ఆమోదించాల్సి ఉంటుంది. 2023-24 ఆర్థిక సంవత్స రానికి ప్రస్తుతం 8.25 శాతం అందించే ఈ రేటు గత మూడు సంవత్సరాలలో ఇపిఎఫ్‌ఒ అందించే అత్యధిక వడ్డీ రేటుగా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి వడ్డీ రేటు 8.15 శాతం అందించగా, ఇటీవలి కాలంలో అత్యల్ప రేటు 2021-22లో 8.10 శాతమే అందించింది. గత దశాబ్దం కాలంలో ఇపిఎఫ్‌ఒ తరచుగా వడ్డీ రేట్లను మారుస్తోంది 2010-11లో అత్యధికంగా 9.50 శాతం వడ్డీ రేటును అందించింది. 2019 2021 మధ్య వడ్డీ రేట్లు 8.50శాతం వద్ద స్థిరంగా ఉన్నాయి. కోట్లాది మంది ఇపిఎఫ్‌ఒ సభ్యులకు రాబడిలో స్థిరత్వాన్ని నిర్ధారించడానికి ఇపిఎఫ్‌ఒ డిపాజిట్లపై స్థిర వడ్డీ రేటును అందించాలని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది.

# 8 నెలల కనిష్టానికి సెన్సెక్స్

**ముంబై, ఫిబ్రవరి 24:** దేశీయ మార్కెట్ల లో బేర్ పట్టు కొనసాగుతోంది. ట్రంప్ టారిఫ్ భయాల నుంచి సూచీలు కోలుకోవట్లేదు. దీనికి తోడు భౌగోళిక రాజకీయ పరిస్థితులు, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు మార్కెట్లను మరింత ఒత్తిడిలోకి నెట్టేస్తున్నాయి. దీంతో సోమవారం ఏకంగా 8 నెలల కనిష్టాలకు పడిపోగా, ఈ ఒక్క రోజే దాదాపు రూ.4 లక్షల కోట్లకుపైగా ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. చివరికి సెన్సెక్స్ 856.66 పాయింట్లు నష్టపోయి 74,454.41 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 242.55 పాయింట్లు నష్టపోయి 22,553.35 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ 4 పైసలు నష్టపోయి రూ.86.72 వద్ద స్థిరపడింది. ఆటో,





ఫార్మా, ఎఫ్ఎంసిజి మినహా దాదాపు అన్ని రంగాల షేర్లు కుదేలయ్యాయి. ముఖ్యంగా ఐటి, మెటల్, టెలికం సూచీలు 2 శాతం మేర పతనమయ్యాయి. నిఫ్టీలో విప్రో, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టిసిఎస్, టాటా స్టీల్ వంటి షేర్లు కూడా నష్టాలను చవిచూశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, ఐషర్ మోటార్స్, డాక్టర్ రెడ్డీస్, హీరో మోటార్స్, కోటాక్ మహీంద్రా బ్యాంకు వంటి షేర్లు లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. అమెరికాలో ట్రంప్ అధిక టారిఫ్‌ల అమలుతో అక్కడ ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదు కావొచ్చని, దాంతో బాండ్ల ప్రతిఫలాలు పెరిగి భారత్ వంటి వర్ధమాన విపణుల్లో విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపబోరని బ్రోకరేజీ సంస్థ నోమురా అంచనా వేస్తోంది. ఇది సూచీల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు నెలకొన్నాయి. ఇవి ఇప్పుడప్పుడే సద్దుమణిగేలా కనిపించట్లేదు. ఇక రూపాయి పతనం, అమెరికా డాలర్ రిజర్వ్‌లు తగ్గడం, దేశీయంగా కార్పొరేట్ సంస్థల డిసెంబరు త్రైమాసిక ఫలితాలు బలహీనంగా ఉండడం, జిడిపి వృద్ధిపై ఆందోళనలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలహీనపరుస్తున్నాయి.

# వాణిజ్యం

## క్వాలిటీ పవర్ ఐపిఒ లిస్టింగ్

**ముంబై, ఫిబ్రవరి 24:** సోమవారం కూడా స్టాక్ మార్కెట్‌లో భారీ క్షీణత వాతావరణం నెలకొంది. ఉదయం ట్రేడింగ్ సెషన్‌లోనే బిఎస్‌ఇ సెన్సెక్స్ దాదాపు 700 పాయింట్లు పడిపోయింది. దీంతో దాదాపు రూ.5 లక్షల కోట్ల పెట్టుబడిదారులు నష్టపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ఎనర్జీ ట్రాన్సిషన్ ఎక్విప్‌మెంట్ తయారీదారి క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్స్ (క్వాలిటీ పవర్) ఐపిఒ రిటర్న్ ఇచ్చింది. దీని షేర్లు రూ. 7.05 లేదా 1.66 శాతం ప్రీమియంతో బిఎస్‌ఇలో లిస్ట్ అయ్యింది. ఐపిఒ ద్వారా రూ.10 ఫేస్ వాల్యూ ఉన్న కంపెనీ షేరు రూ.425కి అందుబాటులోకి




వచ్చింది. బిఎస్‌ఇలో కంపెనీషేర్లురూ.432.05 వద్ద లిస్టయ్యాయి. ఇది దాని అత్యున్నత స్థాయి. అయితే కొద్ది కాలంలోనే, దాని షేర్లు రూ.415.85కి పడిపోయాయి. 1.18 శాతం ప్రీమియంతో రూ.430 వద్ద ఎన్ఎస్ఇలో లిస్ట్ అయ్యింది. క్వాలిటీ పవర్ ఐపిఒ రెండు వారాల క్రితం అంటే శుక్రవారం (14 ఫిబ్రవరి 2025) నాడు ప్రారంభమైంది. గత మంగళవారం (18 ఫిబ్రవరి 2025) ముగిసింది. క్వాలిటీ పవర్ ఐపిఒ ధర బ్యాండ్‌ను ఒక్కో షేరుకు రూ.401-425గా నిర్ణయించింది. హై వోల్టేజ్ ఎలక్ట్రిక్ పరికరాలు అలాగే పవర్ సొల్యూషన్స్ సంబంధిత ఉత్పత్తులను తయారు చేసే ఈ కంపెనీ ఐపిఒ ద్వారా రూ.858.70 కోట్లు సేకరించాలని ప్రణాళికవేసింది. ఇందులో రూ.225 కోట్ల విలువైన కొత్త షేర్లు జారీ చేసింది. అదనంగా, ఇప్పటికే ఉన్న 1.49 కోట్ల షేర్లను కూడా అమ్మకానికి ఉంచారు. క్వాలిటీ పవర్ ఐపిఒ దాదాపుగా ఆశించిన సబ్‌స్క్రిప్షన్ పొందలేదు. బిఎస్‌ఇ డేటా ప్రకారం, ఐపిఒ 1,11,12,530 షేర్లకు గాను 1,43,31,330 షేర్లకు బిడ్లను అందుకుంది. పబ్లిక్ ఇష్యూ మొత్తం 1.29 సార్లు సబ్‌స్క్రైబ్ చేయబడింది.

# ఇంటర్నెట్ లేకుండానే యుపిఐ చెల్లింపులు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండా, యూపిఐ చెల్లింపులు చేయడం సాధ్యం కాదని అందరూ అనుకుంటారు. కానీ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) ప్రారంభించిన 'స్టార్99హ్యాష్' సర్వీస్ ద్వారా ఇంటర్నెట్ కనెక్షన్ అవసరం లేకుండానే లావాదేవీలను పూర్తి చేయవచ్చు. ఇంటర్నెట్ కనెక్షన్‌లేకుండా యుపిఐ ట్రాన్సక్షన్ ఎలా చేయాలో చూద్దాం. 'స్టార్99హ్యాష్' సర్వీస్ ద్వారా ఇంటర్నెట్ కనెక్షన్ అవసరం లేకుండానే, బ్యాంక్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు. ఇంటర్‌బ్యాంక్ ఫండ్ బదిలీ చేయవచ్చు. యుపిఐ పిన్‌ను సెట్ చేసుకోవచ్చు, మార్చుకోవచ్చు. అయితే యుపిఐచెల్లింపులు చేయాలంటే కొన్ని టిప్స్ పాటించాల్సి ఉంటుంది. మీ బ్యాంకు ఖాతాకు లింక్ అయిన రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నుంచి 'స్టార్99హ్యాష్'కు డయల్ చేయాలి. డయల్ చేసిన తర్వాత భాషను ఎంచుకోవాలి. మీ బ్యాంకు పేరును ఎంటర్ చేసిన తర్వాత, మీ మొబైల్ నంబర్‌కు లింక్ అయిన బ్యాంకు ఖాతాల జాబితా కనిపిస్తుంది. కావాల్సిన ఖాతాను ఎంచుకోవాలి. ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయడానికి డెబిట్ కార్డు చివరి ఆరు అంకెలు, గడువు తేదీని ఎంటర్ చేయాలి. యుపిఐ పిన్ నంబర్ సెట్ చేయక పోతే, సెట్ చేసుకోవాలి. మీ ఫోన్‌లో 'స్టార్99హ్యాష్' డయల్ చేసిన తర్వాత డబ్బు పంపడానికి ఆప్షన్ ఎంచుకోవాలి. ఆ తర్వాత ఎవరికైతే డబ్బు పంపించాలనుకుంటున్నారో. వారి యుపిఐ ఐడి, బ్యాంకు ఖాతా నంబర్ ఎంటర్ చేయడానికి కావాల్సిన ఆప్షన్ ఎంచుకోవాలి. మీరు పంపించాలనుకున్న మొత్తాన్ని ఎంటర్ చేసిన తర్వాత, లావాదేవీలను ధృవీకరించడానికి పిన్ నంబర్ నమోదు చేయాలి.


# మెక్సికో ఆపిల్ ప్లాంట్లు యుఎస్‌కు తరలింపు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 24:** మెక్సికోలోని ఆపిల్ సంస్థ యూనిట్లను అమెరికాకు తరలించే యోచనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేసింది. టిమ్‌కుక్ మెక్సికోలో రెండు ప్లాంట్లను నిలివేశారని, దానికి బదులుగా అమెరికాలో ఉత్పత్తులను తయారు చేస్తారని అమెరికా గవర్నర్ల సదస్సులో ట్రంప్ పేర్కొన్నారు. పెరుగుతున్న ట్యారిఫ్ ఒత్తిళ్ల కొనసాగుతున్న అమెరికా-చైనా వాణిజ్య వివాదానికి ప్రతిస్పందనగా ఈ మేరకు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కొందరు చెబుతున్నారు. అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల టిమ్‌కుక్ ట్రంప్‌తో వైట్ హౌజ్‌లో సమావేశమయ్యారు. చైనాలో చూపిన తన తయారీ నుంచి భారీగా వివిధ దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. అందులో కొంతభాగం అమెరికా ఎగుమతి అవుతోంది. అయితే ఇటీవల అమెరికా- చైనాల మధ్య సుంకాల విషయంలో తీవ్ర చర్చ సాగుతున్న నేపథ్యంలో టిమ్ కుక్ ట్రంప్ బేటీ అయ్యారు. కానీ గతంలో మాదిరి కాకుండా ఈసారి ఆపిల్‌కు ఎలాంటి మినహాయింపులు ఉండవని ట్రంప్ సంకేతాలు ఇచ్చినట్లు, ఈ ఆలోచన ట్రంప్ కుక్‌తో సమావేశమైన మరుసటి రోజే యూఎస్‌కు తయారీ ప్లాంట్ తరలింపు ప్రకటన చేయడం చర్చనీయాంశం అయింది. అమెరికాలో వందల మిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతానని కుక్ హామీ ఇచ్చినట్లు ట్రంప్ తెలిపారు. ఈ పెట్టుబడి ఉద్యోగాలను సృష్టిస్తుంది. యూఎస్ సరఫరా గొలుసును బలపరుస్తుంది. ఉత్పత్తిని పునరుద్ధరించడం, బాహ్య ఆర్థిక ఒత్తిళ్ల నుంచి కీలక పరిశ్రమలను రక్షించేందుకు నిర్ణయించిన నిర్ణయాలు తన పరిపాలన విస్తృత లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఆపిల్‌పై ప్రభావం ట్రంప్‌కు సంబంధించి ఆపిల్ ఇంకా అధికారిక ప్రకటన చేయనప్పటికీ, తయారీ కార్యకలాపాలను అమెరికాకు తరలించడం ద్వారా దిగుమతి సుంకాల ప్రభావం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తుంది. ఇది లాభాల మార్జిన్లు, ధరలను ప్రభావితం చేస్తుంది. ఈ వ్యూహాత్మక మార్పు ఉద్యోగాల కల్పనతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని కొందరు అంచనా వేస్తున్నారు.



# ఎయిర్‌టెల్ కస్టమర్లకు ఆపిల్ టివిప్లస్

**ముంబై, ఫిబ్రవరి 24:** కస్టమర్లకు మెరుగైన కంటెంట్ సేవలు అందించేందుకు ప్రముఖ టెలికం సంస్థ ఎయిర్‌టెల్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. తమ వినియోగదారులకు ఆపిల్ టివి ప్లస్, ఆపిల్ మ్యూజిక్ కంటెంట్ సేవలను అందు బాటులోకి తీసుకొస్తోంది. దీని కోసం టెక్ దిగ్గజం ఆపిల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ మేరకు ఎయిర్‌టెల్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ సదుపాయం ఎయిర్‌టెల్ వైఫై, పోస్ట్‌పెయిడ్ కస్టమర్లకు అందుబాటులో ఉండనుంది. రూ.999 అంతకంటే ఎక్కువ ధర ఉన్న ప్లాన్లపై వైఫై యూజర్లు ఆపిల్ టివిప్లస్ కంటెంట్‌ను వీక్షించొచ్చు. పోస్ట్‌పెయిడ్ యూజర్లయితే ఇదే ప్లాన్లపై ఆపిల్ టివిప్లస్ కంటెంట్‌తో పాటు అదనంగా ఆరు నెలల పాటు ఉచితంగా ఆపిల్ మ్యూజిక్ యాక్సెస్‌ను పొందవచ్చని కంపెనీ ఆ ప్రకటనలో పేర్కొంది. కాగా గతేడాది ఆగస్టులోనూ ఎయిర్‌టెల్ కంపెనీ, ఆపిల్‌తో ఇదే తరహా ఒప్పందం కుదుర్చుకుంది. అప్పుడు ఎక్స్‌ట్రీమ్ ప్రీమియం సబ్‌స్క్రైబర్లకు ఆపిల్ టివిప్లస్, ఆపిల్ మ్యూజిక్ కంటెంట్‌ను అందు బాటులోకి తీసుకొచ్చింది. తాజా నిర్ణ యంతో సాధారణ వైఫై, పోస్ట్‌పెయిడ్ యూజర్లూ ఈ సేవలు పొందొచ్చు. దీంతో కస్టమర్లు హాలీవుడ్, అవార్డ్ విన్నింగ్ సినిమాలు వీక్షించొచ్చు.




Printed and Published by Girish Sangi, CMD And Manging Editor On Behalf Of Aga AGA Publications LTD, MGM Hospital road Warangal , TELANGANA-506002 RIN No ; 64849/96 Editor * Damerla Saibaba, * Responsible for Selection Of News Under the PRB Act. Regd : No.H/SD/337/12-14 postal line liance-L/R NP WGL-8/12-14